శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


భారత్‌– అమెరికా వాణిజ్య ఒప్పందం... త్వరలోనే ఖరారు

నీట మునిగి 8 మంది జలసమాధి

మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారే

07


సంపుటి 09, సంచిక: 175 | సోమవారం | 25-05-2026 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## మరో ఆరు రోజులూ

# నిప్పుల కొలిమే!

జగిత్యాల జిల్లా బుద్ధపల్లిలో 48.3 డిగ్రీల ఉష్ణోగ్రత

- ఎండ తీవ్రత, వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- ఈనెల 26న నైరుతి వచ్చేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయ్ : ఐఎండి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎండల తీవ్రత పరాకాష్టకు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఎండలతో అల్లాడుతున్నారు. ముఖ్యంగా పగటి వేళల్లో వేడి గాలులు, రాత్రిపూట అధిక కనిష్ఠ ఉష్ణోగ్రతలు ప్రజలకు ఇబ్బందులు తరువాయి 12లో



## కాల్పుల విరమణ ఒప్పందంపై

# తుది దశకు చర్చలు

- హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ అంగీకారం?
- చర్చల్లో గణనీయమైన పురోగతి
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన
- కొన్ని గంటల్లోనే శుభవార్త వింటారని రూబియో వెల్లడి
- ఇరాన్ అణ్వాయుధంపై భయం, ఆందోళన అవసరం లేదని స్పష్టీకరణ



**కైరో :** వారాంతంలో ఇజ్రాయెల్, ఆ ప్రాంతంలోని ఇతర మిత్రదేశాలతో జరిపిన సంభాషణల అనంతరం హోర్ముజ్ జలసంధిని తెరవడంతో సహా మధ్య ప్రాచ్య యుద్ధంపై ఇరాన్‌తో ఒక ఒప్పందం 'చాలా వరకు కుదిరింది' అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. అయితే ఆదివారం ఇతర అధికారులు జాగ్రత్త వహించాలని సూచించారు. విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో మాట్లాడుతూ 'చర్చలలో తుది పురోగతి రానప్పటికీ, గణనీయమైన పురోగతి సాధించబడింది' అని తెలిపారు. భారత్, ఆస్ట్రేలియా, జపాన్ అధికారులతో సమావేశాల కోసం నాలుగురోజుల పర్యటన నిమిత్తం భారతదేశానికి వచ్చిన రూబియో, రాబోయే గంటల్లో శుభవార్త వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ట్రంప్ ప్రధాన ఆంక్షల్లో ఒకటైన ఇరాన్ అణ్వాయుధం గురించి ఇకపై భయం లేదా ఆందోళన అవసరం లేని ప్రపంచం విషయంలో చర్చలు విజయవంతం అయ్యాయి' అని రూబియో అన్నారు.సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, పాకిస్థాన్, టర్కీ, ఈజిప్ట్, జోర్డాన్, బహ్రెయిన్ దేశాల నాయకులతో, అలాగే ఇజ్రాయెల్‌తో విడిగా మాట్లాడినట్లు శనివారం డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. 'ఒప్పందానికి సంబంధించిన తుది అంశాలు, వివరాలు ప్రస్తుతం చర్చల్లో ఉన్నాయి. త్వరలో ప్రకటిస్తాం' అని ట్రంప్ ఎలాంటి వివరాలు వెల్లడించకుండా సోషల్ మీడియాలో తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించేలా ఇస్లామిక్ రిపబ్లిక్‌పై కొత్త విడత దాడుల గురించి అమెరికా ఆలోచిస్తున్న వారానికి ఈ కొత్త ప్రకటన ముగింపు పలికింది.

**వెలుగులోకి రావడం ప్రారంభమైన ఒప్పందం వివరాలు...**

ఇద్దరు ప్రాంతీయ అధికారుల ప్రకారం...ఈ సంభావ్య ఒప్పందంలో భాగంగా ఇరాన్ అణ్వాయుధాన్ని అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉంటుంది. టెహ్రాన్ తన వద్ద ఉన్న అత్యంత సుసంపన్నం చేయబడిన యురేనియం నిల్వలను వదులుకోవడానికి అంగీకరించింది. చర్చల గురించి ప్రత్యక్ష అవగాహన ఉన్న ఒక అధికారి మాట్లాడుతూ ఇరాన్ తన అత్యంత సుసంపన్నమైన యురేనియాన్ని ఎలా వదులుకుంటుందనేది 60రోజుల పాటు జరిగే చర్చల అంశం. ఈ మొత్తంలో కొంత భాగాన్ని పలుచన చేసి, మిగిలిన మొత్తాన్ని మూడవ దేశానికి, బహుశా రష్యాకు బదిలీ చేసే అవకాశం ఎక్కువగా ఉందని తరువాయి 12లో



మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడును

## రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోళ్లు చేస్తుంది

- కేంద్రం నుంచి స్పందన రాకపోవడంతో రైతులు నష్టపోకూడదనే ఈ నిర్ణయం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతుల ప్రయోజనాలను దృష్ట్యా మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పంటలను రాష్ట్రప్రభుత్వమే కొనుగోలు చేయనుందని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో రైతులు నష్టపోకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరువాయి 8లో

## ఇతర రాష్ట్రాల నుంచి

# ధాన్యం రానీయొద్దు

- జొన్న, మొక్కజొన్న రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి
- సరిహద్దు జిల్లాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి
- ధాన్యం కొనుగోళ్లు వేగిరపరిచి ఈనెలాఖరుకల్లా ప్రక్రియ పూర్తి చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం
- ఇప్పటివరకూ 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడి
- పంట అవశేషాలు కాల్చొద్దని గ్రామాల్లో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి : ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్

ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల చివరికల్లా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని, సరిహద్దు జిల్లాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి బయట రాష్ట్రాల నుంచి వరి ధాన్యము, జొన్నలు, మొక్కజొన్నలు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాలు, తరుగు విషయంలో రైస్ మిల్లర్లు, దళారులు రైతులను మోసం చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు త్వరగా టాబ్ లో నమోదు చేసి రైతులకు తరువాయి 8లో

కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్‌కు

## అత్యవసరమైతేనే వెళ్లండి

ఎబోలా వ్యాపిస్తున్న నేపథ్యంలో, భారత పౌరులకు ప్రభుత్వం ప్రయాణ హెచ్చరికలు జారీ




**న్యూఢిల్లీ :** ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆఫ్రికా దేశాల్లో వైరస్ వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో, భారత పౌరులకు ప్రయాణ హెచ్చరికలు జారీ చేసింది. కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ దేశాలకు అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచించింది. ఒకవేళ ఆయా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు ఎవరైనా ఉంటే, వారు విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ కంటే ముందే హెల్త్ డెస్క్ వద్ద రిపోర్ట్ చేయడం తప్పనిసరని ఇదివరకే స్పష్టం చేసింది. మరోవైపు, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) కూడా ఇటీవల ఎబోలా వ్యాప్తిని గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. అదే సమయంలో ఆఫ్రికా సిడిసి కూడా కాంగో, ఉగాండాలో వ్యాపిస్తున్న ఎబోలా వైరస్ పరిస్థితిని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ కాంటినెంటల్ సెక్యూరిటీ'గా గుర్తించింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సూచనల ప్రకారం, భారత పౌరులు అత్యవసరం కాని పర్యటనలను వాయిదా వేసుకోవాలని, ప్రస్తుతం ఆ దేశాల్లో నివసిస్తున్న లేదా అక్కడికి వెళ్లిన భారతీయులు తరువాయి 12లో



నేటి నుంచి ప్రజానాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలు

03

## ఏటుకూరి ప్రసాద్‌కు

# అంతిమ వీడ్కోలు

**పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి**

**పలువురు సిపిఐ నాయకులు, కవులు, కళాకారులు, అభ్యుదయ రచయితల సంఘం ఘననివాళి**

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రముఖ కవి, అభ్యుదయ రచయిత, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్‌కు పలువురు సిపిఐ నాయకులు, కవులు, కళాకారులు అభ్యుదయ రచయితలు ఘనంగా నివాళులు అర్పించారు. ఏటుకూరి ప్రసాద్ మరణం పట్ల వారంతా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నారాయణగూడలోని ఏటుకూరి ప్రసాద్ నివాసంలో ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి తుది వీడ్కోలు పలికారు. అనంతరం పంజాగుట్ట శ్మాసనవాటికలో ఏటుకూరి ప్రసాద్ అంత్యక్రియలు జరిగాయి. అంతకుముందు సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, కందిమళ్ల ప్రతాపరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్‌బోస్, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ ఎస్.వి.సత్యనారాయణ, నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బి.ఎస్.ఆర్.మోహన్‌రెడ్డి, జనరల్ మేనేజర్ ఎన్.మధుకర్, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, నవచేతన పబ్లిషింగ్ హౌజ్ మేనేజర్ నారాయణరెడ్డి, ప్రముఖ రచయిత నందిని సిదారెడ్డి, తరువాయి 12లో





తిరుపతిలో...



## బస్సుల్లో నిఘా నేత్రాలు

ప్రయాణికుల రక్షణకు టిజిఎస్ఆర్‌టిసి వినూత్న శ్రీకారం

'బస్సులో భరోసా' పేరిట ఆదిలాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజల ప్రయాణానికి భద్రత, నమ్మకానికి ప్రతీకగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల రక్షణ కోసం మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రమాదాలు, చోరీలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేందుకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి సరికొత్త వ్యూహాన్ని అమలులోకి తెచ్చారు. ప్రయాణికులు ఎలాంటి భయాందోళనలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో తమ గమ్యస్థానాలకు చేరుకునేలా చూసేందుకు బస్సుల్లో అత్యాధునిక (సిసి కెమెరాలు) నిఘా వ్యవస్థ ఏర్పాటుకు ప్రారంభించారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ తరువాయి 12లో

అంతర్జాతీయ మత స్వేచ్ఛ కమిషన్‌లో

# మోదీ సర్కార్‌పై ఆరోపణలు

**పూర్తి సాక్ష్యాధారాలతో కేసు వేసిన సిఎస్ఒహెచ్ సంస్థ**



ప్రజాపక్షం/హైదరాబాద్

అమెరికాలోని అంతర్జాతీయ మత స్వేచ్ఛ కమిషన్ (యుఎస్‌సిఐఆర్ఎఫ్) ఎదుట భారతదేశంలో ముస్లింలు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, విద్వేష ప్రచారాలపై పలు అభియోగాలతో సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఆర్గనైజెడ్ హేట్ (సిఎస్ఒహెచ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఖీబ్ హమీద్ నాయక్ నివేదికను దాఖలు చేశారు. భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం మైనారిటీలపై జరుగుతున్న హింసకు ప్రత్యక్ష, పరోక్ష మద్దతు ఇస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికా ప్రభుత్వం గ్లోబల్ మాగ్నిట్స్కీ చట్టం కింద ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్, తరువాయి 8లో

# కొత్త ఠాణాల జాడేది?

- ఉగాదికని ఊరించారు... గాలికొదిలేశారు
- 11 నెలలుగా ముందుకు సాగని ఫైల్
- 13 ఏళ్లయినా దక్కని పదోన్నతులు




ప్రజాపక్షం/నిజామాబాద్

శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజాసమస్యలను మరింత సత్వరంగా పరిష్కరించేందుకు 100 కొత్త పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం పెట్టడం లేదు. రాష్ట్రంలో కొత్తగా సబ్‌డివిజన్లు, సర్కిళ్లు, పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు పోలీసు ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేవారు. కొత్త పోలీస్ స్టేషన్లతో పాటు ట్రాఫిక్, మహిళా పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు ఫిబ్రవరిలో నివేదికలు అందజేశారు.గత ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగిన దానికనుగుణంగా పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు జరగకపోవటంతో జిల్లా కేంద్రాల్లో పోలీసులు ఇబ్బంది పడుతున్నారని అందుకనుగుణంగా కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటు కోసం నివేదికలు అందించారు. కలెక్టరేట్ల వద్ద బందోబస్తు నిర్వహణతో పాటు ఇతర కార్యక్రమాలతో పని ఒత్తిడి బాగా పెరిగిపోయిందని అధికారులు సమాచారమివ్వటంతో సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అవసరమున్న ప్రతి చోట కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుతో పాటు ట్రాఫిక్, మహిళా పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయటంతో పాటు జిల్లా కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించటంతో పోలీసు ఉన్నతాధికారులు జిల్లాల వారిగా ప్రణాళికలు చేసిద్ధం చేసి ఏ పోలీస్‌స్టేషన్ కొత్తగా ఏర్పాటు చేయాలి, ఎంత సిబ్బంది ఉండాలి గతంలో ఏ సర్కిల్ పరిధిలో, సబ్‌డివిజన్ పరిధిలో ఉందనే అంశాలను నివేదిక రూపంలో తయారుచేసి పంపించారు. నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుతో పాటు 79 పోలీస్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రణాళికలు సిద్ధం అవ్వటంతో ఉగాదికి కొత్త పోలీస్‌స్టేషన్లతో పాటు అప్‌గ్రేడేషన్‌లు ఉంటాయని భావించారు. దీంతో 13 ఏళ్లుగా (ధీర్ఘకాలంగా) పదోన్నతులు తరువాయి 8లో

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
సోమవారం
25-05-2026
www.prajapaksham.in


# మనసు లోతుల్ని పరిశీలించే 'సైకలాజికల్ రియలిజం'



సాహిత్యంలో సైకాలజికల్ రియలిజం (మనస్తత్వ వాస్తవికత) అనే ధోరణి ఒక కీలకమైన మలుపు. ఇది కథను బయట జరిగే సంఘటనల పరిమితం చేయకుండా, మనిషి మనస్సులోకి ప్రవేశిస్తుంది. ఒక పాత్ర ఏమి చేసింది? అనే ప్రశ్నకు మాత్రమే సమాధానం చెప్పకుండా, ఆ పాత్ర అలా ఎందుకు చేసింది? అనే ప్రశ్నను కేంద్రంగా తీసుకుంటుంది. ఈ మార్పు సాహిత్యాన్ని మరింత లోతైన మానవ ఆలోచనా విధానాల అధ్యయనంగా మార్చింది. ఈ ధోరణి ముఖ్యంగా 19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ప్రారంభంలో బలపడింది. ఆ కాలంలో శాస్త్రం, మనోవిజ్ఞానం, తత్వశాస్త్రం తదితర రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులు కొత్తకొత్త ఆలోచనల కు ప్రాణం పోశాయి. మనిషి ప్రవర్తనను కేవలం బాహ్య పరిస్థితులతో మాత్రమే వివరించలేమని పండితులు గ్రహించారు. మనస్సు (కాన్షియస్), అవచేతన (సబ్‌కాన్షియస్), భయం, అవమానం, కోరికలు తదితర ఎన్నో అంశాలు మనిషి చర్యలను ప్రభావితం చేస్తాయి. వారి నడవడిని నిర్దేశిస్తాయి. ఈ ఆలోచనలే సాహిత్యంలోనూ ప్ర తిబింబించాయి. రచయితలు పాత్రల అంతర్గత ప్రపంచాన్ని పరిశీలించడం ప్రారంభించారు. ఫలితంగా పాత్రల పరిధి పెరిగింది. ప్రవర్తనలకు మూల కారణాలను అధ్యయనం చేయడానికి వీలు కలిగింది. సైకాలజికల్ రియలిజం ప్రధాన లక్షణంగా అంతర్గత దృష్టి పేర్కోవాలి. ఒక పాత్ర ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, రచయిత ఆ నిర్ణయం వెనుక ఉన్న భావోద్వేగాలను, సందేహాలను, సంఘర్షణలను వివరించడానికి ప్రయత్నిస్తాడు. ఫ్యోదర్ దోస్తోవ్‌యెవ్స్కీ తన 'క్రైమ్ అండ్ పనిష్మెంట్' నవలలో కథానాయకుడు రస్కోల్నికోవ్‌తో హత్య చేయిస్తాడు. నిజానికి ఇలాంటి సంఘటన ఆ హత్య చుట్టూ తిరగాలి. సదరు పాత్ర ఏ విధంగా తప్పించుకున్నదీ వివరించాలి. కీర్తించాలి. కానీ, ఈ నవల అందుకు భిన్నంగా, ఆ హత్య గురించి కాకుండా, ఆ ఘటన తర్వాత అతని మనస్సులో జరిగే సంఘర్షణ గురించి. అతని గిల్ట్, అతని భయం, అతని నైతిక సందేహాలు వంటివే కథను ముందుకు నడిపిస్తాయి. అంతర్గత ప్రపంచాన్ని రచయిత ఎలా చూపించగలడు? అనే ముఖ్యమైన తార్కిక ప్రశ్న ఇక్కడ ఉదయించవచ్చు. ఎందుకంటే, మనస్సు ప్రత్యక్షంగా కనిపించదు. రచయిత తన భాష ద్వారా మనస్సును ఆవిష్కరించాలి. ఈ అవసరమే 'స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్‌నెస్' అనే కొత్త కథన విధానాలకు బీజం వేసింది. ఇంటీరియర్ మోనోలాగ్ (అంతర్గత మనోగతం) ద్వారా పాత్రల ద్వారానే పరిస్థితులను వివరించడం ఒక విధానమైతే, కథకుడే పాత్రకు ప్రాతినిధ్యం వహించడం మరో పద్ధతి. ఈ పద్ధతులు పాత్రల ఆలోచనలను నేరుగా పాఠకుడికి అందిస్తాయి. కథలో పాత్రలు మాట్లాడకపోయినా, వారి మనస్సు మాట్లాడుతుంది. ఒక రకంగా ఈ పద్ధతులు సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించినప్పటికీ, సంక్లిష్టంగా కూడా మార్చాయి. ఒక పాత్ర ఆలోచనలు సూటిగా ఉండవు. అవి అస్పష్టంగా, విరామాలతో, అనుబంధాలతో సాగుతాయి. రచయితలు ఈ అసంపూర్ణతను కూడా కథలో చూపించడానికి ప్రయత్నించారు. ఇది పాఠకుడికి ఒక కొత్త అనుభవాన్ని ఇస్తుంది. కానీ అదే సమయంలో, ఇది కథను అర్థం చేసుకోవడాన్ని కష్టతరం చేస్తుంది. కాబట్టి, 'సైకాలజికల్ రియలిజం' పాఠకుడి నుంచి ఎక్కువ శ్రద్ధను కోరుతుంది. ఈ ధోరణిలో కథలు పాత్ర ఆధారితంగా మారుతాయి. కథను ముందుకు నడిపేది సంఘటనల కంటే, పాత్రల భావోద్వేగాలే కీలకమవుతాయి. ఒక చిన్న సంఘటన కూడా చాలా పెద్దగా కనిపించవచ్చు. ఎందుకంటే అది పాత్ర మనస్సులో అది అంత తటి ప్రభావాన్ని చూపుతుంది. ఉదాహరణకు హెన్రీ జేమ్స్ రచించిన 'ది పోట్రెయిట్ ఆఫ్ లేడీ'లో కథానాయిక తీసుకునే నిర్ణయాలు ప్రధానంగా ఆమె అంతర్గత భా వోద్వేగాల వల్లనే ప్రభావితం అవుతాయి. బయటి సం ఘటనలు తక్కువగా కనిపించినా, అంతర్గత సంఘర్షణ చాలా గాఢంగా ఉంటుంది. ఇక్కడ మరో అంశాన్ని పరిశీలించాలి. 'సైకాలజికల్ రియలిజం' పాత్రలను సాధారణ వ్యక్తులుగా కాకుండా, తరచు పరీక్షకు గురయ్యే ప్రత్యేక లక్షణం ఉన్న వారిగా చూస్తుంది. రచయిత ఒక శాస్త్రవేత్తలా పాత్రను పరిశీలిస్తాడు. పాత్ర నిర్ణయాలు ఎలా మారుతున్నాయి? ఏ కారణాలు ప్రభావితం చేస్తున్నాయి? అనే విషయాలను గమనిస్తాడు. ఈ విధానం సాహిత్యాన్ని ఒక రకమైన మానసిక అధ్యయనంగా మా రుస్తుంది. ఎడిత్ వార్టన్ తన నవల 'ది ఏజ్ ఆఫ్ ఇన్నోసెన్స్'లో సామాజిక నియమాలు వ్యక్తుల భావోద్వేగాలను ఎలా నిరోధిస్తాయో వివరిస్తుంది. ఈ నవలలో పాత్రలు తమ కోరికలను నేరుగా వ్యక్తపరచలేవు. అవన్నీ తమ సమాజపు నియమాలకు లోబడి జీవిస్తాయి. ఈ ప రిస్థితి ఆ పాత్రల మనస్సులో ఒక నిరంతర సంఘర్షణను సృష్టిస్తుంది. ఇదే 'సైకాలజికల్ రియలిజం' ప్రధాన లక్షణం. ఈ ధోరణి నిజంగానే వాస్తవాలను ప్రతిబింబిస్తుందా? అని ప్రశ్నించడం చాలా సులభం. కానీ, సమాధానం వెతకడం మాత్రం అత్యంత కష్టతరం. ఎందుకంటే, మనసు చాలా సంక్లిష్టమైనది. ఒక రచయిత దానిని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. తన అవగాహన మేరకు మాత్రమే పాత్రలను నిర్మించగలుగుతాడు. కాబట్టి, ఇది కూడా ఒక వ్యాఖ్యానం మాత్రమే. అయినప్పటికీ, ఇది మనిషి అనుభవానికి దగ్గరగా ఉంటుంది. ఎందుకంటే మనం కూడా మన జీవితాన్ని అంతర్గతంగా అనుభవిస్తాం. అయితే, పాత్రల్లోకి రచయి త చొచ్చుకుపోయినప్పుడు, పరిస్థితులు మారిపోతాయి. ఒక ఆలోచనా విధానంలో కూరుకుపోయిన పాత్ర, హ ఠాత్తుగా తన నడవడిని మార్చుకోవడం కొన్ని రచనల్లో కనిపించడానికి ప్రధాన కారణం ఇదే. పాత్ర అనుభవించే మానసిక సంఘర్షణ పేరుతో రచయిత తన అభిప్రాయాలను ఏకరువు పెట్టే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటి ధోరణులు 'సైకలాజికల్ రియలిజం' పరిధిని కుదించివేస్తాయి. అయితే, సాహిత్యమనే విస్తారమైన మహా సముద్రంలో, ఏ ఒక్క ప్రక్రియను కూడా 'సంపూర్ణమైది'గా పేర్కో లేం. ఎక్కువ, తక్కువ అ నే విషయమే సదరు సాహిత్య ధోరణి నాణ్యత ను, నిర్దేశిస్తుంది. ఇక్కడ 'నాణ్యత' అంటే ఏమిటనే ప్రశ్న ఉత్పన్నం కావచ్చు. అది మరో విస్తారమైన చర్చకు దారితీస్తుంది. కాబట్టి, 'సైకిలాజికల్ రియలిజం' వరకే పరిమితమైతే, కొన్ని పరిమితు లు, పరిధులు ఉన్నప్పటికీ, ఈ ధోరణి సాహిత్యాన్ని మ రింత లోతుగా చేసిందనడంలో అనుమానం లేదు. ఇది మనిషి నైతికతను, బాధ్యతను, స్వేచ్ఛను ప్రశ్నిస్తుంది. ఒక వ్యక్తి తప్పు చేశాడంటే, అది అతని వ్యక్తిగత నిర్ణయమా? లేక అతని పరిస్థితుల ప్రభావమా? ఈ ప్రశ్నల కు 'సైకాలజికల్ రియలిజం' సూటిగా సమాధానం ఇ వ్వదు. వాటిని పాఠకుడి ముందుంచుతుంది. పాఠకుడిని కూడా ఆలోచింప చేయడం సాహిత్య నాణ్యతను పెంచుతుంది. అలాంటి రచనలతో పాఠకుడు మమేకమవుతా డు. సంప్రదాయ కథలు 'ఏమైంది?' అనే ప్రశ్నకు సమాధానం చెబుతాయి. కానీ సైకాలజికల్ ఫిక్షన్ 'ఎందుకు జరిగింది?' అనే ప్రశ్నను కేంద్రంగా తీసుకుంటుంది. ఒక పాత్ర ఒక చర్య తీసుకున్నప్పుడు, రచయిత ఆ చర్య వెనుక ఉన్న కారణాలను అన్వేషిస్తాడు. ఆ కారణాలు చాలా సార్లు స్పష్టంగా ఉండవు. అవి అవచేతన కోరికలు, గత అనుభవాలు, మానసిక గాయాలు, భయాలు వంటి వివిధ భావాల రూపంలో ఉంటాయి. వాటిని సక్రమంగా విశ్లేషించి, పాఠకుడిని మెప్పించడం ఆషామాషి విషయం కాదు. అందుకే, 'సైకాలజికల్ రియలిజం' ఆధారంగా రచనలు చేయడం కత్తిమీద సాముగా పరిగణించాలి. మనిషి స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటాడనే అభిప్రాయం సమాజంలో చాలా బలంగా ఉంది. సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఒక మనిషి ఆలోచనా విధానాలను, జీవన శైలిని మార్చవచ్చని 'సైకలాజికల్ రియలిజం' వాదిస్తుంది. ఈ రెంటినీ సమన్వయం చేసుకుంటూ, పరిధులను గుర్తించి, అనుసరిస్తూ చేసే రచనలే చిరస్థాయిగా నిలిచిపోతాయి. లేకపోతే, కాల ప్రవాహంలో కొట్టుకుపోతాయి.

— బిఎల్

> చాలా మంది సోషల్ రియలిజం.. సైకలాజికల్ రియలిజం మధ్య తేడాను గమనించరు. రెండూ ఒకటేనన్న నిశ్చితాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుంటారు. అయితే, ఈ రెంటి మధ్య తేడా ఉంది. సోషల్ రియలిజం సమాజంపై దృష్టి పెడుతుంది.. సైకాలజికల్ రియలిజం వ్యక్తిపై దృష్టి పెడుతుంది. కానీ, ఈ రెండూ పూర్తిగా వేరు కావు. వ్యక్తి మనస్సు కూడా సమాజంతో ప్రభావితం అవుతుంది. కాబట్టి, సైకాలజికల్ రియలిజం చాలా సందర్భాల్లో సామాజిక విమర్శను కూడా కలిగి ఉంటుంది. ఆర్థిక, సామాజిక, వాతావరణాది అంశాలు ఒక సమాజాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుందో వివరించేది సోషల్ రియలిజం. మనిషి మస్తిష్కంలోకి తొంగిచూసి, భావనలను గుర్తించి, ప్రవర్తనకు కారణమైన మూలాలను తర్కించి, విశ్లేషించేది సైకలాజికల్ రియలిజం. ఈ రెంటినీ పరస్పర పూరకాలుగా పేర్కోవచ్చు.

## చదవాల్సిన పుస్తకం

# మార్పును కోరేవారి కోసం..

విజయానికి అడ్డదారులు ఉండవు. అయితే, జీవితంలో విజయం సాధించడం అసాధ్యం కూడా కాదు. ఈ విషయాన్ని 'ఇక విజయం మీ గుప్పిట్లో' పుస్తకంలో, రచయిత్రి నల్లా శైలజ స్పష్టం చేస్తారు. 'మీరు ఈ పుస్తకాన్ని ఒక నవలలాగా ఏకబిగిన చదివేస్తే పెద్దగా ఫలితం ఉండదు. అదే విధంగా ఈ పుస్తకాన్ని ఒకటికి రెండుసార్లు చదివినా పెద్దగా మార్పు కనబడదు.ఈత నేర్చుకోవడానికి అనుసరించే పద్ధతులు ఉన్న పుస్తకం చదవడం ద్వారా ఈత నేర్చుకోలేరు. అందులో ఉన్న పద్ధతులను స్వయంగా ఆచరించడం ద్వారా మాత్రమే ఈత నేర్చుకోవడం సాధ్యమవుతుంది' అంటూ పుస్తకం ముందుమాటలోనే తేల్చిచెప్పారు. మనిషి ఆలోచనా సరళి, వ్యక్తిత్వ వికాసం, జీవన విధానాలను మెరుగు పరచే మార్గదర్శకంగా నిలిచే స్వీయోన్నతి పుస్తకం. ఇందులోని అధ్యాయాల నిర్మాణం, వాటి ఎంపిక, అంశాల పరంపర ఒక మానసిక ప్రయాణాన్ని నిరిస్తాయి. 'వ్యక్తి తన ఆలోచనలను మార్చుకుంటే జీవితం మారుతుంది' అనే సిద్ధాంతం ఆధునిక 'సెల్ఫ్‌హెల్ప్' సాహిత్యంలో ప్రధానంగా కనిపిస్తుంది. 'నిజాయితీని పెంచుకోండి', 'పాజిటివ్ యాటిట్యూడ్', 'ఆత్మవిశ్వాసం ఒక ఆయుధం' వంటి అధ్యాయాలు ఈ భావనను బలంగా నొక్కిచెబుతాయి. ఈ దృక్పథం వ్యక్తిగత బాధ్యతను పెంచుతుంది. అధ్యాయాల క్రమాన్ని పరిశీలిస్తే, మొదటి దశలో వ్యక్తి అంతర్గత లక్షణాలపై దృష్టి పెట్టింది. 'ఆగ్రహం అవివేకానికి నిదర్శనం', 'సహనాన్ని సాధన చేయండి', 'మీ అంతర్యాన్ని వినండి' వంటి అంశాలు భావోద్వేగ నియంత్రణను ప్రాముఖ్యంగా చూపిస్తాయి. ఇవి వ్యక్తిత్వ వికాసంలో కీలకం. 'ఒక లక్ష్యం కోసం జీవించండి', 'మీరు ప్రేమించే పనినే ఎంచుకోండి', 'నిర్ణయాలు తీసుకోవడమూ ఒక కళే' తదితర అధ్యాయాలు కార్యాచరణ వైపు దారి తీస్తాయి. ఇవి పాఠకుడిని నిర్దిష్ట లక్ష్యాల వైపు మళ్లిస్తాయి.



దిశ లేకపోతే శ్రమ వృథా అవుతుందనే ఒక ముఖ్యమైన సందేశాన్ని రచయిత్రి ఇస్తారు. ఇది సమర్థవంతమైన భావన. 'సమస్యలే ప్రగతికి సాధనాలు', 'ప్రతికూల పరిస్థితులను నిందించకండి' వంటి అధ్యాయాలు సమస్యల పట్ల దృక్పథాన్ని మార్చాలని సూచిస్తాయి. ఇది 'అభిజ్ఞ పునర్నిర్మాణం' (కాగ్నిటివ్ రీఫ్రేమింగ్) అనే మానసిక సూత్రానికి దగ్గరగా ఉంటుంది. సమస్యలను అవకాశాలుగా చూడడం ఒక శక్తివంతమైన వ్యూహం. పుస్తకంలో ఉన్న మరొక ముఖ్యమైన విభాగం ఆత్మపరిశీలన. 'మీ గురించి మీరు అనుకున్న దానికన్నా మెరుగైన వారు', 'మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి', 'మీ అంతర్యాన్ని వినండి' వంటి అధ్యాయాలు వ్యక్తిలోని అంతర్గత విలువను గుర్తించడానికి ప్రోత్సహిస్తాయి. 'మన్నించడంలోనే ఉంది మనిషితనం', 'మరపు మంచిదే' వంటి అధ్యాయాలు మానవ సంబంధాలపై దృష్టి పెడతాయి. ఇవి భావోద్వేగ ఆరోగ్యానికి అవసరం. క్షమించడం ద్వారా మనసుకు శాంతి లభిస్తుంది అనే భావన సాంప్రదాయికంగా కూడా, ఆధునికంగా కూడా ధ్రువీకరించిన సిద్ధాంతం. 'ఓ పుస్తకం మీ జీవితాన్నే మార్చివేస్తుంది' అనేది మెటానేరేటివ్‌గా పనిచేస్తుంది. ఇది పఠనం శక్తిని ప్రోత్సహిస్తుంది. ఇది పుస్తకానికి ఒక స్వీయసూచన కూడా. 'బిడియాన్ని పారద్రోలండి', 'ఆత్మవిశ్వాసం ఒక ఆయుధం' వంటివి వ్యక్తిలో ధైర్యాన్ని పెంపొందించడంపై దృష్టి పెడతాయి. ఇవి ముఖ్యంగా యువతకు ఉపయోగపడతాయి. ఈ పుస్తకంలో, భాష సులభంగా, ప్రేరణాత్మకంగా ఉంటుంది. ప్రతి అధ్యాయం ఒక చిన్న సందేశంగా, ఒక సూక్తిగా నిలుస్తుంది. ఇది పాఠకుడికి సులభంగా గ్రహించదగినది. ఇది పాఠకుడిని అనాసక్తత, కుంగుబాటు నుంచి లక్ష్యం వైపు ప్రస్థానాన్ని ప్రారంభింప చేస్తుంది. వ్యక్తిగత బాధ్యత, సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసం వంటి విలువలను బలంగా నొక్కిచెబుతుంది. స్థూలంగా చెప్పాలంటే, ఈ పుస్తకాన్ని ఒక ప్రారంభ మార్గదర్శిగా చూడవచ్చు. పూర్తి పరిష్కారం కాకపోవచ్చు, కానీ,పాఠకుడిలో ఆలోచనను ప్రారంభిస్తుంది.

**పుస్తకం పేరు**

**ఇక విజయం మీ గుప్పిట్లో**

రచయిత : నల్లా శైలజ

వెల: రూ. 130/

**ప్రతులకు**

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

# సంప్రదాయానికి పట్టం కట్టే 'యొరుబా'



పశ్చిమ ఆఫ్రికాలోని యొరుబా ప్రజల ఆలోచన, సంస్కృతి, ఆధ్యాత్మికత, జీవన విధానాల సమగ్ర ప్రతిబింబమే 'యొరుబా సాహిత్యం'. ఇది ప్రధానంగా నేటి నైజీరియా దేశంలో విస్తరించి ఉన్న యొరుబా సమాజంతో ముడిపడి ఉంటుంది. ఈ సాహిత్యం ఒకే రూపంలో కాకుండా, మౌఖిక సంప్రదాయం, లిఖిత రూపం అనే రెండు ప్రధాన దశలుగా అభివృద్ధి చెందింది. యొరుబా సాహిత్యానికి మూలం మౌఖిక సంప్రదాయం. కథలు, పాటలు, పురాణాలు, సామెతలు, మంత్రాలు వంటి రూపాల్లో ఇది తరతరాలకు సంక్రమించింది. ఈ సంప్రదాయంలో ముఖ్యమైన భాగం 'ఇఫా' అనే జ్యోతిష్యతత్వశాస్త్ర సంప్రదాయం. 'ఇఫా' ద్వారా జీవితం, విధి, ధర్మం వంటి అంశాలను వివరిస్తారు. ఈ కథనాలు కేవలం వినోదం మాత్రమేగాక, నైతిక విలువలు, సామాజిక నియమాలు, తత్వ బోధనను కూడా అందిస్తాయి. యొరుబా పురాణాల్లో దేవతలు, వీరులు, ప్రకృతి శక్తులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఈ దేవతలను 'ఒరిషాలు' అని పిలుస్తారు. వీటిలో జ్ఞానం, విధి, శక్తి వంటి భావనలు ప్రతిబింబిస్తాయి. ఈ కథలు మానవ జీవితాన్ని అర్థం చేసుకునే మార్గదర్శకాలు. లిఖిత యొరుబా సాహిత్యం తరువాత కాలంలో అభివృద్ధి చెందింది, ముఖ్యంగా యూరోపియన్ ప్రభావం తరువాత. ఈ దశలో రచయితలు నవలలు, నాటకాలు, కవిత్వం వంటి ప్రక్రియలలో రచనలు చేశారు. ఈ సాహిత్యం సామాజిక మార్పులు, వలస పాలన ప్రభావం, ఆధునికత వంటి అంశాలను పరిశీలిస్తుంది. యొరుబా నాటకరంగంలో ప్రముఖంగా వినిపించే పేరు వేల్ సోయింకా (అకిన్వాండే ఒలువోలే బాబాటుండె సోయింకా). ఆయన రచనలు యొరుబా సంప్రదాయాన్ని ఆధునిక ప్రపంచంతో మేళవిస్తాయి. ఆయన నాటకాలలో పురాణం, రాజకీయ విమర్శ, మరియు మానవ స్వభావం ఒకటిగా కలుస్తాయి. ఆయనకు నోబెల్ బహుమతి లభించడం యొరుబా సాహిత్యానికి ప్రపంచవ్యాప్త గుర్తింపును తెచ్చింది. యొరుబా సాహిత్యం కేవలం కథల సమాహారంగా మాత్రమేగాక, ఒక జీవించే సంస్కృతిగా భాసిల్లుతుంది ఇందులో భాషా శైలీ, లయ, సామెతల వినియోగం చాలా ముఖ్యమైనవి. ఈ సాహిత్యం స మాజాన్ని అద్దంలా చూపిస్తుంది, అలాగే వ్యక్తిని త న మూలాలతో అనుసంధానిస్తుంది. కాగా, మౌ ఖిక సంప్రదాయం నుండి లిఖిత సాహిత్యానికి మారినప్పుడు, అసలు స్వరూపం ఎంతవరకు నిలిచిందనే ప్రశ్న తలెత్తుతుంది. లిఖిత రూపం మూల భావనను స్థిరపరుస్తుందని కొందరు అంటే, మౌఖి క సంప్రదాయంలో జీవతత్వం మాయమైపోతుందని మరి కొందరి అభిప్రాయం. వాదనలు ఎలావున్నా, యొరుబా సాహిత్యం ఆఫ్రికన్ల జీవితం, విశ్వాసం, సమాజం మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని ప్రతిబింబించే ఒక శక్తివంతమైన సంప్రదాయం. అందులో అనుమానం లేదు.

# ఆలోచనాపరుడు సోయింకా..

సాహిత్య రంగంలో వేల్ సోయింకా పేరుతో సుపరచితుడైన అకిన్వాండే ఒలువోలే బాబాటుండే సోయింకా ఆధునిక ఆఫ్రికన్ సాహిత్యంలో అత్యంత ప్రభావవంతమైన రచయితలలో ఒకడు. ఆయనకవి... నాటక రచయిత... సాహిత్యాన్ని సమాజంతో, రాజకీయాలతో, మానవ అనుభవాలతో అనుసంధానించిన ఆలోచనాపరుడు. నవలలు, కథాసంపుటాలు, కవిత్వం, నాటకాలు, స్మృతులు, వ్యాసాలు... ఇలా ఆయన రచనలు విభిన్న ప్రక్రియలను ఆవరించి ఉంటాయి. ఇవన్నీ కలిపి ఒక విశాలమైన సాహిత్య ప్రపంచాన్ని నిర్మిస్తాయి. సాహిత్యంలో ఆయన చేసిన కృషికిగాను 1986లో ఆయనకు నోబెల్ బహుమతి లభించడం, సోయింకా స్థాయిని అంతర్జాతీయంగా గుర్తించిన ఘట్టం.



1934 జూలై 13న నైజీరియాలోని అబియోకుటా ప్రాంతంలోని అకే అనే ప్రాంతంలో జన్మించిన సోయింకా, యొరుబా సాంస్కృతిక సంప్రదాయానికి చెందినవాడు. ఆయన కుటుంబం విద్య, సామాజిక చైతన్యం, ఆధ్యాత్మిక విలువల సమ్మేళనం. ఆయన తండ్రి ఒక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. ఆంగ్లికన్ మ తపెద్ద. తల్లి సామాజిక ఉద్యమాల్లో కూడా చురుకుగా పాల్గొనే వ్యాపారవేత్త. ఈ కుటుంబ వాతావరణం సోయింకాలో చిన్ననాటి నుంచే అవగాహన, ప్రశ్నించే ధోరణి, సమాజంపై చైతన్యం పెంచింది. విద్యాభ్యాసం కూడా ఆయన వ్య క్తిత్వ నిర్మాణంలో కీలక పాత్ర పోషించింది. ప్రాథమిక విద్యను స్థానిక పాఠశాలలో పూర్తి చేసిన తరువాత, ఉన్నత విద్య కోసం ఇబాదన్ కళాశాలలో చేరాడు. అక్కడ ఆంగ్ల సా హిత్యం, గ్రీకు సాహిత్యం, పాశ్చాత్య చరిత్ర అభ్యసించాడు. విద్యార్థి దశలోనే ఆయన రచనా సామర్థ్యం బయటపడింది. రేడియో నాటకాలు రచించడం, పత్రికలలో రచనలు చేయ డం వంటి కార్యకలాపాల ద్వారా ఆయన సృజనాత్మక ప్రయా ణం ప్రారంభమైంది. అదే సమయంలో, విద్యార్థి సంఘాలు స్థాపించడం ద్వారా ఆయన నాయకత్వ లక్షణాలు కూడా వెలుగుచూశాయి. తరువాత ఆయన ఇంగ్లాండ్‌కు వెళ్లి ఉన్నత విద్యను కొనసాగించాడు. అక్కడి విశ్వవిద్యాలయ వాతావరణం ఆయన ఆలోచనలకు మరింత విస్తృతిని ఇచ్చింది. యూరోపియన్ సాహిత్యం, నాటక సంప్రదాయం, తాత్త్విక ఆ లోచనలు సోయింకాపై ప్రభావం చూపాయి. ఈ కాలంలోనే ఆయన చిన్న కథలు, కవితలు రచించడం ప్రారంభించాడు. రేడియో కార్యక్రమాల కోసం రచనలు చేయడం ద్వారా ఆయన రచనలు విస్తృత ప్రజలకు చేరాయి. నైజీరియా సమాజాన్ని ప్రతిబింబింపచేయడం సోయింకా రచనలలో ఒక ము ఖ్య లక్షణం. ఆయన నవలలు, నాటకాలు, కవిత్వం వంటి ప్రక్రియల్లో దేశ చరిత్ర, సంస్కృతి, రాజకీయ సంఘర్షణలను ఆవిష్కరిస్తాడు. ప్రారంభ దశలో రచించిన నాటకాలలోనే ఆయన ప్రతిభ స్పష్టమైంది. కేవలం సాహిత్యకారుడు మాత్రమేగాక్రై ఒక సామాజిక విమర్శకుడు కూడా. నైజీరియాలో రాజకీయ పరిస్థితులపై ఆయన తీవ్రంగా స్పందించాడు. ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడంలో వెనుకడుగు వేయలేదు. ఈ కారణంగానే అరెస్టు కూ డా అయ్యాడు. అంతర్గత యుద్ధ సమయంలో శాంతి ప్రయత్నాలు చేశారు. కానీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడంతో మరోసారి జైలుకు వెళ్లాల్సి వచ్చింది. జైలు జీవితం ఆయన రచనలపై గాఢమైన ప్రభావం చూపింది. అక్కడ ఆయన రాసిన కవితలు, గమనికలు మానవ స్వేచ్ఛ, న్యాయం, నిర్బంధం వంటి అంశాలను లోతుగా ప్రతిబింబిస్తాయి. జైలు నుండి విడుదలైన తరువాత కూడా ఆ యన తన రచనా ప్రయాణాన్ని కొనసాగించారు. ఆయనకు 1986లో లభించిన నోబెల్ బహుమతి ఆయన సాహిత్య కృషి కి అంతర్జాతీయ గుర్తింపు. ఈ బహుమతిని అందుకున్న మొద టి ఆఫ్రికన్ రచయితగా ఆయన చరిత్రలో నిలిచాడు. ఆయన రచనల్లో కనిపించే విశాల సాంస్కృతిక దృష్టి, కవితాత్మకత, మానవ అనుభవాల లోతైన చిత్రణ ఈ గుర్తింపుకు కారణం. తన స్వీకార ప్రసంగంలో కూడా స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి విలువలను ప్రస్తావించడం సోయింకా ఆలోచనా ధోరణిని ప్రతిబింబిస్తుంది. సాహిత్యం కళ మాత్రమేకాదని, అది సమాజాన్ని మార్చగల శక్తిగా కూడా ఆవిర్భవిస్తుందని సొయింకా జీవితం, రచనలు నిరూపిస్తున్నాయి.

## ఈ వారం కవితలు

### అస్తమించిన పోరు పొద్దు.. డా॥ఏటుకూరి

సాహితీ వనంలో
పూసిన ఎర్ర మందారం
మెరిసిన మన సిందూరం
ఎగిసిన కెరటం

నిప్పుల కొలిమిలో
ఎరుపెక్కిన అస్త్రం
బలుపెక్కిన పాలనపై
ఎరుపెక్కిన కలం

హక్కుల ఉక్కు పిడికిలి
వొడవని మాటల నోట
తరగని పాటల ఊట
పోరు వంతెనపై

అక్షర శ్రామికుడు

ఉద్యమ బాట సారి
సాహిత్యంలో అలుపెరుగని అక్షర సేద్యకాడు
తరునారున పరిశోధకులకు
ఓ గ్రంధాలయం, పెద్ద బాలశిక్ష.

పదునెక్కిన పరిశీలకుడు
ఎర్ర పాటలినిపించిన ఎర్ర సేనాని
ఎర్రపాటల ఎవరెస్ట్ శిఖరం
డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ గారు

వజ్రమ్మ ,కోటయ్య దంపతుల కడుపు పంట
ఏటుకూరి ప్రసాద్ ఎర్ర జెండా ముద్దు బిడ్డా

**ఏటుకూరి ప్రసాద్ గారి యాదిలో రాసిన స్మృతి గీతం)**

**గడ్డమీది చంద్రమోహన్ గౌడ్**
**9866510399**



### సాహిత్య జగత్తులో ఎవరెస్ట్ ఏటుకూరి

నీ పాటలు యువతరాన్ని
ఎర్ర బాటలో నడిపించినవి
నీ మాటలు నవతరాన్ని
ఎర్ర పాటలు పాడించినవి
ఎన్నాళ్ళు కష్టపడ్డా అన్నామె కరువురన్న
అని నువ్వు వరిణిస్తే కారిమికుల కష్టాలు
కంటికి కనిపించినవి
నీ తొంభై మూడేళ్ల నిండు జీవితం...
సాహిత్య సేవకే అంకితం నీ సహనం ..
స హృదయం నేటి తరానికి..
రేపటి తరానికి ఆదర్శం
ఓ మానవతా వాది ఓ మహర్షి
ఓ అభ్యుదయ కవిఏటుకూరి
దివినుండి భువికి దిగి రావయ్య మరోసారి

**డాక్టర్ సూర్య ప్రకాష్**

### మన రైతన్న

ఆగమై పోతుండుడన్న మన రైతన్న
ఆగ మాగమై పోతుండుడన్న
ఎండవానలకోర్చి, చెమటధారలు కార్చి
కష్టపడ్డ పైరు చేతికందేవేళ

అనుకోని వానలతో పంట ఒరిగీపోగ
గుండె బరువైపోగ, కలలు చెదిరిపోగ
ఆగమై పోతుండుడన్న మన రైతన్న
ఆగ మాగమై పోతుండుడన్న&.!!

రేయనక పగలనక ,నారేసి ,నీరోసి
కాచి పెంచిన పంట ఎండ మంటలలోన
కళ్ళెదుట కాలి బూడిదవుతుంటే
కన్నీటి కళ్ళతో, కాలేటి కడుపుతో

ఆగమై పోతుండుడన్న మన రైతన్న
ఆగ మాగమై పోతుండుడన్న
అప్పు సొప్పులు చేసి, మందు ఎరువులు పోసి
సాగు చేసిన పైరు, తెగులెట్టి పాడైతె
సరి అయిన ధర రాక , అప్పు తీర్చగ లేక

ఆగమై పోతుండుడన్న రైతన్న
ఆ పురుగు మందుతోనే
వొరిగి పోతుండుడన్న&.!!
హైటెక్కు చదువులు,
ఐటీలో కొలువులు

ఎఐలతో నడచు రోబోలు వచ్చినా
మింగ మెతుకేగాని బంగారమేలయా
ఆ మెతుకు పండించు ఆ దాత ఈనాడు
ఆగమై పోతుండుడన్న మన రైతన్న
ఆగ మాగమై పోతుండుడన్నా&.!!

అయ్యో! అన్నమే లేకుంటే
మన బతుకు సున్నానే కదయ్యా!



మేధావులైన నాయకులారా,
మనవి ఒకింత కృత్రిమ మేధస్సుతో
బాటు రవంత రైతన్నకు భరోసానిచ్చి,
కాపాడరండి అన్న దాతలను,

మన రైతు బంధువులను.
ఆగమై పోతున్నాడమ్మా, మన రైతన్న ,
ఆగమాగమైపోతున్నడమ్మా మన రైతన్న

**ఈదర రమాదేవి**
**సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమ నివాసి**



# 2 నుంచి ఇందిరమ్మ బీమా

- డిప్యూటీ సిఎం భట్టి
- ఘనంగా 'సుడా', గ్రంథాలయ సంస్థల చైర్మన్‌ల అభినందన సభ
- పాల్గొన్న మంత్రి తుమ్మల, ఎంపి రఘురాం రెడ్డి, శాసనసభ్యులు కూనంనేని, రాందాస్ నాయక్

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో జూన్ రెండు నుంచి ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రూ.1.15 కోట్ల కుటుంబాలకు ఇందిరమ్మ బీమాను అమలు చేసేవిధంగా పథకాన్ని రూపొందిస్తున్నామని దీని ద్వారా ఐదు లక్షల తక్షణ బీమా కుటుంబాలకు రక్షణ కవచంలా నిలుస్తుందని ఆయన తెలిపారు. సుడా ఛైర్మన్‌గా పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాల సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్ బాబాల అభినందన సభ ఆదివారం స్థానిక ఎస్ ఆర్ గార్డెన్‌లో జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన అభినందన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ నాయకులకు పదవులు వచ్చినప్పుడు కార్యకర్తలు చూపుతున్న ఆనందం, పార్టీ పట్ల క్యాడర్‌కు ఉన్న విశ్వసనీయతను తెలియపరుస్తుందన్నారు. పదేళ్ల పాటు విపక్షంలో ఉంటే కార్యకర్తలు పార్టీని కంటికి రెప్పలా కాపాడారని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 53 లక్షల నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మహిళలకు వడ్డీలేని రుణాలను అందిస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు మహిళలకు రూ.20వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందించామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేసిన నాయకులకు సుడా, గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్లు దక్కడం సంతోషకరమన్నారు. నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తే రాష్ట్ర నాయకత్వం తప్పకుండా గుర్తింపునిస్తుందని మంత్రి తుమ్మల తెలిపారు. పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు పదవి దక్కడం నాకు సంతోషకరమని నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తే పదవులు వస్తాయని దుర్గాప్రసాద్ రుజువు చేశారన్నారు. ఖమ్మం నగరంతో పాటు సుడా పరిధిలోని ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు నిధులు తీసుకురావాలని తుమ్మల ఆకాంక్షించారు. ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్, సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, మాజీ శాసన సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఖమ్మం నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను పూలమాలలు వేసి శాలువలతో అభినందించారు. ఈ సందర్భంగా ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

# ఏటుకూరికి ఎఐవైఎఫ్ నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అభ్యుదయ రచయితల సంఘం (అరసం) పునర్ వ్యవస్థాపకుల్లో ఒకరుగా, చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన ప్రముఖ ప్రజా సాంస్కృతిక ఉద్యమకారుడు ఏటుకూరి ప్రసాద్ మరణం తీవ్ర విషాదకరమని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు, సాహిత్య సాంస్కృతిక రంగాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఏటుకూరి ప్రసాద్ జీవితాంతం మార్క్సిస్టు భావజాలాన్ని ఆచరణలో పాటిస్తూ, కళలను ప్రజల విముక్తి కోసం ఉపయోగించాలనే ధ్యేయంతో పనిచేశారన్నారు. ప్రజా కళాకారులు, రచయితలు, యువతలో ప్రగతిశీల ఆలోచనలను పెంపొందించడంలో ఆయన విశేష పాత్ర పోషించారని, వారి జీవితం సాధారణ ప్రజల పక్షాన నిలిచిన ఒక నిబద్ధ కమ్యూనిస్టు కార్యకర్త జీవితానికి ప్రతీకా అని వారు పేర్కొన్నారు. యువతలో శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యత, సమానత్వ భావాలను పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి తరుపున ఏటుకూరి ప్రసాద్‌కు ఘన నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, సహచర ఉద్యమకారులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర కీలకం




- జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలి
- అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు దక్కేంత వరకు అండగా ఉంటా : ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/ఖమ్మం అర్బన్ :** జర్నలిస్టుల హక్కుల రక్షణకు వారి సమస్యల పరిష్కారానికి నిరతంర పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తృతీయ మహాసభ ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల బాధ్యతలు అత్యంత కీలకమైనవి అన్నారు. ప్రజా స్వామ్య పరిరక్షణలో నాలుగో స్తంభంగా జర్నలిస్టులు పోషిస్తున్న పాత్ర అమోఘం అన్నారు. క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు, ఇబ్బందులను ఎదుర్కొంటూ సాహసోపేతంగా విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. కాగా ప్రస్తుతం తరుణంలో కొన్ని మీడియా సంస్థల తీరు మారాల్సిన అవసరం ఉందని, నిత్యం పనిచేసే జర్నలిస్టులకు శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ జర్నలిస్టుల సుదీర్ఘ కాల సమస్య అయిన ఇళ్ల స్థలాలు దక్కేంత వరకు తామే వ్యక్తిగతంగా పార్టీ పరంగా అండగా ఉంటామన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం చొరవ చూపి హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమాజంలో నిష్పక్షపాత వైఖరితో వార్తలు రాసేటప్పుడు జర్నలిజం విలువలు కాపాడబడతాయని, వృత్తి పరమైన బాధ్యతను విస్మరించరాదని సూచించారు. జర్నలిస్టులంతా ఐఖ్యతతో ముందుకు సాగాలని అప్పుడే హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి వారి కుటుంబాల భద్రతకు ఎల్లప్పుడు తమ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ, కే రామ్ నారాయణ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు వెంకటరావు, నేషన్ కౌన్సిల్ మెంబర్ బివి రమణారెడ్డితో పాటు పాల్గొన్నారు.

**జూనియర్ న్యాయవాదులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి**
**ఎమ్మెల్యే కూనంనేనిని కలిసి విన్నవించిన న్యాయవాదులు**

జూనియర్ న్యాయవాదులకు కూడా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ బాధ్యులు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) బాధ్యులు కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావుకు విన్నవించారు. ఆదివారం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ అధ్యక్షులు దిలీప్ చౌదరి తాళ్లూరి, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) జిల్లా కోశాధికారి కొలికొండ శరత్‌బాబు తదితరులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36వేల మంది న్యాయవాదులు ఉన్నప్పటికీ తాజాగా న్యాయవాదుల సంక్షేమ ట్రస్టు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కేవలం 20వేల మంది న్యాయవాదులకు మాత్రమే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లు ప్రకటించారని తెలిపారు. 2019 నుంచి ఇప్పటి వరకు బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదుల్లో సుమారు 15వేల మంది 35 సంవత్సరాల లోపు యువ న్యాయవాదులేనన్నారు. న్యాయవాదుల సంక్షేమ చట్ట బిల్లుపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాత్రమే స్పందించారన్నారు. బిల్లు రూపకల్పన సమయంలో చాప్టర్ 2లో కార్పస్ ఫండ్ పొందుపర్చిన చట్టం రూపు దాల్చే సమయానికి ఆ చాప్టర్‌ను పూర్తిగా తొలగించారన్నారు. గతంలో న్యాయవాదుల సంక్షేమం కోసం కేటాయించిన రూ.100 కోట్లతో పాటు ముఖ్యమంత్రి ప్రకటించిన మరో రూ.100 కోట్లను విడుదల చేసి, దానిపై వచ్చే వడ్డీని కూడా వెంటనే అందుబాటులోకి తీసుకువస్తే మిగిలిన 15,500 మంది న్యాయవాదులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించవచ్చునని ఎంఎల్ఎ కూనంనేనికి విన్నవించారు.



**ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తా : కూనంనేని**

జూనియర్ న్యాయవాదుల ఇన్సూరెన్స్ సమస్యతో పాటు న్యాయవాదుల సంక్షేమం కోసం కేటాయించిన రూ.100 కోట్ల అంశంపై త్వరలో ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమ చట్టం సందర్భంగా ఈ అంశాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించానని, కార్పస్ ఫండ్ విషయాన్ని మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) నగర కార్యదర్శి ముమ్మడి సతీష్, కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ప్రజా నాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలు

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి నరసింహ్మా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ వేదికగా సోమవారం (నేటి)నుంచి రెండు రోజుల పాటు జరగనున్న తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి నరసింహ్మా పిలుపునిచ్చారు. రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన భారీ కటౌట్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇ.టి నరసింహ మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధానికి వ్యతిరేకంగా ఆనాడు ఫాసిస్టు పాలనను ధిక్కరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా ఏర్పడిన ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్(ఇప్టా)కు అనుబంధంగా తెలుగు నేలపైన ప్రజానాట్యమండలి పురుడు పోసుకుందని తెలిపారు. బ్రిటిష్, నిజాం నిరంకుశ పరిపాలనను వ్యతిరేకిస్తూ పోరాటం నిర్వహిస్తున్న ప్రజల గొంతుకగా అనేక కళారూపాల ద్వారా చైతన్యం చేసిన సంస్థ ప్రజానాట్యమండలి అన్నారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకమైన పాత్ర పోషించిన కళాకారులను గుర్తించి ప్రభుత్వం వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అంతరించిపోతున్న కళలను, కళా రూపాలను కాపాడుకోవాలని అన్నారు. మహాసభలో భాగంగా సోమవారం 25 తేదీన ఎఐటియూసి రాష్ట్ర కార్యాలయం నుంచి నారాయణగూడ వరకు నిర్వహించనున్న ప్రజా కళాకారుల ప్రదర్శనలో పెద్ద ఎత్తున కళాకారులు, కళాభిమానులు పాల్గొని జయప్రదం చేయగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్ బోస్, సిపిఐ సీనియర్ నాయకులు ప్రేమ్ పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ ఛాయా దేవి, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, టిపిఎన్ఎం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కె,లక్ష్మీ నారాయణ, కొండల్ రావు, స్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి. వెంకటేశం నేర్లకంటి శ్రీకాంత్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అనిల్ కుమార్, సుశాంత్, అరుణ్, భాను, అరుణ్, మనోజ్, అరవింద్ పాల్గొన్నారు.




# అభ్యుదయ వామపక్ష దార్శనికుడు గిరిప్రసాద్



సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు నల్లమల గిరిప్రసాద్ అభ్యుదయ వామపక్ష దార్శనికుడని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కొనియాడారు. కమ్యూనిస్టు యోధుడు నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్‌లో ఆదివారం సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ్, కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, వి.ఎస్.బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సీనియర్ సిపిఐ నాయకులూ సయ్యిద్ అజీజ్ పాషా, పి.ప్రేమపావని, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కె.రామకృష్ణ మాట్లాడుతూ నాడు నిజాం రాక్షస రజాకారుల మూకలను తిప్పికొట్టేందుకు కొనసాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నల్లమల గిరిప్రసాద్ తుపాకి చేతబట్టి కీలక భూమిక పోషించారన్నారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గిరిప్రసాద్ తన నాలుగున్నర దశాబ్ధాల రాజకీయ జీవితంలో ఎర్ర జండానే ఆశగా, శ్వాసగా బతికారన్నారు. ఏనాడూ పార్టీ క్రమశిక్షణను ఉల్లఘించకుండా నిబద్ధత కలిగిన కార్యకర్తగా పార్టీ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు.

**పెంచిన పెట్రోల్ ధరలను తగ్గించాలి : రామకృష్ణ డిమాండ్**

కేంద్రప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచి ప్రజలపై భారాన్ని మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. గత శుక్రవారం పెట్రోల్ డీజిల్ పై లీటరుకు రూ.3లు పెంచిన కేంద్ర ప్రభుత్వం వారం రోజుల వ్యవధిలోనే మూడుసార్లు ఆయిల్ ధరలు రూ.4.80 పెంచడంతో సాధారణ ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తక్కువ ఉన్నప్పుడు పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించకుండా ఆనాడు ప్రజలపై భారాలు మోపారని, పెద్ద ఎత్తున పన్నులు వేసి ప్రజలను లూటీ చేశారని రామకృష్ణ పేర్కొన్నారు. ఒక డాలర్‌కు రూ.96.20 పైసలు పెట్టాల్సి వస్తుందని, త్వరలోనే అది కూడా సెంచరీ కొట్టబోతుందన్నారు. ప్రజలపై భారలు మోపడం, అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెంచడం తప్ప గత 12 ఏళ్ల కాలంలో నరేంద్ర మోదీ ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందని చెప్పాలని డిమాండ్ చేశారు.

# 'జూన్ 2న' పిఆర్‌సి ప్రకటించాలి



ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'జూన్ 2న' పిఆర్‌సిని ప్రకటించాలని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు నూతనంగా ఉమ్మడి సర్వీస్ నిబంధనలు రూపొందించాలని, ఖాళీగా ఉన్న 600కు పైగా ఎంఇఒ పోస్టులను, 80 డిప్యూటీ ఇఒ క్యాడర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. గత 20 సంవత్సరాలుగా ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో పాఠశాలల పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. మన్నెగూడలో సదానందం గౌడ్ అధ్యక్షతన ఆదివారం ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర తృతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సదానందంగౌడ్ మాట్లాడుతూ నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టో మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మోడల్, ఎయిడెడ్ పాఠశాలల టీచర్లకు 010 పద్ధ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస బేసిక్ పే, సమ్మె కాలం వేతనాలను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా శాఖలో జిఒ 190ను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కుల గణన సర్వే పారితోషికం, సిపిఎస్ ఉపాధ్యాయులకు సంబంధించిన డిఎ బకాయిలను వెంటనే క్లియర్ చేయాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ పరీక్షలు నిర్వహించాలని ఆయన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న జిల్లా పరిషత్ జిపిఎఫ్‌కు సంబంధించి వడ్డీ డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్,ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలి సంఘం నివేదికను సమర్పించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గం పలు తీర్మానాలను ఆమోదించింది. రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం.పర్వత్‌రెడ్డి, సంఘ మాస పత్రిక ఎడిటర్ ఎల్.ఎం. ప్రసాద్, రాష్ట్ర నాయకులు వై.కరుణాకర్ రెడ్డి, ఎ.వి.సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణా రెడ్డి, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును అడ్డుకునే శక్తి బిఆర్‌ఎస్‌కు లేదు

- తెలంగాణ యువత భవిష్యత్తు 'ఫ్యూచర్ సిటీ'
- రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును అడ్డుకునే శక్తి బిఆర్‌ఎస్‌కు, మాజీ మంత్రి హరీష్‌రావుకు లేదని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అన్నారు. ఫ్యూచర్ సిటీ తెలంగాణ యువతకు ఉపాధి, అభివృద్ధికి మార్గం చూపే ప్రాజెక్ట్ అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయనప హెచ్చరించారు. గాంధీ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో యువత సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణ యువత భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ సిటీని తీసుకొచ్చారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ అంటే 'బట్టేబాజ్ రాష్ట్ర సమితి' అని, మతిస్థిమితం కోల్పోయి మాజీ మంత్రి హరీష్ రావు ఫ్యూచర్ సిటీపై బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మాజీ సిఎం చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌కు సైబర్ సిటీని తీసుకొచ్చినట్లే, సిఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ ద్వారా తెలంగాణ అభివృద్ధికి కొత్త దిశ చూపిస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అమరవీరుల కుటుంబాలు, నిరుద్యోగ యువత ఆశీర్వాదం ఉందని మెట్టు సాయి కుమార్ పేర్కొన్నారు.

# పుష్కర స్నానాలకు పోటెత్తిన భక్తజనం

భక్త జనసంద్రంగా మారిన త్రివేణి సంగమ తీరం




**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో అంగరంగ వైభవంగా కొనసాగుతూ 4వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీ శ్రీ అవని శృంగేరి జగద్గురువులు, శంకరాచార్య మహాసంస్థానం పీఠాధిపతి శ్రీ అద్వైతానంద భారతి కాళేశ్వరం క్షేత్రానికి చేరుకుని త్రివేణి సంగమ సరస్వతి నదిలో పవిత్ర పుష్కర స్నానం ఆచరించారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య నదీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పీఠాధిపతి దేశ ప్రజలు సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేసారు.

**కాళేశ్వరం క్షేత్రానికి పోటెత్తిన భక్తులు**

సరస్వతీ అంత్య పుష్కరాల సందర్భంగా ఆదివారం వివిధ ప్రాంతాల నుండి మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా తమ కుటుంబాలతో త్రివేణి సంగమ తీరానికి భారీగా భక్తులు పోటెత్తారు.ఈ సందర్భంగా త్రివేణి సంగమంలో పుష్కర భక్తుల పుణ్యస్నానాలతో తీర ప్రాంతం జనసందోహంగా మారింది. నదీమాతల్లి ఒడిలో పుష్కర పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలగా, పిల్లల కేరింతలు హద్దులు దాటాయి. పుష్కరాలలో ప్రత్యేకత ఏర్పడిన పితృదేవతలకు పిండ ప్రదానాలను ఆచరించిన భక్తులు పిండాలను పవిత్ర నదీ జలాలలో వదిలారు. భక్తుల శివ నామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగగా ఆలయానికి భారీగా భక్తుల తాకిడి పెరిగి సర్వదర్శనం క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా పుష్కర స్నానాలు ఆచరించేందుకు కాళేశ్వరం క్షేత్రానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులకు వేడి నుండి ఉపశమనం కల్పించేందుకు గ్రామంలోని ప్రధాన రహదారులపై నిరంతరం నీటిని చల్లే కార్యక్రమాన్ని చేపట్టారు.

**భక్తులకు మెరుగైన వైద్య సేవలు**

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.మధుసూదన్, ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.గోపాల్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం జిల్లా వైద్యాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం క్యాంపులో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్ల ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న చికిత్స, ఔషధాల లభ్యత, వైద్య సిబ్బంది విధుల నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా వేడి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,అత్యవసర వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాల సందర్భంగా ఆలయంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున భక్తులు అన్నదానం కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గందెసిరి సత్యనారాయణ పాల్గొన్నారు.

# గిరిజన అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

### నేటి తరానికి కొమురం భీమ్ స్ఫూర్తిదాయకం
### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణా రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** గిరిజనుల ఆరాధ్య దైవం కొమురం భీమ్ అని,ఆదివాసీల హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడి అమరుడైన గిరిజన వీరుడైన కొమురం భీం ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి దాయక మని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కొనియాడారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఆర్టీసి బస్టాండ్ వద్ద సింగరేణి ఆదివాసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురంభీం విగ్రహ ఆవిష్కరణ చేశారు. అనంతరం జెండా ఆవిష్క రించినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం కొమురం భీం చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువలేమని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆదివాసీ సమాజ అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని,గిరిజన ప్రాంతాల్లో విద్య,వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్ప నకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, వారి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యువత కొమురం భీం పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలోముందుం డాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీని వాస్, టౌన్ ప్రెసిడెంట్ ఇస్లావత్ దేవన్, సింగరేణి ఆది వాసి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్ర రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊకే నాగరాజు, జిల్లా కమిటీ మెంబర్ శ్రీనివాస్, కమిటీ మెంబర్ ఈసాల వీరకుమార్, సూర్ణపాక సంపత్, రవికుమార్, రంజిత్ కుమార్, ఈసం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ క్రీడలు:** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అంబే ద్కర్ స్టేడియంలో జూన్ నెలలో నిర్వహించనున్న తెలం గాణ రాష్ట్ర స్థాయిలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వ హించడం జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఈ సందర్భంగా సింగ రేణి జీఎం తో కలిసి ఆదివారం అంబేద్కర్ స్టేడియంలో బాస్కెట్ బాల్ ఏర్పాట్ల పనులను ఎమ్మెల్యే పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాస్కెట్ బాల్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించా లని అధికారులను ఆదేశించారు. క్రీడా పోటీ లకు హాజరయ్యే క్రీడాకారులకు వసతి, భోజన సదుపా యాలు సమకూరేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జిఎం ఏ రాజేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్, టౌన్ ప్రెసిడెంట్ దేవన్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## వడదెబ్బకు హమాలీ కార్మికుడు మృతి



**ప్రజాపక్షం/రాయపర్తి:** వడ దెబ్బ తగిలి హమాలీ కార్మికుడు మృతి చెందిన సంఘ టన మండలంలోని సన్నూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యాకయ్య (45) హమాలీ కార్మికు నిగా జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు లాగే ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనులు చేస్తుండగా ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి హమాలీ కార్మికులు ఆసుపత్రికి తరలించే లోపే ఆయన మృతి చెందాడు. యాకయ్య మృతి గ్రామంలో విషా దఛాయాలు అలుముకున్నాయి.

## వడదెబ్బకు మహిళ మృతి



**ప్రజాపక్షం/వెంకటాపురం:** రామప్ప మండల కేంద్రంలోని సాదు విమల కూతురు వద్ద ఆమె తల్లి రేగుల సమ్మక్క 70 అబ్బాపూర్ గ్రామం ఆమె బతుకు దెరువు కోసం వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన తన కూతురు సాదు విమల వద్ద గత కొన్ని సంవత్సరాలుగా అక్కడే జీవనం సాగిస్తూ వస్తున్న క్రమంలో శనివారం పెరి గిన ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బ కారణంగా చనిపోవడం జరిగింది కావున ఆమె కుటుంబానికి ఎక్స్ గ్రేషియా అందించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి అలువాల ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు.

## పుష్కర భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు: ఎస్‌పి



**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వ రంలో కొనసాగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారని ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌ కర్యాలు కలగకుండా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేయడంతో పాటు ఆలయంలో భక్తులు క్యూలైన్ విధానంలో దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలి పారు. పుష్కరాల సందర్భంగా భక్తుల రద్దీని నిరంతరం పరిశీలిస్తూ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ స్వయంగా పర్యవేక్షించినట్లు ఎస్పీ తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అద నపు పోలీస్ బలగాలను మోహరించి భక్తుల రాకపోకలను సుగమం చేసారు. భక్తుల భద్రత దృష్ట్యా ఘాట్‌లు, ఆలయ పరిసరాలు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన రహదారుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు నిరంతరం అప్ర మత్తంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. భక్తులు పోలీస్ శాఖ సూచ నలు పాటిస్తూ సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

## హనుమకొండలో ప్రశాంతంగా ముగిసిన యుపిఎస్‌సి పరీక్షలు



**ప్రజాపక్షం/హనుమకొండ :** యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీ క్ష 2026ను జిల్లాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా నిర్వ హించినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. ఆదివారం నిర్వ హించిన పరీక్షల సందర్భంగా హనుమకొండలోని పలు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల హాల్ టికెట్ల తనిఖీ, సంబంధిత యాప్ ద్వారా నమోదు ప్రక్రియ, భద్రతా చర్యలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అలాగే అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలను తనిఖీ చేశారు. అదే విధంగా యూపీఎస్సీ సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ అధికారి శుభం గాడ్, రాష్ట్ర స్థాయి అబ్జార్వర్ టిజిఎన్ పిడిసిఎల్ సిఎండి కె, వరుణ్ రెడ్డిలు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.హనుమకొండలోని ఎస్సార్ నేషనల్ హై స్కూల్, ములుగు రోడ్డులోని శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, భద్రకాళి దేవా లయం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, లాల్ బహదూర్ కళా శాల, అశోక జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్6 కళాశాల పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు.పరీక్షా కేంద్రాల్లో నిబం ధనలను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమ యపాలనకు ప్రాధాన్యతనిస్తూ పరీక్ష ప్రారంభానికి ముందుగానే అభ్యర్థు లను కేంద్రాల్లోకి అనుమతించినట్లు పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలలో 4,075 మంది అభ్యర్థుల కోసం పరీక్షలు నిర్వహించబ డినట్లు తెలిపారు. ఉదయం జరిగిన మొదటి సెషన్‌లో 2,762 మంది అభ్య ర్థులు హాజరుకాగా, 1,313 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. హాజరు శాతం 67.78గా నమోదైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెషన్‌లో 2,749 మంది హాజరుకాగా, 1,326 మంది గైర్హాజర య్యారని తెలిపారు. ఈ సెషన్‌లో హాజరు శాతం 67.46గా నమోదైనట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ అధి కారి శుభం గాడ్, కె, వరుణ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్స్, తహసీల్దార్లు, రూట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ తోటలో అగ్ని ప్రమాదం

**ప్రజాపక్షం/తొర్రూరు:** మండలంలోని హరిపిరాల గ్రామ శివారులోని ఆయిల్ ఫామ్ తోట ప్రాంతంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసు కుంది. ఎండల తీవ్రత, ఎండిపోయిన గడ్డి కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానిక రైతులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే తొర్రూరు ఎస్ఐ మహేందర్‌రెడ్డి సంఘ టనా స్థలానికి చేరుకొని గ్రామస్తులు, సమీప రైతుల సహకారంతో మంట లను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్ని ప్రమాదం సమీపంలోని ఇతర పంట పొలాలకు వ్యాపించే ప్రమాదం ఉండటంతో రైతులు, యువకులు తక్షణమే అప్రమత్తయ్యారు. సమిష్టి కృషితో పెద్ద ప్రమాదం తప్పిందని స్థాని కులు తెలిపారు. దీంతో భారీ ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యల వల్ల నివారించగలిగినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో రైతులు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. పంట కోత అనంతరం మిగిలిపోయే అవశేషాలు, ఎండిన గడ్డి, చెత్తను తగలబెట్టడం వల్ల ఇటువంటి అగ్ని ప్రమాదాలు సంభ వించే అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. రైతులు పొలాల వద్ద అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద పరిస్థి తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామ ప్రజలు, రైతులు సమయస్ఫూర్తితో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు అభినందించారు.

## మేడిగడ్డ వద్ద ఎల్ అండ్ టి కార్యాలయం దగ్ధం



**ప్రజాపక్షం/మహదేవపూర్:** మండలంలోని అంబట్‌పల్లి గ్రామం వద్ద మేడిగడ్డ బ్యారేజి నిర్మాణ సంస్థ కార్యాలయంలోఆదివారం ప్రమాదవా శాత్తు మంటలు చెలరేగి ఎల్ అండ్ టి కార్యాలయం పూర్తిగా దగ్ధమైంది. దీంతోవిలువైన రికార్డులు ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఆర్డి రవిందర్, డిఎస్పి సూర్యనారాయణ, స్థానిక డిప్యూటి తహసీల్దార్ యూసుఫోద్దీన్, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై పవన్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కార్యాలయం దగ్ధంపై స్థానికంగా పలు రకాల అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

## మహిళలకు స్వయం ఉపాధి కోసం శిక్షణ

**ప్రజాపక్షం/కొడకండ్ల:** మహిళలకు స్వయం ఉపాధి కోసం పలు రకాల శిక్షణ కార్యక్రమాలను వివిధ సంస్థల ద్వారా అందిస్తున్నట్లు సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఎన్ఐసీ స్వయం సహాయక సంస్థ చైర్మన్ లావణ్య ఆధ్వర్యంలో కొడకండ్లలోని మహిళలు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్, బ్యూటిషి యన్, డ్రాయింగ్, భరతనాట్యం, కుట్లు, అల్లికలు తమ స్వగృహంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో నేర్పుతున్నట్లు తెలిపారు. 06 సంవత్సరాల వయసు నుంచి 40 సంవత్సరాలలోపు గల చిన్నారులు, యువతులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 95421 18896 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

## 3 నుండి సిపిఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

### జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి

**ప్రజాపక్షం/నల్లబెల్లి:** వచ్చే నెల జూన్‌లో 3 నుండి 5 వరకు జరిగే సిపిఐ వరంగల్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులలో పాల్గొని జయప్రదం చేయ్యా లని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి కోరారు . ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత రాజకీయ ,ఆర్థిక ,సామాజిక పరిస్థితులు సంక్షోభంలోకి నెట్టబడ్డాయని చెప్పారు . దేశం లోని ఎస్సీ ,ఎస్టీ ,బిసి ,మైనార్టీలు ,వ్యవసాయ కార్మికులు ,రైతులు ,అసంఘిట కార్మికులు ,చిన్న మధ్య తరహా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటురన్నారు . కేంద్ర ,రాష్ట్ర ప్రభు త్వాల ప్రజా వ్యతిరేక విధానాలతో అప్పులు పెరిగిపోవడంతో నిత్య వసర వస్తువులు ధరలు ఆకా శన్ని అంటుకున్నాయని విమ ర్శించారు . దేశంలో అన్ని రంగాల్లో అవినీతి ,కల్తీ పెరిగి పోవడంతో ప్రజల కొనుగోలు శక్తి రోజురోజుకు తగ్గి పోయిం దని ,యువతకు ఉపాధి అవకాశం క్షీణించి పట్టణాలకు వలసలు పెరుగుతు న్నాయన్నారు . రైతులకు గిట్టుబాటు ధరలు లేక పోవడంతో మార్కెటింగ్ సౌకర్యల లేమి ,కల్తీ విత్త నాలు ,ఎరువులు ,పురుగుమందుల కారణంగా వ్యవసాయ రంగం కుదేలు అవుతుందని అవేధన వ్యక్తం చేశారు . దేశ ప్రదాని నరేంద్రమోడి తీసుకు వచ్చిన రైతు వ్యతిరేక చట్టాలపై చర్చించేం దుకు ఈ నెల 3,4,5 తేదిలలో నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో జరిగే జిల్లా స్థాయి శిక్షణ తరగ తులలో సిపిఐ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యాలో పాల్గొని జయప్రదం చేయ్యాలని కోరారు . శిక్షణ తరగతులకు రాష్ట్ర కార్యదర్శి కొత్తగుడేం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నారని చెప్పారు .



## అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు పూర్తి

### కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ప్రజాపక్షం/ములుగు:** మలుగు జిల్లాలోని వరి ధాన్యం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాలతో పంటలు తడవకుండా కొను గోలు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాదు నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధన సరి అనసూయ సీతక్క రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పలువురు మంత్రులు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్యాడి ప్రొక్యూర్‌మెంట్ ఈ నెల 25 నుంచి నిర్వహించే ప్రజాపా లన ప్రగతి ప్రణాళిక మహిళా సంక్షేమ కార్యక్రమాలు అంశా లపై సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పది రోజుల్లోగా యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలని ఆదేశం చారు గోదాముల కొరత లారీలు హమాలీల సమ స్యలు ఉన్న చోట వెంటనే పరిష్కరించాలని తెలి పారు రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు డేటా అప్‌డేషన్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను అదేశించారు ఈ సమావేశంలో డి ఎం సివిల్ సప్లైస్ కృష్ణవేణి డి డబ్ల్యు ఓ ప్రేమలత సిపిఓ ప్రకాష్ సంబంధిత అశికారులు తదితరులు పాల్గొ న్నారు.



## పిపిసి కేంద్రం, రైస్ మిల్‌ను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/సంగెం:** మండలంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం సంగెం మండ లంలోని కాట్రపల్లి పీపీసీ కేంద్రం మరియు రైస్ మిల్లును ఆకస్మికంగా పరిశీలించారు. అనం తరం సంగెం మండలంలోని రైస్ మిల్లును సంద ర్శించి మిల్లింగ్ కార్యకలాపాలను సమీక్షిం చారు. అలాగే వర్ధన్నపేట మండలంలోని కదిరి గూడెం భవాని ఎఫ్‌పీఓ, రామదాన్ తండా ఎరు వాక ఎఫ్‌పీఓ, చంద్రు తండా పీపీసీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్శనలో అదనపు కలె క్టర్ జి. సంధ్యారాణి, సీఈఓ జెడ్పీ రాంరెడ్డి, పీడీ డీఆర్‌డీఏ నాగపద్మజా, డీసీఓ నీరజ, డీఎస్‌ఓ కిష్టయ్య, డీఎంసీఎస్ సంధ్యారాణి అధికారు లతో కలిసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, నిల్వలు, తరలింపు ఏర్పాట్లు మరియు మిల్లింగ్ కార్యకలాపాలను సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పీపీసీ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని అధి కారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా నిర్వ హించడంతో పాటు రైస్ మిల్లుల్లో మిల్లింగ్ పనులు సజావుగా కొనసాగించేలా చర్యలు తీసు కోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలె క్టర్ ఆదేశించారు. వాతావరణ శాఖ సూచన లను తప్పనిసరిగా పాటిస్తూ కొనుగోలు కేంద్రా ల్లో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగా హన కల్పించాలని సూచించారు. అధిక ఉష్ణోగ్ర తల ప్రభావంతో రైతులకు వడదెబ్బ తగలకుం డా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, తా గునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు అం దుబాటులో ఉంచాలని సెంటర్ ఇంచార్జ్‌లకు క లె క్టర్ ఆదేశించారు. ఈ సందర్శనలో సంబంధిత అ ధికారులు, సెంటర్ ఇంచార్జ్‌లు రైతులు ఉన్నారు.



## మరో మూడు రోజులు తీవ్ర ఎండలు: రెడ్ అలెర్ట్

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో రాబోయే మూడు రోజుల పాటు తీవ్ర ఎండలు ఉండే పరిస్థితులు ఉన్నాయని, ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఇటీవల నమోదైన గణాం కాల ప్రకారం జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45.7 డిగ్రీలు నమోదు అయ్యిందని, ఈ నేప థ్యంలో రాబోయే మూడు రోజులు ఉష్ణోగ్రతల అంచనాల మేరకు వాతా వరణ శాఖ జిల్లాల వారీగా హెచ్చరికలు జారీ చేసినట్లు కలె క్టర్ తెలిపారు. జిల్లాల్లో రాబోయే మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు 45 C పైగా నమో దయ్యే అవకాశం ఉన్నం దున రెడ్ అలెర్ట్ ప్రకటించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని సూచనలు చేశారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ల కుండా ఉండాలని తెలిపారు. తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం, నిమ్మరసం వంటి ద్రవాలు తరచూ తీసుకోవాలి. బయటకు వెళ్లేట ప్పుడు తలకు టోపీ లేదా గుడ్డ కట్టుకోవాలని, వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు ప్రత్యేక జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. డీహైడ్రేషన్ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య సేవలు తీసుకోవాలని తెలి పారు.

## సరస్వతి అంత్య పుష్కరాలలో 108 అత్యవసర సేవలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** కాళే శ్వరం క్షేత్రంలో కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాలలో భాగంగా ఈ నెల 21 నుండి 24 వరకు 108 అంబులెన్స్ సేవల ద్వారా 326 కేసులను తరలించారు. రోగులకు అంబులెన్స్‌లోనే ప్రీహాస్పిటల్ వైద్య చికిత్సలు అందిస్తూ సమీప ఆసుపత్రులకు సురక్షితంగా తరలిస్తున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులతో పాటు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వడదె బ్బకు గురవుతున్నా ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో 108 సిబ్బంది సమర్థవంతంగా సేవలు అందిస్తున్నారు. ప్రోగ్రామ్ మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ, వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. జిల్లా మేనేజర్ రాజు నాయక్ మాట్లాడుతూ, పుష్కర స్నానా లకు, ఆలయ దర్శనానికి వచ్చే భక్తులు తీవ్రమైన ఎండల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలకు సేవలు అందిస్తున్న 108 సిబ్బంది భక్తుల శ్రద్ధ వహించడంతో పాటు తమ ఆరో గ్యంపై జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.





## ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిలో వేం పాత్ర కీలకం




**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల రాజ్య సభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతిని ధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలందరూ వేం నరేందర్ రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నేతలు మాట్లా డుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిలో ఆయన పాత్ర కీలకమని కొనియా డారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వేం నరేందర్ రెడ్డి లేకుంటే జిల్లాకు సగం నిధులు కూడా వచ్చేవి కావని అన్నారు. గతంలో దుర్మార్గుల చేతిలో ఇరవై ఏళ్ల అభివృద్ధి వెనక్కు పోయిందని విమర్శిం చారు. అయితే రానున్న రోజుల్లో వరంగల్ జిల్లా నుంచి కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం, కరీంనగర్ వంటి పెద్ద నాయకులు ఉన్న జిల్లాల్లో కూడా సాధించని స్థాయిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారని, అదే తరహాలో వరంగల్ జిల్లాకు అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని కోరారు.పార్టీ కోసం కష్టపడ్డ వారికి భవిష్యత్తులో సముచిత గౌరవం, పదవులు కల్పించాలని సూచించిన ఆయన, తనకు ఎమ్మెల్యే టికెట్ రావడంలో వేం నరేందర్ రెడ్డి పాత్ర కీలకమని వెల్లడించారు. ఉమ్మడి జిల్లా నేతలందరం ఐక్యంగా ముందుకు సాగుతూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. "వేం అన్న కొందరివాడు కాదు అందరివాడు" అంటూ ఆయనపై తన అనుబం ధాన్ని వ్యక్తం చేశారు. అలాగే రాజ్యసభ సభ్యునిగా ఎంపిక చేసిన ఏఐసీసీ, టీపీ సీసీ నాయకత్వానికి జిల్లా తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఓరుగల్లు అభివృద్ధిపై వేం నరేందర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నా రని చెప్పారు. రాబోయే 25 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి తనకు దేవుడు ఇచ్చిన సోదరుడు, ప్రాణ స్నేహితుడని పేర్కొన్న వేం నరేందర్ రెడ్డి, గత ఏడు ఎనిమిదేళ్లలో ఆయన ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని దగ్గ రగా చూశానన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చే ప్రతి ఆదేశాన్ని నమ్మకంగా అమలు చేస్తానని స్పష్టం చేశారు.

## 25 నుంచి 30 వరకు మహిళా సంక్షేమ వారోత్సవాలు

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా మే 25 నుంచి 30 వరకు జిల్లాలో మహిళా సంక్షేమ వారోత్సవాలలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మే 22న నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమాల కొనసాగింపుగా ఈ వారాంత కార్యక్రమాల కొనసా గింపుగా ఈ వారాంత కార్యక్రమాలను సెర్ప్ మెప్మా, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ సంయుక్తంగా చేపట్టను న్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాలను దిగ్విజయం చేయాలన్నారు.

# 75 శాతం ధాన్యం కొనుగోళ్లు

పది రోజుల్లో ప్రక్రియ పూర్తి *ఇప్పటి వరకు 2,29,514 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు..* రైతుల ఖాతాల్లో రూ.407.21 కోట్లు జమ..

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా




**ప్రజాపక్షం/కరీంనగర్:** ఇప్పటివరకు జిల్లాలో సుమారు 75 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అయిందనీ, మిగిలిన కొనుగోళ్లను కూడా వచ్చే 10 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష, అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్ నేపథ్యంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 68 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి అయినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 2,29,514 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈ కొనుగోళ్ల విలువ రూ.544.74 కోట్లు కాగా, రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.407.21 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మిగతా అమౌంటు ఒకటి రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత నాలుగు రోజుల్లోనే 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్–అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు.

### పది రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి

మరో 10 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రోజువారీ లక్ష్యాల వారీగా మిగిలిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు.. ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మిగిలిన ప్రక్రియను మరో 10 రోజుల్లో విజయ వంతంగా పూర్తి చేయడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. 24 గంటల పాటు అధికారులు అందుబాటులో ఉంటూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని జిల్లా యంత్రాంగం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నదని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.

## బోయిన్ పేటలో కంపు కొడుతున్న మురుగునీటి కాలువలు



**ప్రజాపక్షం/ముత్తారం :** మంథని మున్సిపాలిటీ పరిధిలోని బోయిన్ పేటలో పారిశుద్ధ్య వ్యవస్థ తీవ్రంగా అస్తవ్యస్తంగా మారింది. స్థానికంగా ఉన్న మురుగునీటి కాలువలను నెలల తరబడిగా శుభ్రం చేయకపోవడంతో అవి మురుగుతో నిండిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. కాలువలు పూర్తిగా పూడిపోవడంతో మురుగునీరంతా రోడ్లపైకి చేరుతోందని,కాలువలు ఎక్కడున్నాయో తెలియక చిన్నపిల్లలు అందులో పడిపోతున్నారని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శ్రీనివాస్ ఈ ప్రాంతంలో పర్యటించి,కాలువల దుస్థితిని పరిశీలించి వెళ్లారే తప్ప ఇప్పటివరకు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని వార్డు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కేవలం వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప తమ ఇబ్బందులను పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి, తక్షణమే డ్రైనేజీలను శుభ్రం చేయించి బోయిన్ పేట ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## నేటి నుండి పొద్దు తిరుగుడు కొనుగోలు పునఃప్రారంభం: ఎఎంసి చైర్మన్

**ప్రజాపక్షం/బెజ్జంకి:** నేటి నుండి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో పొద్దు తిరుగుడు కొనుగోలు ప్రక్రియను పునఃప్రారంభించనున్నట్లు ఎఎంసి చైర్మెన్ పులి కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతులు పొద్దు తిరుగుడు పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి విక్రయించుకోవాలని అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అందుబాటులో జీలుగ విత్తనాలు

**ప్రజాపక్షం / చందుర్తి :** వ్యవసాయ క్షేత్రాలలో విత్తడానికి అవసరమైన జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.జీలుగలు విత్తుకొని కలియదున్నితే మంచి ఫలితం ఉంటుందని, అందుకే రైతులకు 50 శాతం సబ్సిడి పై విత్తనాలు ఇస్తున్నామని తెలిపారు.మండల కేంద్రంలోని ఫ్యాక్స్ కార్యాలయంతో పాటు సనుగుల ఫాక్స్ కార్యాలయంలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాసు పుస్తకం , ఆధార్ కార్డు జిరాక్సలతో సంబంధిత వ్యవసాయ విస్తీరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.30 కిలోల బరువు గల జీలుగ విత్తనాల సంచి ధర రూ 2452.50 గాను, 40 కిలోల బరువు గల జనుము విత్తనాల సంచి ధర రూ 3110.00 ఉంటుందని తెలిపారు.

## ఎండల ప్రభావం ...జనం ఉక్కిరి బిక్కిరి

**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల జిల్లాను ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా భానుడు భగ్గుమంటున్నాడు.ఆదివారం జిల్లాలో పలుచోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.మల్లాపూర్ మండలం రాఘవపేటలో అత్యధికంగా 46.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై జిల్లాలోనే హాట్‌స్పాట్‌గా నిలిచింది.ఎండపల్లి మండలం గుల్లకోటలో 45.9 డిగ్రీలు, ధర్మపురి మండలం నేరెళ్ల,జైన గ్రామాల్లో చెరో 45.8 డిగ్రీలు నమోదయ్యాయి. సారంగాపూర్ మండలంలో 45.6 డిగ్రీలు నమోదవగా, జగిత్యాల పట్టణం,బుద్దేష్‌పల్లిలో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.కోరుట్ల మండలం ఐలాపూర్, పెగడపల్లి మండలం, ఇబ్రహీంపట్నం మండలం గోదూరు, రాయికల్ మండలం అల్లిపూర్ ప్రాంతాల్లో 45.2 డిగ్రీలు నమోదయ్యాయి.మల్లాపూర్ మండలంలో మరో ప్రాంతంలో45.1డిగ్రీలు, వెల్గటూరులో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## మెట్‌పల్లి మండలంలో జువ్వాడి నర్సింగరావు విస్తృత పర్యటన



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆదివారం మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. అగ్నిప్రమాదాలకు గురైన ఈతవనాలను పరిశీలించడంతో పాటు కొండ్రికర్ల బ్రిడ్జి నిర్మాణ పనులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. మెట్ల చిట్టాపూర్ గ్రామంలో అగ్నిప్రమాదంతో కాలిపోయిన ఈతవనాన్ని పరిశీలించిన ఆయన, బాధితులకు నష్టపరిహారం అందేలా జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.కొనరావుపేట గ్రామంలో అగ్నిప్రమాదంతో దగ్ధమైన ఈతవనాన్ని పరిశీలించి బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం జగ్గాసాగర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు,ఆయా గ్రామాల ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న అద్వైతానంద భారతి స్వామిజీ

**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని శ్రీ శ్రీ అద్వైతానంద భారతి స్వామిజీ, అవని శృంగేరి జగద్గురువులు , శంకరాచార్య మహాసంస్థానం వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర సరస్వతి అంత్య పుష్కరాలు, కాళేశ్వరం దర్శనం అనంతరం వేములవాడకు విచ్చేశారు. ఆలయానికి చేరుకున్న స్వామిజీకి ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తివచనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో ఆశీర్వచన కార్యక్రమం నిర్వహించగా, ఆలయ అర్చకులు ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా భిక్షావందనం సమర్పించారు. అనంతరం ఆలయఇఒఎల్ రమాదేవి స్వామిజీకి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అడ్వైజర్ శ్రీ గోవింద హరి,ఆలయ డిఇఒభాస్కర శర్మ ,ఎఇఒలు జి. శ్రావణ్ కుమార్, జి అశోక్ కుమార్ ఆలయ ఉద్యోగులు, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

## మహిళా నాయకురాలిపై వ్యాఖ్యలు మానుకోవాలి

బిజెపి ఎస్‌సి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** కేంద్రీయ విద్యాలయం అంశంపై మాట్లాడుతున్న ఒక బిసి మహిళా నాయకురాలిపై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని ఎస్‌సి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం బిజెపి కార్యాలయంలో చంద్ర శేఖర్ విలేకరులతో మాట్లాడారు.ఇటీవల కలెక్టరేట్‌లో ప్రజాపాలన వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన "ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ విజయోత్సవం" కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలా నిర్వహించబడిందని ఆరోపించారు. అధికారిక కార్యక్రమంలో ఎటువంటి పదవులు లేని కాంగ్రెస్ నాయకులు నందయ్య, గిరినాగ భూషణం,బండ శంకర్‌లను అధికారులతో పాటు వేదికపై కూర్చోబెట్టడంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.నందయ్యకు స్కూల్‌లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో కూడా తెలియకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని చంద్రశేఖర్ విమర్శించారు. గూగుల్‌లో చూసినా కేంద్రీయ విద్యాలయంలో 1000 నుంచి 1200 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారని తెలుస్తుందని అన్నారు. చదువు గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం "దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు..అనంతరం బిజెపిజిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్ కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారుడిసిసి అధ్యక్షుడు నందయ్య తొలిసారిగా స్వతంత్రంగా ప్రెస్‌మీట్ నిర్వహించడం సంతోషకరమేనని, కానీ ఒకబిసి మహిళా నాయకురాలు ఎదగడాన్ని జీర్ణించుకోలేక ఎమ్మెల్యే ప్రేరేపణతో మాట్లాడటం బాధాకరమని అన్నారు.గతంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా అడ్లూరి లక్ష్మణ్ అనేక ప్రెస్‌మీట్లు నిర్వహించారని, అయితే నందయ్య పరిస్థితి చూస్తే ఆయన పూర్తిగా ఎమ్మెల్యే ఆధీనంలో పనిచేస్తున్నట్టు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్,జిల్లా కార్యదర్శి పాత రమేష్, ఆముద రాజు, దూరిశెట్టి మమత, మేడిపల్లి పుష్ప,ఇట్యాల రాము, పవన్ సింగ్, సింగం పద్మ,మామిడాల కవిత,సిరిపురం శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టిపిసిసి చీఫ్ పుట్టినరోజు వేడుకలు




**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** తెలంగాణ పిసిసిరథసారధి, ఎమ్మెల్సీ బి మహేష్ కుమార్ గౌడ్ జన్మదినం వేడుకలు ఆదివారం కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఫహద్ నగరంలోని ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ గారు, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తో పాటు పలువురు నేతలు హాజరై పుట్టిన రోజు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి వైద్యుల అంజన్ కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, కర్ర రాజశేఖర్ మాట్లాడుతూ.. మాజీ రాష్ట్ర ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షుడిగా, బలహీన వర్గాలకు చెందిన రైతు బిడ్డగా, టిపిసిసి అధ్యక్షుడి స్థాయి వరకు ఎదిగిన మహేష్ కుమార్ గౌడ్ పై కొంత మంది కుట్రలు చేస్తున్నప్పటికీ , ప్రతిపక్షాలు గత రెండు రోజులుగా మహేష్ కుమార్ గౌడ్ గారిపై అభాండాలు వేయాలని చూడడం పట్ల అది వారిలో ఉన్న భయాన్ని తెలియజేస్తుందని, ఈ పరిస్థితుల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆయనకు అండగా నిలబడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కామ్ రెడ్డి రామ్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అహమ్మద్ అలీ, వరాల నర్సింగం, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, మూల రవీందర్ రెడ్డి, మూల జైపాల్, వీర దేవేందర్, వసీం, సరిల్లా రతన్ రాజు, గంగుల దిలీప్, కంకణాల అనిల్, అమీర్, కుంభాల రాజకుమార్, ఇమ్రాన్, సాయిని తిరుపతి, మాజీద్ అలీ ఖాన్, మంద మహేష్, మాదాసు శ్రీనివాస్, గడప శ్రీనివాస్, మాలోతు మహాలక్ష్మి , శిల్పా, స్వప్న శ్రీ, ఇమ్రాన్ గని, పెంట శేఖర్, హాజీ, పాషా, అందే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లో మంటలు ... భారీ ఆస్తి నష్టం

ఎవరైనా నిర్లక్ష్యంగా దుశ్చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం

జగిత్యాల రూరల్ ఎస్ఐ



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలో కొందరు వ్యక్తులు నిర్లక్ష్యంగా వారి పంట పొలాల్లో మంటలు పెట్టడం వల్ల అది చుట్టుపక్కల ఉన్న పొలాలకు వేగంగా వ్యాప్తి చెందడమే కాకుండా వారి పొలాలని నాశనం చేస్తూ వారి పొలాల్లో ఉన్న కరెంటు మోటార్లను తగలబెడుతూ వారికి నష్టం చేకూరుస్తుందని అంతేగాకుండా ఈ మంటలు అలాగే వ్యాప్తి చెంది దగ్గర్లో ఉన్న ఐకెపి సెంటర్ లో ఉన్న వారి ధాన్యాన్ని, ధాన్యం సంచులకు, చుట్టూ పక్కల ఉన్న ఈత, తాటి వానలకు వ్యాప్తి చెంద మంటలు అంటుకొని తీవ్ర నష్టాన్ని కలిగించే అవకాశం ఉందని జగిత్యాల రూరల్ ఎస్ఐ ఉమా సాగర్ అన్నారు. ఇలా వరి కొయ్యలని తగలబెట్టడం వల్ల భూసారం కూడా తగ్గిపోయి పంట దిగుబడుపై ప్రభావం చూపుతుందని, ఆ మంట వల్ల వచ్చే పొగతో కాలుష్యం అవుతుందని జగిత్యాల రూరల్ ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల రూరల్ ఎస్ఐ ఉమా సాగర్ మాట్లాడుతూ రైతులు, గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. వరి కోయ్యలు, గడ్డి దిబ్బలు, పొలాల వద్ద ఎవరూ నిర్లక్ష్యంగా నిప్పు వేయరాదు. బిడిలు, సిగరెట్లు తాగిన తర్వాత వెలిగిన ముక్కలను పొలాల్లో పడవేయకూడదని, ఐకెపి సెంటర్లు, గోదాములు, ధాన్యం నిల్వ ప్రాంతాల వద్ద అగ్ని ప్రమాద నివారణ చర్యలను ఐకేపీ నిర్వాహకులు తప్పనిసరిగా చేపట్టాలి. పొలాల వద్ద నీటి డ్రములు, ఇసుక సంచులు, ఇతర అగ్ని నివారణ పరికరాలు అందరు అందుబాటులో ఉంచుకోవాలని, గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని జగిత్యాల రూరల్ ఎస్ఐ అన్నారు. గ్రామస్తులు, రైతులు పరస్పరం అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జగిత్యాల రూరల్ ఎస్ఐ ఉమా సాగర్ ప్రజలకు, రైతులకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని జగిత్యాల రూరల్ పోలీసులు వారు కోరారు. ఇకపై ఎవరైనా నిర్లక్ష్యంగా ఇలాంటి దుశ్చర్యలకు పాటుపడి మిగతా చుట్టుపక్కల రైతులకు ఇబ్బంది కలిగించే పనులు చేస్తే చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని జగిత్యాల రూరల్ ఎస్ఐ ఉమా సాగర్ ఓ ప్రకటనలో హెచ్చరించడం జరిగింది.

## గంజాయి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు : జగిత్యాల ఎస్ఐ

ఇద్దరు వ్యక్తులు అరెస్టు




**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సమాచారం మేరకు గంజాయి అక్రమ రవాణా సరఫరాపై జగిత్యాల రూరల్ పోలీస్ వారు ఎస్ఐ ఉమాసాగర్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక తనిఖీలను పోలీస్ సిబ్బంది కలిసి చెల్గల్ గ్రామ శివారులో వాహనాల తనిఖీలు,అనుమానితుల తనిఖీలు చేపట్టారు.తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా తాటిపాముల వంశీ, 25 సం తారకరామానగర్ చెందిన, మెండే అనిల్ అయోధ్య గ్రామం రాయికల్ మండలానికి చెందిన వారిగా గుర్తించారు.వారి వద్ద నిర్వహించిన తనిఖీలో 1694 గ్రాముల గంజాయి ఒక సెల్ ఫోన్ జగిత్యాల రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న గంజాయి అక్రమంగా సరఫరా చేయడానికి తీసుకెళ్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని జగిత్యాల రూరల్ ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయాలు,రవాణా లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని జగిత్యాల రూరల్ ఎస్సై ఉమాసాగర్ ప్రజలను కోరారు.

## లోడింగ్, అన్ లోడింగ్ వేగంగా పూర్తి

ధాన్యానికి అనుగుణంగా వాహనాలను సమకూర్చాలి

ధాన్యం కొనుగోళ్లు, తరలింపు, జన గణన ప్రక్రియపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, వాహనాల్లో లోడింగ్, రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, తూకం వేసిన బస్తాల తరలింపు, వాహనాలు, హమాలీల సంఖ్య పెంచడం, మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయడంపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణా భివృద్ధి శాఖ, మెప్మా, రవాణా శాఖ .. అలాగే జన గణనపై సిపిఒ శ్రీనివాసాచారి, ఛార్జ్ అధికారులు తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మండలాల వారీగా మొత్తం వచ్చిన ధాన్యం ఎంత? ఇప్పటి దాకా కొనుగోలు చేసింది ఎంత? అని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్లు అందుబాటులో ఉండి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలు తనిఖీ చేయాలని సూచించారు. తుది దశలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని, అక్కడి వాహనాలు, హమాలీలను మరో కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. అన్ని రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్ పరిశీలిస్తూ.. పూర్తి అయిన వాహనాలను కొనుగోలు కేంద్రాలకు పంపించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాల తరలింపునకు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చేలా చూడాలని జిల్లా రవాణా శాఖ అధికారిని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్, అపరెల్ పార్క్, గోదాములు, రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, హమాలీల సంఖ్య పెంచాలని సూచించారు.

### జన గణన పకడ్బందీగా చేయాలి..

జిల్లాలో జన గణన పకడ్బందీగా వేగంగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మండలాల వారీగా పురోగతి పై ఆరా తీశారు. ఛార్జ్ అధికారులు తమ పరిధిలోని సూపర్ వైజర్లు, ఎన్యూమ రేటర్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించి.. వివరాలను గడువులోగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

## వరి కొయ్యలను కాల్చొద్దు

మండల వ్యవసాయ అధికారి



**ప్రజాపక్షం/ముత్తారం :** వరి కోతల అనంతరం మిగిలిన వరి కొయ్యలను తగలబెట్టడంతో నేలలో పంటకు మేలు చేసే సూక్ష్మ జీవులు, వానపాములు చనిపోతాయని మండల వ్యవసాయ అధికారి అనూష అన్నారు .ఇలా చేస్తే కలిగే నష్టాలను ఆయన వివరించారు. వరి కొయ్యలను కాల్చితే భూమిలోని సేంద్రియ కర్బనం తగ్గి నేలసారం తగ్గుతుంది.అంతేకాకుండా నేల గట్టిగా మారి నీటిని నిలుపుకునే శక్తి తగ్గుతుంది.నేలలో ఉండే సహజ పోషకాలైన నత్రజని,భాస్వరం, పొటాషియం నశిస్తాయి. రైతులు ఎరువులు ఎక్కువగా వేయాల్సి రావడంతో పెట్టుబడిపెరుగుతుంది. కొయ్యలను కాల్చడంతో వెలువడే పొగ నుంచి హానికర వాయువులు విడుదలై పొలాలను ఆనుకుని ఉన్న రోడ్ల మీదుగా ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతారు.వాయు కాలుష్యం పెరిగి పర్యావరణానికి కూడా హాని జరుగుతుంది.అదే వరి కొయ్యలను కాల్చకుండా నేలలోనే కల్టివేటర్,రోటావేటర్లతో కలియదున్నడంతో నేలలో సేంద్రియ పదార్థం,పంటకు మేలు చేసే సూక్ష్మ జీవులు, వానపాముల సంతతి, నేలకు నీటిని నిలుపుకునే సామర్థ్యం పెరుగుతాయి.దీంతో పంటకు నీటి అవసరం కొంత మేర తగ్గుతుంది. అలాగే పర్యావరణ కాలుష్యం ఉండదు. నేలలో కలియదున్నిన తర్వాత త్వరగా కుళ్లిపోవడానికి ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్,15 కిలోల యూరియా వేయాలి. ఏమైనా సందేహాలుంటే స్థానిక రైతువేదికలో వ్యవసాయ అధికారులను సంప్రదించాలి అని చెప్పారు.

## రైతుల కోసం రంగంలోకి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండలం మధురానగర్ వద్ద కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారిపై లారీలను ఆపి ధాన్యం మిల్లులకు తరలించడానికి సహకరించాలని లారీ యజమానులను కోరిన ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని మర్చిపోకుండా కొనుగోలు కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ చేస్తూ రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం లారీల కొరతతో మిల్లులకు తరలించడం ఇబ్బందిగా మారింది. రైతుల ఇబ్బందులను గ్రహించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్వయంగా రంగంలోకి దిగారు. ఆదివారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాకు సమీపంలో కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారిపై వెళుతున్న లారీలను మంగపేట చెక్పోస్ట్ వద్ద ఎమ్మెల్యే ఆపారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలింపుకు సహకరించాలని లారీల యజమానులతో మాట్లాడారు. అంతేకాకుండా తానే లారీలో కూర్చుని స్వయంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లారు. లారీ లోడింగ్ తర్వాత మిల్లులకు తరలించిన వెంటనే అన్లోడ్ అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా నిత్యం చొప్పదండి నియోజకవర్గం లోని కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి పర్యవేక్షిస్తూ రైతుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తొలగిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రధాన్ రాజీనామా చేసేదాకా విశ్రమించం

ప్రశ్నాపత్రం లీక్‌లను నివారించేందుకు పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేయాలి : ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ :** నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వివాదంపై కాంగ్రెస్ కేంద్రంలోని మోదీ సర్కార్‌పై విమర్శల పర్వం కొనసాగిస్తూనే ఉంది. లీకేజీ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తుంది. ఆయన రాజీనామా చేసేదాకు తాము విశ్రమించబోమని పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. నీట్ వంటి పేపర్ లీక్‌లను నివారించడానికి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌ను ఎత్తిచూపుతూ, ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో విద్యార్థులు నిరసన తెలుపుతున్న వీడియోను ఆయన పంచుకున్నారు. వారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ప్రధాన్‌లకు వ్యతిరేకంగా నినాదాలు కూడా చేశారు. 'లక్షలాది మంది యువత వీధుల్లోకి వచ్చినప్పుడు, 22 లక్షల మంది పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో ఉన్నప్పుడు ప్రధాని మౌనంగా ఉంటే, ప్రభుత్వం స్పందించడంపై దృష్టి పెట్టకుండా తప్పించుకోవడంలో నిమగ్నమై ఉందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి, నీట్ వంటి పేపర్ లీక్‌లను నివారించడానికి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసే వరకు తమ పార్టీ ఆగబోదని రాహుల్‌గాంధీ ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. పేపర్ లీక్ కారణంగా నీట్‌యుజి పరీక్ష రద్దు అయిన తర్వాత, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని లేదా పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.

**12 మంది ఎంపిలు, 4 పార్లమెంటరీ కమిటీలు**

## సంసద్ రత్న అవార్డులకు ఎంపిక




**న్యూఢిల్లీ :** ఒక ప్రైవేట్ సంస్థ ఈ ఏడాది సంసద్ రత్న అవార్డుల కోసం 12 మంది ఎంపిలను, నాలుగు పార్లమెంటరీ కమిటీలను ఎంపిక చేసింది. వ్యక్తిగత విభాగంలో ఎంపికైన ఎంపిలలో బిజెపికి చెందిన జగదంబికా పాల్ (ఉత్తరప్రదేశ్), పి.పి. చౌదరి (రాజస్థాన్), నిషికాంత్ దుబే (జార్ఖండ్), శివసేనకు చెందిన శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే (మహారాష్ట్ర) ఉన్నారని ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు పార్లమెంటులో వివిధ విభాగాలలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ప్రవీణ్ పటేల్ (ఉత్తర ప్రదేశ్), బిద్యుత్ బరన్ మహతో (జార్ఖండ్, లుంబరం చౌదరి (రాజస్థాన్), హేమంత్ విష్ణు సవర (మహారాష్ట్ర), స్మిత ఉదయ్ వాఘ్ (మహారాష్ట్ర), నరేష్ గణపత్ మస్కే (మహారాష్ట్ర), మేధా విశ్రామ్ కులకర్ణి (మహారాష్ట్ర), నర్హరి అమిన్ (గుజరాత్) గుర్తింపు పొందారు. నాలుగు పార్లమెంటరీ కమిటీలు కూడా తమ అత్యుత్తమ పనితీరుకు అవార్డులను గెలుచుకున్నాయి. వాటిలో చరణ్‌జిత్ సింగ్ చన్నీ అధ్యక్షతన వ్యవసాయ కమిటీ, భర్తృహరి మహతాబ్ అధ్యక్షతన ఆర్థిక కమిటీ, సప్తగిరి శంకర్ ఉలక అధ్యక్షతన గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ కమిటీ, అనురాగ్ ఠాకూర్ అధ్యక్షతన బొగ్గు, గనుల కమిటీ ఉన్నాయి. అవార్డు విజేతలలో, పాల్, చన్నీ మాజీ ముఖ్యమంత్రులు కాగా, అమీన్ మాజీ ఉప ముఖ్యమంత్రి.

## భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం... త్వరలోనే ఖరారు

- అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో వెల్లడి
- ఇరుదేశాలకు ప్రయోజనకరమైన, సుస్థిరమైన ఒప్పందం ఉంటుందని విశ్వాసం వ్యక్తం



**న్యూఢిల్లీ :** భారత్–అమెరికా దేశాలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఈ ఒప్పందం ప్రయోజనకరంగా, సుస్థిరంగా ఉండటంతోపాటు ఇరుదేశాల పరస్పర ప్రయోజనాలను కూడా ముందుకు తీసుకువెళ్తుందని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఉద్ఘాటించారు. మొత్తం ద్వైపాక్షిక సంబంధాలు పురోగతి పథంలో పయనించనున్నాయని ఆయన నొక్కిచెప్పారు. ప్రస్తుతం నాలుగు రోజుల భారత్ పర్యటనలో ఉన్న రూబియో వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఇందనం, రక్షణ రంగాలలో ఇరుపక్షాల మధ్య సహకారం పెంపొందించడంపై దృష్టి సారించిన విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్‌తో విస్తృత చర్చలు జరిపిన అనంతరం ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వాషింగ్టన్ వాణిజ్య సుంకాల విధానాల కారణంగా గత ఏడాదిగా తీవ్ర ఒత్తిడికి గురైన ద్వైపాక్షిక సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నంలో భాగంగానే అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తొలి భారత పర్యటన జరుగుతోంది. రష్యా ఇంధన కొనుగోళ్లపై 25 శాతం సుంకంతో సహా భారత ఎగుమతులపై ట్రంప్ ప్రభుత్వం 50శాతం సుంకాలు విధించడంతో సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. మా వాణిజ్య ప్రతినిధి అతి త్వరలో ఇక్కడికి వస్తారని మేం ఆశిస్తున్నాం. మా భారత ప్రతినిధి బృందం అమెరికాలో పర్యటించింది. మేం అద్భుతమైన పురోగతిని సాధించాం. అమెరికా, భారత్ మధ్య ఒక శాశ్వతమైన ఇరుపక్షాలకు ఇది మన జాతీయ ప్రయోజనాలను పరిగణనలోనికి తీసుకునే విధంగా సుస్థిరంగా ఉంటుంది' అని జైశంకర్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మార్కోరూబియో పేర్కొన్నారు. 'వాణిజ్య ఒప్పందంపై త్వరగా అవగాహన కుదరాల్సిన ప్రాముఖ్యతను విదేశీ వ్యవహారాల మంత్రి నొక్కి చెప్పారు. ఆర్థికపరంగా, పరస్పర, ఉభయతారక వాణిజ్యానికి సంబంధించిన అంతర్ ఒప్పందం తుది ముసాయిదాను త్వరగా ఖరారు చేయాల్సిన ఆవశ్యకత గురించి మేం చర్చించాం' అని ఆయన చెప్పారు. 2025 ఫిబ్రవరిలో వాషింగ్టన్ పర్యటన సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జరిపిన సమావేశంలో ఊహించిన విధంగా, ఇది సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుందని ఆయన అన్నారు. తన వ్యాఖ్యలలో మార్కో రూబియో ట్రంప్ అని గట్టిగా వాదించారు. ప్రపంచ వాణిజ్యంపై వాషింగ్టన్ సమగ్రవైఖరిని పున: సమీక్షించాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వ వాణిజ్య విధానం నడుస్తోంది. అంతేగానీ ఇది ఏ నిర్దిష్ట దేశానికీ వ్యతిరేకం కాదు. 'ఇది వాణిజ్యపరంగా అమెరికాకు సంబంధించిన విషయం. వాణిజ్య విషయంలో భారతదేశంతో ఘర్షణ సృష్టించే మార్గాన్ని కనుగొందాం' అని అధ్యక్షుడు చెప్పలేదు. అధ్యక్షుడు వచ్చి 'భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ఒక వాణిజ్య పరిస్థితి మనకు ఉంది. అది ముందుకు సాగడాకి పనికిరాదు' అని అన్నారు, అని ఆయన చెప్పారు. 'భారీ అసమతుల్యత ఏర్పడింది. దానిని పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఆయన దీనిని ప్రపంచ దృక్పథంతో అనుసరించారు' అని రూబియో అన్నారు. ప్రపంచంలో తాను పర్యటించిన దాదాపు ప్రతీ దేశానికి సంబంధించిన వాణిజ్య సమస్యను ప్రస్తావించారని, అమెరికా వాణిజ్యాన్ని పున: సమతుల్యం చేసుకోవాలని మాత్రమే అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు కానీ ఇది భారతదేశానికి సంబంధించిన విషయం కాదని రూబియో స్పష్టం చేశారు. 'శుభవార్త ఏమిటంటే ఈ పున: సమతుల్యత ద్వారాఅంతిమంగా అమెరికాకు, అలాగే మన వాణిజ్య భాగస్వాములకు కూడా మేలు చేసే ప్రపంచ వ్యాప్త వాణిజ్య ఒప్పందాలను సాధిస్తామని మేం ఆశిస్తున్నాం' అని అన్నారు. భారత్–అమెరికా సంబంధాలు బలంగా కొనసాగుతున్నాయని. ఈ ప్రభుత్వం ముగిసేనాటికి అవి గతంలో కంటే మరింత బలంగా ఉంటాయని తాను నమ్ముతున్నానని మార్కో రూబియో విశ్వాసం వ్యక్తంచేశారు. 'ఖచ్చితంగా అదే మా లక్ష్యం' అని ఆయన స్పష్టం చేశారు.

## నీట మునిగి 10 మంది జలసమాధి

- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారే
- మరో ఇద్దరు గల్లంతు
- తత్తె హక్కలు నదిలో మంచినీటి ముత్యపు చిప్పలను సేకరిస్తుండగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన బాధితులు



**కర్వార్ :** కర్ణాటకలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఉత్తర కన్నడ జిల్లాలోని తత్తె హక్కలు నదిలో మంచినీటి ముత్యపు చిప్పల ను సేకరించేందుకు వెళ్లిన ఒక బృందం బలమైన ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఏడుగురు మహిళలతో సహా ఒకే కు టుంబానికి చెందిన ఎనిమిది మంది జలసమాధి అ య్యారు. మరో ఇద్దరు గల్లంతయ్యారని పో లీసు వర్గాలు ఆదివారం తెలిపాయి. ఈ వి షాద ఘటన పై సంతాపం తెలుపుతూ, మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. పోలీ సు వర్గాల సమాచారం ప్రకారం, న దీ తీరాలు, సముద్ర తీర ప్రాంతాలలో స్థానిక ప్ర జలు కాలానుగుణంగా చేసే ముత్యపు చిప్పలను సేకరించే కార్యకలాపం కోసం షిరాలి గ్రామానికి చెందిన సుమారు 14 మంది నదిలోకి దిగారు. ఈ ప్రక్రియలో, వారు నీటి మట్టాన్ని సరిగ్గా అంచనా వేయకుండా నదిలోకి మరింత లోతుగా వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. నీటి ప్రవాహం అకస్మాత్తుగా పెరగడంతో, ఒకరిద్దరు వ్యక్తులు కొట్టుకుపోయారు. ఆ తర్వాత నీటిలో కొట్టుమిట్టాడుతున్న వారిని రక్షించే ప్రయత్నంలో మరికొందరు నదిలోకి దూకడంతో, మరింత మంది బలమైన ప్రవాహంలో చిక్కుకున్నారు. ఇప్పటివరకు ఎనిమిది మృతదేహాలను వెలికితీశామని, మరో ఇద్దరు గల్లంతయ్యారని పోలీసు వర్గాలు తెలిపాయి. రక్షించబడిన నాగారత్న, మహాదేవిలను ఆసుపత్రిలో చేర్చారు. రెస్క్యూ సిబ్బంది, పోలీసు బృందాలు, స్థానికులు నదిలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. మృతులు భట్కల్ తాలూకాలోని షిరాలి గ్రామానికి చెందిన వారని తెలిసింది. ఈ ప్రాంతంలో వర్షాల కారణంగా నదీ ప్రవాహం తీవ్ర రూపం దాల్చడంతో, ముత్యపుచిప్పలు సేకరించేందుకు నదిలోని లోతైన ప్రాంతాలకు వెళ్లిన పలువురు కొట్టుకుపోయి ఈ ఘటన జరిగిందని వర్గాలు తెలిపాయి. 'చేపలు పట్టడం లాగే, మంచినీటి ముత్యపుచిప్పలను సేకరించడం కూడా కొన్ని వర్గాల ప్రజలకు ఒక జీవనోపాధి. ఇందులో పాల్గొన్న వారిలో చాలా మందికి ఈ పనిలో అనుభవం ఉంది, వారు గతంలో కూడా ఇలాంటి కార్యకలాపాలు చేపట్టినట్లు సమాచారం' అని వర్గాలు తెలిపాయి. బాధితులలో ఎంతమందికి ఈత వచ్చు, అలాగే ఈ విషాదానికి దారితీసిన సంఘటనల కచ్చితమైన క్రమం ఏమిటో అధికారులు ఇంకా నిర్ధారించాల్సి ఉందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. అత్యంత విషాదకరమైన, బాధాకరమైన సంఘటన గురించి తెలుసుకుని తాను తీవ్రంగా కలత చెందానని, మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని సిఎం సిద్ధరామయ్య ఎక్స్‌లో పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో, ఈ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల చొప్పున పరిహారం అందిస్తుందన్నారు. ఈ ప్రమాదంలో మరికొందరు గల్లంతైనట్లు కూడా సమాచారం ఉందని, వారి కోసం ముమ్మరంగా గాలింపు జరుగుతోందని ముఖ్యమంత్రి చెప్పారు. గల్లంతైన వారు సజీవంగా తిరిగి వచ్చి తమ ప్రియమైనవారితో తిరిగి కలవాలని మనమందరం దేవుడిని ప్రార్థిద్దామన్నారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ కూడా ఈ విషాదం పట్ల సంతాపం తెలిపారు. రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు ఆర్. అశోక కూడా మృతుల పట్ల సంతాపం తెలిపారు.

## కాంగ్రెస్‌ను ఎప్పటికీ నమ్మొద్దు

- అసెంబ్లీ ఎన్నికల తరువాత డిఎంకెకు వెన్నుపోటు పొడిచింది
- గత 20 ఏళ్లుగా తమ పార్టీ నీడన బతికింది : ఉదయనిధి



**చెన్నై :** కాంగ్రెస్‌ను ఎప్పటికీ నమ్మకూడదని డిఎంకె యువజన విభాగం అధిపతి ఉదయనిధి స్టాలిన్ పార్టీ కార్యకర్తలనుకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రయోజనాలు పొందిన తర్వాత మిత్రపక్షం డిఎంకెకు వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. 'గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ మా నీడన బతికింది. ఈ రోజు వాళ్లు మాకు వెన్నుపోటు పొడిచారు. ఈ విషయాన్ని ఎవరూ ఎప్పటికీ మర్చిపోకూడదు. భవిష్యత్తులో ఏ సమయంలోనూ మనం కాంగ్రెస్‌ను నమ్మకూడదు, అలాగే వాళ్లను మళ్లీ మన దరిదాపుల్లోకి కూడా రానివ్వకూడదు' అని ఉదయనిధి అన్నారు. ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకె నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్‌లో భాగంగా ఐదు సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్, ఫలితాలు వెలువడిన వెంటనే పక్షం మార్చి, విజయ్ నేతృత్వంలోని టివికెకు మద్దతు ప్రకటించింది. దీంతో టివికె ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ లేని ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాగా, నివారం చెన్నైలో జరిగిన డిఎంకె యువజన విభాగం సమావేశంలో ఉదయనిధి ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శల వర్షం కురిపించారు. బిజెపి వరుస జాతీయ విజయాలకు కాషాయ పార్టీ అగ్ర నాయకత్వం కాకుండా, నేరుగా కాంగ్రెస్ పార్టీయే కారణమని ఆయన ఆరోపించారు. బిజెపి వరుస ఎన్నికల విజయాల వెనుక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా ఉన్నారని తాను గతంలో భావించినట్లు ప్రతిపక్ష నాయకుడు వ్యాఖ్యానించారు. 'కానీ అది నిజం కాదు. బిజెపి విజయాలకు ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీయే. అది ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది' అని ఆయన ఉద్ఘాటించారు. గత సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికలలో కూటమి పట్ల డిఎంకె సంపూర్ణ నిబద్ధతను ప్రదర్శిస్తూ, లౌకికవాదాన్ని పరిరక్షించడానికి, బిజెపిని తమిళనాడుకు దూరంగా ఉంచడానికి కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం డిఎంకె కార్యకర్తలు ఎలా రక్తపు చెమటలు చిందించారో ఉదయనిధి గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో కూడా, దాదాపు ఉనికిలో లేని కాంగ్రెస్ పార్టీ కేవలం తమ నాయకుడి ఆదేశాలు, డిఎంకె కార్యకర్తల అవిశ్రాంత కృషి వల్ల ఐదు సీట్లు గెలుచుకోగలిగిందన్నారు. కానీ గెలిచిన వెంటనే, కనీసం మర్యాదపూర్వకంగా సమాచారం కూడా ఇవ్వకుండా అధికారం కోసం మరో పక్షానికి ఫిరాయించారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో ప్రాథమిక కృతజ్ఞత, రాజకీయ సభ్యత కొరవడ్డాయని ఉదయనిధి అన్నారు. డిఎంకె వారికి గుణపాఠం నేర్పకపోయినా, తమిళనాడు ప్రజలు త్వరలోనే ఆ పని చేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటీవలి ఎన్నికల పరాజయాల నేపథ్యంలో అంతర్గత పార్టీ వ్యూహంపై దృష్టి సారిస్తూ, ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం మాని, సమగ్రంగా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డిఎంకె నాయకుడు కోరారు. పార్టీ సోషల్ మీడియా వ్యూహంలోని లోపాలను, ఇంటింటి స్థాయిలో ఓటర్లను రాజకీయంగా ఆకట్టుకోవడంలో విఫలమవ్వడాన్ని ఆయన ప్రత్యేకంగా ఎత్తి చూపారు.

## 6 వరకు శుభమ్ ఖైర్నార్‌కు జ్యుడీషియల్ కస్టడీ

నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటి వరకు 10 నిందితుల అరెస్టు



**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్ కేసులో నిందితుడు శుభమ్ ఖైర్నార్‌ను జూన్ 6 వరకు జ్యుడీషియల్ కస్టడీకి ఢిల్లీ కోర్టు ఆదివారం పంపింది. నిందితుడికి జ్యుడీషియల్ కస్టడీ కోరుతూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రత్యేక న్యాయమూర్తి రుచి అగర్వాల్ అశ్రాని అనుమతించారు. పరీక్ష ప్రారంభానికి ముందే, ఖైర్నార్‌తో సహా నిందితులు నీట్‌యుజి 2026 పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీలో చురుకుగా పాల్గొన్నారని కేంద్ర దర్యాప్తు సంస్థ తెలిపింది. తన రిమాండ్ పత్రంలో సిబిఐ 'దర్యాప్తు నిర్వహించే ఉద్దేశ్యంతో, సాక్ష్యాలను తారుమారు చేయడాన్ని, దర్యాప్తుకు సంబంధించిన సాక్షులను ప్రభావితం చేయడాన్ని నివారించడానికి, అరెస్టు చేయబడిన నిందితులు జ్యుడీషియల్ కస్టడీలో ఉండటం అవసరం' అని పేర్కొంది. నిందితులు పరారవ్వడం, భౌతిక లేదా డిజిటల్ సాక్ష్యాలను ధ్వంసం చేయడం, 'ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించిన ఇలాంటి నేరాలను మళ్లీ చేయడం' వంటి వాటిని నివారించడానికి కూడా జ్యుడీషియల్ కస్టడీ అవసరమని ఆ సంస్థ తెలిపింది. 'ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది, కేసు ప్రయోజనాల దృష్ట్యా జ్యుడీషియల్ కస్టడీ అవసరం. కేసులోని పరిణామాలను బట్టి, చట్టపరమైన నిబంధనల ప్రకారం దర్యాప్తులో భాగంగా (ఖైర్నార్‌కు) మళ్లీ పోలీస్ కస్టడీ రిమాండ్ అవసరం కావచ్చని కూడా విన్నవించడమైనది' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈనెల 14న, ఆర్థిక లాభం కోసం రహస్య పరీక్ష పత్రాలను లీక్ చేసి, వ్యాప్తి చేయడంలో ఒక సంఘటిత ముఠా ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు సూచిస్తున్నాయని గమనించిన కోర్టు, ఖైర్నార్‌తో పాటు మరో నలుగురిని ఏడు రోజుల పాటు సిబిఐ కస్టడీకి పంపింది. నీట్‌యుజి 2026 పత్రాలను ఎవరికి అమ్మాడో ఆ ఇతర సహ నిందితులను గుర్తించి, పట్టుకోవడానికి నిందితుడిని మరింతగా విచారించాల్సిన అవసరం ఉందని సిబిఐ పేర్కొనడంతో, ఈనెల 20న ఖైర్నార్ కస్టడీ విచారణను ఐదు రోజులు పొడిగించారు. పేపర్ లీక్ నెట్‌వర్క్‌కు సంబంధించిన డిజిటల్ పరికరాలు, కమ్యూనికేషన్ రికార్డులు, ఆర్థిక లావాదేవీల వివరాలతో సహా ఇతర సాక్ష్యాలను స్వాధీనం చేసుకుని, విశ్లేషించాల్సిన అవసరం ఉందని కూడా ఆ ఏజెన్సీ పేర్కొంది. పెద్ద కుట్రను, లీకైన ప్రశ్నపత్రం మూలాన్ని వెలికితీయాల్సి ఉందని, అందుకుగాను నిందితులను మహారాష్ట్రలోని నాసిక్‌తో సహా దేశంలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి ఉందని సిబిఐ వెల్లడించింది. కొంతమంది అభ్యర్థులకు ప్రశ్నలు ఎక్కడెక్కడ వెల్లడయ్యాయో గుర్తించేందుకు ఖైర్నార్‌ను కూడా విచారించాల్సి ఉందని తెలిపింది. ఇదిలా ఉండగా, శుక్రవారం అరెస్టు అయిన పుణెకు చెందిన ఫిజిక్స్ లెక్చరర్ మనీషా సంజయ్ హవల్దార్ ప్రస్తుతం ట్రాన్సిట్ రిమాండ్‌లో ఉన్నారని, ఆమెను సోమవారం సంబంధిత కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉందని కోర్టు వర్గాలు తెలిపాయి. ఈ కేసులో సిబిఐ ఇప్పటివరకు 10 మంది నిందితులను అరెస్టు చేసింది. వైద్య కళాశాలల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3న నిర్వహించిన నీట్ (యుజి) 2026 పరీక్ష, పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో రెండు రోజుల తర్వాత రద్దు చేయబడింది. ఈ 'అక్రమాల'పై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వం సిబిఐని కోరింది.

## మిత్రుడిని ప్రసన్నం చేసుకునేందుకు హద్దులు దాటుతున్నారు...

- ప్రధాని మోదీపై విరుచుకుపడ్డ కాంగ్రెస్
- రూబియో భారత్ వాణిజ్య వ్యాఖ్యలపై మండిపాటు



**న్యూఢిల్లీ :** రానున్న ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా వస్తువులను కొనుగోలు చేయడానికి భారత్ కట్టుబడి ఉందని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకునీ తీవ్ర విమర్శలు చేసింది. రాజీపడ్డ ప్రధాని తన 'మంచి స్నేహితుడిని' ప్రసన్నం చేసుకోవడానికి హద్దులు దాటుతున్నారని ఆరోపించింది. మలేషియా వంటి దేశాలు చేసినట్లుగా, ప్రజా వ్యతిరేక, ప్రమాదకరమైన భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వదులుకోవడానికి మోదీ ప్రభుత్వం ఎందుకు ధైర్యం చేయలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ప్రశ్నించారు. విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడానికి దేశీయ ఇంధన వినియోగాన్ని, విదేశీ ప్రయాణాలను తగ్గించుకోవాలని ప్రధానమంత్రి స్వయంగా పౌరులను కోరినప్పటికీ, అమెరికా నుండి రికార్డు స్థాయిలో దిగుమతులకు మోదీ ప్రభుత్వం ఎ ందుకు అంగీకరించిందని కూడా ఆయన నిలదీశారు. దిగుమతులలో ఈ పెరుగుదల రూపాయి విలువను మరింత తగ్గించదా అని అన్నారు. '2025 మే 10వ తేదీన, భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5:37 గంటలకు, ఆపరేషన్ సింధూర్‌ను ఊహించని విధంగా నిలిపివేసిన కాల్పుల విరమణ ప్రకటనను మొదటగా చేసింది అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోనే. అధ్యక్షుడు ట్రంప్ జోక్యం వల్లే కాల్పుల విరమణ సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు' అని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈనెల 21న, వెనిజులా అధ్యక్షుడు వచ్చే వారం భారతదేశాన్ని సందర్శించనున్నారని ప్రకటించిన వారిలో రూబియోనే మొట్టమొదటి వ్యక్తి అని, భారత్, వెనిజులాలు ఈ వార్తపై కనీసం సూచన గానీ, ధృవీకరణ గానీ చేయకముందే ఆయన ఈ ప్రకటన చేశారని రమేష్ తెలిపారు. 'మోదీ ప్రభుత్వం రానున్న ఐదేళ్లలో ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయంపై దృష్టి సారిస్తూ 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా వస్తువులను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందని ఎక్స్ ఛానెల్‌లో ఒక ప్రకటన చేసి, ఈ రోజు మిస్టర్ రూబియో మరో సారి దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేశారు' అని రమేష్ అన్నారు. 2026 ఆర్థిక సంవత్సరం నాటికి భారత దేశ ప్రస్తుత వార్షిక దిగుమతులు 52.9 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని, రూబియో ప్రకటన ప్రకారం అమెరికా నుండి భారతదేశం తన వార్షిక దిగుమతులను రెట్టింపు చేయాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఈ కొత్త పరిణామంపై ప్రధానమంత్రిని తాము ఐదు ప్రశ్నలు అడగాలనుకుంటున్నామని, ఈ ఒప్పందాలకు నేపథ్యంగా ఉన్న ట్రంప్ సుంకాలను కొట్టివేసిన అమెరికా సుప్రీం కోర్టు తీర్పు తర్వాత, మలేషియా వంటి దేశాలు అమెరికాతో తమ వాణిజ్య ఒప్పందాలను చెల్లనివిగా ప్రకటించాయి. పార్లమెంటులో రాహుల్ గాంధీ చేసిన బహిర్గతం వల్ల ఒత్తిడికి లోనై ప్రధాని హడావిడిగా సంతకం చేసిన ఇండో–అమెరికా వాణిజ్య ఒప్పందంలో, మోదీ ప్రభుత్వం మన రైతులు, పరిశ్రమలకు ముప్పు కలిగించేలా ఏకపక్షంగా భారీ రాయితీలు ఇచ్చింది' అని ఆయన అన్నారు. సుంకాలను కొట్టివేస్తూ అమెరికా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తర్వాత ఈ ఒప్పందంలోని తర్కం ఇప్పుడు కుప్పకూలిందని, మలేషియా, ఇతర దేశాలు చేసినట్లుగా, ప్రజా వ్యతిరేకమైన, ప్రమాదకరమైన ఈ వాణిజ్య ఒప్పందాన్ని వదులుకునే ధైర్యం మోదీ ప్రభుత్వానికి ఎందుకు లేదు అని అన్నారు. విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడానికి ఇంధన వినియోగాన్ని, విదేశీ ప్రయాణాలను తగ్గించుకోవాలని ప్రధానమంత్రి స్వయంగా పౌరులను కోరారని ఆయన గుర్తు చేశారు.

## కపుర్తలా జైలులో ఖైదీల మధ్య ఘర్షణ

ఇనుప రాడ్లు, కర్రలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు



**చండీగఢ్ :** పంజాబ్‌లోని కపుర్తలా జైలులో ఖైదీల మధ్య ఘర్షణ చెలరేగింది. వివాదం సద్దుమణిగిన అనంతరం ఖైదీల నుంచి పోలీసులు ఆదివారం ఇనుప రాడ్లు, కర్రలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు అధికారులు టియర్‌గ్యాస్ షెల్స్ ప్రయోగించి, లాఠీచార్జికి పాల్పడ్డారని అధికారులు తెలిపారు. ఈ ఘర్షణలో ఇద్దరు ఖైదీలు గాయపడగా, టియర్‌గ్యాస్ షెల్ తగలడంతో మరొకరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో పోలీసు సిబ్బందికి గానీ, జైలు సిబ్బందికి గానీ ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. కపుర్తలా సెంట్రల్ జైలులోని బ్లాక్4కు చెందిన కొందరు ఖైదీలు శనివారం రాత్రి ఏదో విషయంపై ఘర్షణ పడటంతో ఈ ఘటన జరిగింది. వారిని గొడవ పడకుండా నివారించేందుకు జైలు అధికారులు జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించగా, ఖైదీలు అధికారులపై దాడి చేసి, వారితో ఘర్షణకు దిగారని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. జైలులో కొందరు ఖైదీలు ఘర్షణ పడ్డారని జైలు అధికారుల నుంచి సమాచారం అందుకున్న తర్వాత భారీ పోలీసు బలగాలను మోహరించినట్లు కపుర్తలా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గౌరవ్ తూరా తెలిపారు. కొంతమంది ఖైదీలు తమ బ్యారక్‌ల బయట దేనికో నిప్పు కూడా పెట్టారని, అయితే జైలు నుండి ఎవరూ పారిపోలేదని, ఏ ఖైదీ కూడా జైలు ప్రాంగణం బయటకు వెళ్లలేదని ఎస్ఎస్‌పి తెలిపారు. ఇది బ్లాక్4లోని కొంతమంది ఖైదీల మధ్య జరిగిన ఒక స్థానిక సమస్య అని కపుర్తలాలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఎస్‌పి అన్నారు. జైలులోని బ్లాక్4లో ఉన్న ఖైదీలందరూ నాలుగు లేదా అంతకంటే ఎక్కువ క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్న పరుషమైన నేరస్థులని ఆయన తెలిపారు. కొంతమంది ఖైదీలు బ్యారక్ పైకప్పుకు దారితీసే గేటును, ఇనుప గ్రిల్‌ను పగలగొట్టారని ఎస్ఎస్‌పి చెప్పారు. వారిపై లాఠీచార్జ్ చేసి తిరిగి బ్యారక్‌లోకి తీసుకురాగలిగామని పోలీసులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్‌ను ఉపయోగించి, లాఠీచార్జికి పాల్పడ్డారని మరో పోలీసు అధికారి తెలిపారు. కొంతమంది ఖైదీల మధ్య ఉన్న వైరం వారి మధ్య ఘర్షణకు దారితీసి ఉండవచ్చని ఎస్ఎస్‌పి అన్నారు. కాగా,కపుర్తలా జైలులో సుమారు 4,000 మంది ఖైదీలు ఉన్నారు.

## ప్రత్యర్థి పార్టీలవి సంకుచిత, మోసపూరిత రాజకీయాలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : బిఎస్‌పి చీఫ్ మాయావతి

**లక్నో :** ప్రత్యర్థి రాజకీయ పార్టీలపై బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి విమర్శలు గుప్పించారు. వారు సంకుచిత, మోసపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పూర్తిగా పరీక్షించబడిన బిఎస్‌పి పైనా, పార్టీ ఉక్కు మహిళ నాయకత్వంపైనా విశ్వాసం ఉంచాలని ఆమె కోరారు. ఆదివారం లక్నోలోని మాల్ అవెన్యూలో ఉన్న బిఎస్‌పి కార్యాలయంలో జరిగిన పార్టీ ఉత్తరప్రదేశ్ యూనిట్ ప్రధాన సమావేశంలో మాయావతి ప్రసంగిస్తూ, సంస్థాగత బలోపేతం, రాబోయే అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలు, పార్టీ మద్దతు స్థావరాన్ని విస్తరించే ప్రయత్నాలను సమీక్షించారు. ఈ సమావేశానికి బూత్‌స్థాయి ఇన్‌చార్జ్‌లు, అసెంబ్లీ, జిల్లా, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు హాజరై తమ ప్రగతి నివేదికలను సమర్పించారు. మాయావతి తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌తో కలిసి సమావేశానికి విచ్చేశారు. సభా కార్యక్రమాలు ప్రారంభం కావడానికి ముందు ఆకాష్ ఆమె పాదాలకు నమస్కరించి, ఆమె ఆశీర్వాదం పొందారు. బిఎస్‌పియేతర పార్టీల సంకుచిత, మోసపూరిత రాజకీయాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ప్రజలు ఆత్మగౌరవంతో జీవించడం కష్టంగా ఉండటం ఆమోదయోగ్యమా? అని మాయావతి ప్రశ్నించారు.

## శిక్షణా విమానం అత్యవసర ల్యాండింగ్

బయటపడిన ఇన్‌స్ట్రక్టర్, ట్రైనీ పైలట్

**అలీఘర్:** ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రైవేట్ ఫ్లయింగ్ క్లబ్‌కు చెందిన ఇద్దరు కూర్చునే (టూసీటర్) శిక్షణా విమానం ఆదివారం ఉదయం అత్యవసరంగా ఒక వ్యవసాయ క్షేత్రంలో ల్యాండ అయింది. శిక్షణా సమయంలో విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విమానంలో ఉన్న పయనీర్ ఫ్లయింగ్ క్లబ్‌కు చెందిన ఇన్‌స్ట్రక్టర్, ట్రైనీ పైలట్ ఇద్దరూ సురక్షితంగా బయటపడ్డారని అధికారులు పేర్కొన్నారు. హర్దువాగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చేంగేరి గ్రామంలో ఉదయం 9:30 గంటల ప్రాంతంలో ఈ విమానం పొలాల్లో సురక్షితంగా ల్యాండ అయింది.సిటీ మేజిస్ట్రేట్ అ తుల్ గుప్తా విలేకరులతో మాట్లాడుతూ.. ఈ అత్యవసర ల్యాండింగ్ జరిగిన కొద్దిసేపటికే విమానాశ్ర య అధికారులకు సమాచారం అందిందని చెప్పా రు. ఇన్‌స్ట్రక్టర్ పైలట్ అసద్, ట్రైనీ పైలట్ కృనాల్ కసానా ఎటువంటి గాయాలు లేకుండా సురక్షితం గా విమానం నుండి కిందకు దిగారని గుప్తా తెలిపారు. అనంతరం వారిద్దరిని సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం అలీఘర్ జిల్లా ఆసుపత్రికి తరలించా రు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు వెల్లడించారు.

# పాకిస్థాన్‌లో భారీ పేలుడు



## 24 మంది మృతి... 80మందికి పైగా గాయాలు

### సైనికులే లక్ష్యంగా జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి

**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రదాడి కలకలం రేపింది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని క్వెట్టా ప్రాంతంలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై జరిగిన భారీ బాంబు దాడిలో 24 మంది ప్రాణాలు కోల్పోగా, 80 మందికి పైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటన ఆదివారం ఉదయం చమన్ ఫాటక్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. మృతుల్లో ఎక్కువ మంది సైనికులు ఉన్నట్లు తెలిసింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ క్వెట్టా కంటోన్మెంట్ స్టేషన్ నుంచి సిటీ రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న సమయంలో పేలుడు జరిగింది. ఈద్ పండుగ సందర్భంగా తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు సైనికులు, వారి కుటుంబ సభ్యులు ఈ రైలులో ప్రయాణిస్తున్నారు. రైలు సిగ్నల్ దాటుతుండగా పేలుడు పదార్థాలతో నిండిన ఓ వాహనం రైలు బోగీని ఢీకొట్టడంతో భారీ పేలుడు సంభవించినట్లు అధికారులు చెబుతున్నారు. పేలుడు తీవ్రతకు రైలు ఇంజిన్‌తో పాటు బోగీలు పట్టాలు తప్పాయి. అందులో రెండు బోగీలు పూర్తిగా బోల్తా పడ్డాయి. పేలుడు ధాటికి సమీపంలోని వాహనాలు, భవనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. 10కి పైగా వాహనాలు దగ్ధమయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సహాయ బృందాలు, పోలీసులు, భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. శిథిలాల మధ్య చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఘటన తర్వాత క్వెట్టా నగరంలో హైఅలర్ట్ ప్రకటించారు.

**దాడికి మాదే బాధ్యత : బిఎల్ఎ**

ఈ దాడికి తామే బాధ్యులమని నిషేధిత బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) ప్రకటించింది. క్వెట్టా కంటోన్మెంట్ నుంచి సైనికులను తరలిస్తున్న రైలును లక్ష్యంగా చేసుకున్నామని బిఎల్ఎ ప్రతినిధి జీయాండ్ బలోచ్ తెలిపారు. పాక్ ప్రభుత్వం బలోచ్ ప్రజలను అణచివేస్తోందని, తమ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. తమ మాతభూమి విముక్తి కోసం పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. పాకిస్థాన్ రైల్వే మంత్రి హనీఫ్ అబ్బాసీ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. ఇది పిరికి ఉగ్రవాద చర్య అని వ్యాఖ్యానించారు. దేశంలో భయాందోళనలు సృష్టించడమే ఉగ్రవాదుల లక్ష్యమని అన్నారు. ఇలాంటి దాడులతో దేశ ప్రజల ధైర్యసాహసాలను దెబ్బతీయలేరన్నారు.

# వైట్ హౌస్ సమీపంలో... దుండగుడి కాల్పులు

### భద్రతా సిబ్బంది ఎదురు కాల్పుల్లో నిందితుడి హతం

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ సమీపంలో శనివారం సాయంత్రం కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. అమెరికాద సీక్రెట్ సర్వీస్ చెక్‌పాయింట్‌పై ఓ ఆగంతకుడు కాల్పులకు తెగబడగా... భద్రతా సిబ్బంది జరిపిన ఎదురుకాల్పుల్లో అతను మృతి చెందాడు. ఈ ఘటనలో ఓ పౌరుడు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. 17వ వీధి, పెన్సిల్వేనియా అవెన్యూ వద్ద ఉన్న భద్రతా చెక్‌పాయింట్ వద్దకు వచ్చిన ఓ వ్యక్తి, తన బ్యాగ్ లోంచి తుపాకీ తీసి అక్కడున్న సీక్రెట్ సర్వీస్ అధికారులపై కాల్పులు ప్రారంభించాడు. తక్షణమే అప్రమత్తమైన అధికారులు, ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపి నిందితుడిని నిలువరించారు. ఈ ఘటన జరిగిన సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌లోనే ఉన్నారని, ఆయన సురక్షితంగా ఉన్నారని అధికారులు స్పష్టం చేశారు. తీవ్రంగా గాయపడిన నిందితుడిని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్ సీక్రెట్ సర్వీస్ ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఈ కాల్పుల ఘటనలో గాయపడిన పౌరుడి పరిస్థితి విషమంగా ఉందని, అతనికి చికిత్స అందిస్తున్నామని తెలిపింది. దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) సహకారంతో దర్యాప్తు చేస్తున్నామని సీక్రెట్ సర్వీస్ అధికారులు వెల్లడించారు. కాల్పుల నేపథ్యంలో వైట్‌హౌస్‌ను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేసి, కొద్దిసేపటి తర్వాత ఎత్తివేశారు. కాల్పుల సమాచారం అందిన వెంటనే అదనపు భద్రతా బలగాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఎదురు కాల్పులకు దిగాయి. ఈ సంఘటనపై కొందరు అమెరికా కాంగ్రెస్ సభ్యులు స్పందించారు. రాండీ ఫైన్, న్యాన్సీ మేస్ ఈ ఘటనను ఖండించారు. అమెరికాలో రాజకీయ హింసకు స్థానం లేదని, దురదృష్టవశాత్తూ ఇది సాధారణమైపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటివి చూసి విసిగిపోయామని వ్యాఖ్యానించారు. ముగింపు పలకాలని ఆకాంక్షించారు.




# 'ఒరెష్నిక్' హైపర్ సోనిక్ క్షిపణితో రష్యా దాడి!



**కీవ్ :** ఉక్రెయిన్ రాజధాని కీవ్ రీజియన్‌పై డ్రోన్లు, క్షిపణితో రష్యా మరోసారి విరుచుకుపడింది. బిలా సెర్క్వా నగరంపై ఆదివారం ఉదయం జరిపిన దాడిలో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

దాడి కారణంగా నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు, పాఠశాలలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గడిచిన నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధంలో ఈ ఆయుధాన్ని ఉపయోగించడం ఇది మూడోసారి మాత్రమే కావడం గమనార్హం.

దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ తీవ్రంగా మండిపడ్డారు. సాధారణ పౌరులే లక్ష్యంగా రష్యా భారీ డ్రోన్, క్షిపణి దాడులకు తెగబడిందని.. అందులో శక్తిమంతమైన హైపర్ సోనిక్ 'ఒరెష్నిక్' క్షిపణులను ప్రయోగిస్తోందని ఆరోపించారు. అయితే, దీనిపై ఇప్పటి వరకు రష్యా స్పందించలేదు ఒరెష్నిక్ అనేది హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణి. రష్యా అత్యాధునిక క్షిపణుల్లో ఒకటైన ఈ మిస్సైల్.. గంటకు 13,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. అంటే ధ్వని వేగం కంటే 10 రెట్లు వేగంగా దూసుకెళ్తుంది. ఈ క్షిపణి అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. యూరప్‌లోని అన్ని దేశాలు ఈ క్షిపణి పరిధిలోకి వస్తాయని, దీన్ని అడ్డుకునే సామర్థ్యం గల ఆయుధమేదీ లేదని రష్యా గతంలో ప్రకటించింది. తొలిసారిగా దీనిని 2024 నవంబరులో ఉక్రెయిన్ నగరమైన డినిప్రోలోని ఓ ఫ్యాక్టరీ మీద రష్యా ప్రయోగించింది. అప్పట్లో అది అభివృద్ధి దశలోనే ఉంది.

ఇటీవలే దీన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్లు సమాచారం. ఉక్రెయిన్‌లోని పశ్చిమ లీవ్ ప్రాంతంలో రష్యా రెండోసారి ఈ క్షిపణి ఉపయోగించగా.. తాజాగా కీవ్ రీజియన్‌పై మూడోసారి ప్రయోగించింది.

# కవి, రచయిత ఏటుకూరి ప్రసాద్ మృతి

ప్రజాపక్షం/హైదరాబాద్



ప్రముఖ కవి, అభ్యుదయ రచయిత, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్‌రావు (89) శనివారం రాత్రి 9.30 గంటలకు కన్నుమూశారు. గత కొంత కాలంగా వయస్సు సంబంధిత సమస్యలతో బాధపడుతూ, హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు.

**జీవిత సంగ్రాహం :** 1936, జూలై 19న గుంటూరులోని అరండల్‌పేటలో వజ్రమ్మ, ఏటుకూరి కోటయ్య దంపతులకు ప్రసాద్ రావు జన్మించారు. వీరికి ఆయన రెండవ సంతానం గుంటూరులోని మాజేటి గురవయ్య హైస్కూల్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. పెదనాన్న ఏటుకూరి సీతారామయ్య ప్రభావం, వారి కుమారులు బలరామమూర్తి, కృష్ణమూర్తిల సాహచర్యం ప్రసాద్‌ని కమ్యూనిస్టు భావాల వైపు ఆకర్షించింది. 1951లో గుంటూరులోని హిందూ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరగానే అఖిల భారత విద్యార్థి సమాఖ్య సభ్యత్వాన్ని స్వీకరించారు. 'గుంటూరు వాణి' పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా చేరి, ఆ పత్రికకు కొన్ని వ్యాసాలు రాశారు. వట్టికొండ విశాలాక్షి నడిపిన 'ప్రజావాణి' పత్రిక ఇయర్స్‌కు ప్రసాద్ కవితలు రాశారు. 1955లో ఆయన హిందూ కాలేజీలోనే బి.ఎ. కోర్సులో చేరారు.

అమరేంద్ర ప్రోద్బలంతోనే ప్రసాద్ 1955లో అభ్యుదయ రచయితల సంఘం సభ్యత్వం స్వీకరించారు. 1957లోనే విశాఖలో తమ సీనియర్లయిన కె.జి.సత్యమూర్తి, సహవిద్యార్థులైన వకుళాభరణం రామకృష్ణ, ఆర్వీయార్‌లతో కలిసి 'ప్రగతి' అనే రాత పత్రికను వెలువరించారు. 1960లో బి.ఎ.ఆనర్స్ పూర్తిచేసిన ప్రసాద్.. గుంటూరు ఎ.సి. కళాశాలలో తెలుగు ట్యూటర్‌గా పనిచేస్తూనే ఎ.ఐ.వై.ఎఫ్., ఎ.ఐ.ఎస్.ఎఫ్. వారి 'యువజన' పత్రిక సంపాదక బాధ్యతలు స్వీకరించి తర్వాత పార్టీ నిర్ణయం మేరకు హైదరాబాద్‌కు మకాం మార్చారు. తాపీ ధర్మారావు వంటి సాహితీ ప్రముఖుల సాహచర్యం లభించింది. పత్రిక బాధ్యతలు నిర్వర్తిస్తూనే 1961వ సంవత్సరంలో హైదరాబాద్ పాత నగరంలోని 'అగర్వాల్ శిక్షా సమితి' వారి మల్టీపర్పస్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులుగా చేరారు. 1970లో జూనియర్ లెక్చరర్‌గానూ, 1980లో డిగ్రీ అధ్యాపకులుగాను పదోన్నతిని పొందిన ఏటుకూరి ప్రసాద్ 1994 జులై 31న ఎస్.డి.ఎస్. డిగ్రీ, పి.జి. కళాశాలలో రీడర్‌గా పదవీ విరమణ పొందారు. 1970–73 మధ్య కాలంలో అభ్యుదయ రచయితల సంఘం పునర్నిర్మాణ ప్రయత్నాల్లో ప్రసాద్ చురుగ్గా పాల్గొన్నారు. హైదరాబాద్ నగర అభ్యుదయ రచయితల సంఘ నిర్మాణంలోను, రాష్ట్ర 'అరసం' పునర్నిర్మాణంలోను ప్రముఖమైన పాత్రను నిర్వహించిన ఏటుకూరి ప్రసాద్, 1973లో గుంటూరులో జరిగిన ఆం.ప్ర. 'అరసం' రాష్ట్ర మహాసభల్లో కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1979లో కాకినాడలో జరిగిన రాష్ట్ర 'అరసం' మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై దాదాపు దశాబ్ద కాలానికిపైగా సంస్థ విస్తృతికి విరామమెరుగక కృషి చేశారు. 1982 డిసెంబర్‌లో జైపూర్ (రాజస్థాన్)లోనూ, 1986 ఏప్రిల్‌లో లక్నో (ఉత్తరప్రదేశ్)లోనూ జరిగిన 'అఖిల భారత అభ్యుదయ రచయితల సమాఖ్య' జాతీయ మహాసభల్లో డా।।ఏటుకూరి ప్రసాద్ సమాఖ్య జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 'తాపీ ధర్మారావు జీవితం–రచనలు' అన్న అంశంపై ప్రామాణికమైన పరిశోధన చేసిన ప్రసాద్‌కి 1983లో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. ప్రసాద్ నిర్విరామ కృషికి గుర్తింపుగా 'విజయలక్ష్మి స్మారక పురస్కారం', 'తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం', 'అమరజీవి పులుపుల శివయ్య సాహితీ సత్కారం', 'తుమ్మల సాహితీ పురస్కారం', 'తాపీ ధర్మారావు సాహితీ పురస్కారం', 'శ్రీశ్రీ సాహితీ పురస్కారం', 'విశాలాంధ్ర ప్రచురణాలయం వారి సత్కారం' మొదలైన ఎన్నో పురస్కారాలు, సన్మాన సత్కారాలు లభించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విశాలాంధ్ర ప్రచురణాలయానికి సంపాదకులుగా కొనసాగారు. ఆ తరువాత రాష్ట్ర విభజన జరగగా, నవచేతన పబ్లిషింగ్ హౌస్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం దానికి ఆయన సంపాదకులుగా కొనసాగుతున్నారు.

## మోదీ సర్కార్‌పై ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

అస్సాం సిఎం హేమంత్ బిశ్వ శర్మ, ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్ సింగ్ దామిలపై ఆంక్షలు విధించాలని కూడా డిమాండ్ చేశారు. వాషింగ్టన్‌లోని కమిషన్ ముందు జరిగిన విచారణ సందర్భంగా సిఎస్‌ఒహెచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఖిబ్ హమీద్ నాయక్ సమర్పించిన 30 పేజీల నివేదికలో భారతదేశంలో ముస్లింలు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులు ప్రస్తుతం వ్యవస్థీకృత రాష్ట్ర హింస స్థాయికి చేరాయని పేర్కొన్నారు. బిజెపి, సంఘ్ పరివార్ రాజకీయ విభాగాలు ఆర్‌ఎస్‌ఎస్, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్, గోరక్ష దళ్ వంటి సంస్థలు కలిసి ముస్లింలు, క్రైస్తవులపై విద్వేష ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. అస్సాంలో ముస్లింల బహిష్కరణల వల్ల లక్ష మందికి పైగా నిరాశ్రయులు అయ్యారని, అస్సాంలో 2021 నుంచి 2026 వరకు కనీసం 33 కుటుంబాలను బలవంతంగా ఇండ్ల లోంచి ఖాళీ చేయించడం జరిగిందని, 22 వేలకుపైగా ఇళ్లు కూల్చివేయబడటంతో దాదాపు లక్ష మంది నిరాశ్రయులయ్యారని నివేదికలో తెలిపారు. వీరిలో ఎక్కువ మంది బెంగాలీ మూలాలున్న ముస్లింలేనని తెలిపింది. ముస్లింలు ఆశ్రయం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినా హిందుత్వ సంస్థలు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేస్తూ వారిని వేధిస్తున్నాయని ఆరోపించారు. కొంతమంది బెంగాలీ ముస్లింలను బలవంతంగా బంగ్లాదేశ్ సరిహద్దులకు తీసుకెళ్లి అక్కడ వదిలేస్తున్నారని, అదే విధంగా రోహింగ్యా శరణార్థులను సముద్రంలో వదిలేసిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని నివేదిక పేర్కొంది. గతంలో గుజరాత్‌లో గోధ్రా అల్లర్లలో మోదీ పాత్ర ఉందని భావించిన అమెరికా ఆయనకు విసా రద్దు చేసింది. అమెరికాలో పర్యటించడాన్ని నిషేధించిన విషయం తెలిసిందే. అదే పద్ధతిలో ఈ సారి కూడా మోదీపై బహిష్కరణ వేటువేయాలని కేసు వేశారు.

**ముస్లింలను ఏ విధంగానైనా ఇబ్బంది పెట్టండి**

'ముస్లింలను ఏ విధంగానైనా ఇబ్బంది పెట్టండి. వారు అస్సాం వదిలి వెళ్తారు' అని అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ చేసిన వ్యాఖ్యలను నివేదికలో ప్రస్తావించారు. ఇది జాతి ప్రక్షాళనకు బహిరంగ పిలుపుగా పేర్కొన్నారు. అస్సాంలో పరిస్థితులు అపార్థైడ్ ఎథ్నిక్ క్లెన్సింగ్ (వర్ణ వివక్షతో జాతి నిర్మూలన) దిశగా వెళ్తున్నాయని అంతర్జాతీయ నిపుణుల కమిటీ వ్యాఖ్యానించినట్లు పేర్కొన్నారు.

**బుల్డోజర్ రాజకీయాలు.. మైనార్టీల ఇళ్ల కూల్చివేతలు**

బిజెపి పాలిత రాష్ట్రాల్లో ముస్లింల ఇళ్లు, వ్యాపారాలు, ప్రార్థనా స్థలాలపై బుల్డోజర్ చర్యలు కొనసాగుతున్నాయని నివేదికలో ఆరోపించారు. భారత సుప్రీంకోర్టు 2024లో ఇటువంటి కూల్చివేతలను నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ అమలు కాలేదని పేర్కొంది. ఈ కూల్చివేతల్లో జెసిబి, క్యాటర్‌పిల్లర్, టాటా హిటాచి, మహీంద్రా, హుందాయ్ కంపెనీల యంత్రాలు వినియోగిస్తున్నారని తెలిపింది.

**గో రక్షక దళాల దాడులు.. 4వేల వీడియోల డాక్యుమెంటేషన్**

గోవుల రవాణా, బీఫ్ పేరుతో ముస్లింలపై దాడులు, నరికివేతలు పెరిగాయని నివేదిక పేర్కొంది. దేశంలోని కనీసం 17 రాష్ట్రాల్లో గోరక్ష దళ్ నెట్‌వర్క్ పనిచేస్తోందని, ముస్లిం ట్రక్ డ్రైవర్లపై దాడులు చేసి వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని తెలిపింది. గత మూడేళ్లలో 4 వేలకుపైగా ఇలాంటి వీడియోలను డాక్యుమెంట్ చేసినట్లు వెల్లడించింది. హర్యానాలో గోరక్షక దళాలను ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌లో భాగం చేయడం ద్వారా ప్రభుత్వం వారి కార్యకలాపాలను చట్టబద్ధం చేసిందని ఆరోపించారు. నాసిర్, జునైద్ హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మోను మనేసర్ బెయిల్‌పై విడుదలై తిరిగి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడని పేర్కొన్నారు.

**ఖడ్గాల పంపిణీ.. ఆయుధ శిక్షణ శిబిరాలు**

దేశవ్యాప్తంగా విహెచ్‌పి, భజరంగ్‌దళ్, హిందూ రక్ష దళ్ వంటి సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ఖడ్గాలు, త్రిశూలాలు, కత్తులు పంపిణీ చేస్తున్నారని నివేదిక తెలిపింది.

త్రిశూల దీక్ష, శౌర్య యాత్ర పేరుతో మైనార్టీలపై ద్వేష ప్రమాణాలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో శివశక్తి అఖాడా అనే మఠాధీశుల నెట్‌వర్క్ ఆయుధాలతో ర్యాలీలు నిర్వహిస్తూ మైనార్టీలపై హింసకు ప్రేరేపిస్తోందని పేర్కొన్నారు.

**క్రైస్తవులపై దాడులు**

2014తో పోలిస్తే 2024 నాటికి క్రైస్తవులపై హింస 555 శాతం పెరిగిందని 'యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం' గణాంకాలను ఉదహరించింది. ప్రార్థనా మందిరాలపై దాడులు, పాస్టర్లపై దాడులు, చర్చిల మూసివేతలు పెరిగాయని తెలిపింది.

**2025లో 1,318 ద్వేష ప్రసంగాలు**

'ఇండియా హేట్ ల్యాబ్' గణాంకాల ప్రకారం 2025లో దేశవ్యాప్తంగా 1,318 ద్వేష ప్రసంగ సమావేశాలు జరిగాయని నివేదిక పేర్కొంది. వాటిలో 88 శాతం బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే జరిగాయని తెలిపింది. 23 శాతం ప్రసంగాల్లో ప్రత్యక్ష హింసకు పిలుపు, 10 శాతం ప్రసంగాల్లో ఆయుధాలకు పిలుపు, 21 శాతం ప్రసంగాల్లో మసీదులు, చర్చిల కూల్చివేతలకు పిలుపు ఉన్నట్లు పేర్కొంది. మైనార్టీలను పురుగులు, పాములు, రక్తపిపాసి జాంబీలు వంటి పదాలతో అవమానించారని తెలిపింది.

**'లవ్ జిహాద్', 'పాపులేషన్ జిహాద్' కుట్ర సిద్ధాంతాలు**

'లవ్ జిహాద్', 'ల్యాండ్ జిహాద్', 'పాపులేషన్ జిహాద్', 'స్పిట్ జిహాద్', 'ఓట్ జిహాద్' వంటి కుట్ర సిద్ధాంతాలను హిందుత్వ సంస్థలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయని నివేదిక ఆరోపించింది. ఈ సిద్ధాంతాల ఆధారంగానే మతమార్పిడి నిరోధక చట్టాలు తీసుకొస్తున్నారని పేర్కొంది. మెటా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికలు ద్వేష ప్రసంగాలకు కేంద్రాలుగా మారాయని నివేదిక ఆరోపించింది. 2025లో నమోదైన 1,318 ద్వేష ప్రసంగాల్లో 1,278 వీడియోలు మొదట సోషల్ మీడియాలోనే అప్‌లోడ్ అయ్యాయని పేర్కొంది. ఇలాంటివి నిషేధించడంలో మెటా విఫలమైందని విమర్శించింది.

**అమెరికాకు కీలక సిఫార్సులు**

అమెరికా ప్రభుత్వం వెంటనే ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి, బజరంగ్‌దళ్ సహా 160 సంస్థలపై ఆంక్షలు విధించాలని, భారతదేశాన్ని ట్రాన్స్‌నేషనల్ రిప్రెషన్ దేశంగా గుర్తించాలని, మైనార్టీల ఇళ్ల కూల్చివేతల్లో ఉపయోగిస్తున్న యంత్రాల తయారీ కంపెనీలపై విచారణ జరపాలని, సోషల్ మీడియా కంపెనీలను కమిషన్ ఎదుట హాజరు పరచాలని రకీబ్ హమీద్ నాయక్ తన వాంగ్మూలంలో కోరారు.

## ధాన్యం రానీయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నగదు చెల్లింపు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి . ఈ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఖమ్మం జిల్లా నుండి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వివిధ ప్రాంతాల నుండి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు,పార్లమెంట్ సభ్యులు, ఎంఎల్‌సిలు,ఎంఎల్‌ఎలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి కాగా, ఇందులో 75 లక్షల మెట్రిక్ టన్నులు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8. 575 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.8,749 కోట్లను రైతులకు చెల్లించడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో వేచి ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేపట్టాలని తెలిపారు.

**సరిపోను హమాలీలను అందుబాటు ఉండేలా చర్యలు : ఉప ముఖ్యమంత్రి**

ఖమ్మం నుంచి విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, సరిపడా హమాలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. గతంలో రైతులు వరి ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపు విషయంలో నెలల తరబడి వేచి చూడాల్సివచ్చేందని, ఇప్పుడు వెంటనే చెల్లింపులు జరుగుతుందని తెలిపారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా వాయు కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా వ్యవసాయ వ్యర్థాల కాల్చివేసే రైతులకు వాయు కాలుష్య నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు.

పంట అవశేషాలను కాల్చవద్దని గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని భట్టివిక్రమార్క తెలిపారు. ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య విజయవంతంగా నిర్వహించిన పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది భారీ స్థాయిలో వరి దిగుబడి వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల మంత్రి వర్గం సన్‌ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిందని ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని అధికారులు సమర్థవంతంగా పనిచేశారని ఉప ముఖ్యమంత్రి ప్రశంసించారు. జిల్లాలో ఇప్పటి వరకు 123560 మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా అందులో 112922 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ఉందన్నారు. గతంలో రైతులకు ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ పాలనలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. పట్టణాభివృద్ధిలో వాయు కాలుష్య నియంత్రణ కీలకమని పంట అవశేషాలను కాల్చడం కూడా వాయుకాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఒకటని, దీనివల్ల కాలుష్యంతో పాటు పక్క పొలాలకు మంటలు వ్యాపించి ప్రమాదాలు కూడా జరుగుతాయన్నారు. గ్రామాల్లో పంట అవశేషాలను కాల్చకుండా టామ్ టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆ తర్వాత కూడా కాల్చేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు వంద శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఉండే హమాలీలు రవాణా సమస్యల పరిష్కారానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వంద శాతం పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేసిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి అండర్ టెకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయాలని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మంత్రి వర్గం సన్‌ఫ్లవర్ కొనుగోలుకు ఆమోదం తెలిపిందని అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. చివరి గింజ వరకు పంట కొనుగోలు జరిగేలా చూడాలని వరి కొయ్యలను కాల్చకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోళ్లు చేస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. యాసంగి 2025–26 సీజన్‌లో రాష్ట్రం లో మొక్కజొన్న సాగు 16.13లక్షల ఎకరాలకు పెరిగిందని, ఎకరాకు సగటు దిగుబడి 26.57 క్వింటాళ్లుగా నమోదవడంతో మొత్తం ఉత్పత్తి 42.87 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందని పేర్కొన్నారు. రైతులకు కనీస మద్దతు ధర అందేలా ప్రభుత్వం ఇప్పటికే రూ.4,172.94 కోట్ల గ్యారంటీ ఇవ్వగా, అదనంగా మరో 6.53 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు రూ.1867.77 కోట్ల బ్యాంకు గ్యారంటీకి మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 354 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటికే 12.85 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను 2.33లక్షల మంది రైతుల నుంచి సేకరించినట్లు తెలిపారుఈ ఒక్క యాసంగి సీజన్‌లోనే రూ. 6000కోట్ల మేర వ్యయం చేస్తోందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

## కొత్త ఠాణాల జాడేది?

(మొదటి పేజీ తరువాయి)

కోసం నిరీక్షిస్తున్న 2012 బ్యాచ్‌కు చెందిన ఎస్సైల ప్రమోషన్లు పక్కా అని భావించారు. అయితే 11 నెలలు గడిచిపోయినా ఆచరణకు మాత్రం నోచుకోవటం లేదు. 2014 బ్యాచ్ ఎస్సైలకు సెల్యూట్ చేయాల్సి వస్తుందని 2012 బ్యాచ్ ఎస్సైలు లబోదిబోమంటున్నారు. పుండుపై కారం చల్లినట్లు సబ్‌ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహించే పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు ఇవ్వటంతో ఇక తమకు పదోన్నతులు ఇప్పట్లో రావని ఆందోళన చెందుతున్నారు. అప్‌గ్రేడేషన్లు చేయాల్సింది పోయి ఎస్సైలు విధులు నిర్వహించే పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లను నియమించటం ఏంటని చర్చించుకుంటున్నారు. ఫిబ్రవరిలో కొత్త పోలీస్‌స్టేషన్లు, అప్‌గ్రేడేషన్ కోసం ఈ క్రింది విధంగా అధికారులు నివేదికలు ప్రభుత్వానికి అందజేశారు.

**రామగుండం కమిషనరేట్ పరిధిలో ..**

రామగుండం కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఈ కేటగిరి నుండి డి కేటగిరికి, ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ను ఎఫ్ క్యాటగిరి నుండి ఈ కేటగిరికి, సీసీ నస్పూర్ పిఎస్‌ను ఈ కేటగిరి నుండి డి కేటగిరికి, మంచిర్యాల పిఎస్‌లో డి కేగిరి నుండి బి కేటగిరికి అప్‌గ్రేడ్ చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. దీంతో పాటు కొత్తగా పెద్దపల్లి రూరల్, పెద్దపల్లి ట్రాఫిక్, పెద్దపల్లి మహిళా, గోదావరి ఖని మహిళ, ఎలిగేడు, మంచిర్యాల రెడవ పిఎస్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసి పంపారు. సిఎం పెద్దపల్లి పర్యటన సందర్భంగా కొత్త పోలీస్‌స్టేషన్లకు హడావడిగా జిఓలు జారీ చేశారు. నెలల విరామం అనంతరం ఎట్టకేలకు గతనెలలో మంత్రులు వాటిని ప్రారంభించారు. అయితే వాటికి ఆర్థిక శాఖ నుండి క్లియరెన్స రాకపోవటంతో జిలాలలోని అధికారులు, సిబ్బందికి అటాచ్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చి కొత్త పోలీస్‌స్టేషన్లను నడుపుతున్నారు. అందువల్ల కొత్త పోస్టులు క్రియేట్ కాలేదు.

**నిజామాబాద్ కమిషనరేట్‌లో ..**

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో కొత్తగా మోస్రా, సాలూర, బోధన్ ట్రాఫిక్, ఆర్మూర్, డోంకేశ్వర్, ఆలూర్, నందిపేట్ సర్కిల్ ఏర్పాటు కోసం నివేదికలు పంపించారు. నిజామాబాద్ 2, 3, 4, 5, 6, రూరల్, నవీపేట్, మల్కూర్, డిచ్‌పల్లి, జక్రాన్ పల్లి, ఇందల్వాయి, ఆర్మూర్, నందిపేట్, నిజామాబాద్ మహిళా, బోధన్‌టౌన్, బోధన్ రూరల్ పిఎస్‌లను అప్‌గ్రేడ్ చేయాలని నివేదికలు పంపించారు.

**ఎస్ఐల స్థానంలో ఇన్‌స్పెక్టర్లు :** ప్రభుత్వం కొత్త పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటు అటు నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్న పిఎస్‌లకు ఇన్‌స్పెక్టర్లను కేటాయించటం గమనార్హం. కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెం, చర్ల, ఖమ్మం కమీషనరేట్ పరిధిలోని ఖమ్మం రూరల్, ముదిగొండ, మధిర, రఘునాథపాలంఎ, పిఎస్‌లలో ఎస్సైల స్థానంలో ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ మావల పిఎస్‌కు, ఇచ్చోడ పిఎస్‌కు ఇన్‌స్పెక్టర్లను నియమించారు. వరంగల్ కమీషనరేట్‌లో ఏనుమాముల పిఎస్‌కు ఇన్‌స్పెక్టర్ కేటాయించారు.

**పదోన్నతుల సమస్యకు పరిష్కారమేది :** గత ప్రభుత్వం తీసుకవచ్చిన 317 జిఓతో నష్టపోయిన 2012 బ్యాచ్‌కు చెందిన ఎస్సైలు ఈ ప్రభుత్వ హయాంలోనైనా పదోన్నతులు దక్కుతాయని భావించారు. 2012 బ్యాచ్‌లో 146 మంది ఎస్సైలుగా పోలీసు శాఖలో చేరగా ఇప్పటివరకు 76 మంది మాత్రమేఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందారు. నాలుగేళ్ల క్రితం కొంతమందికి పదోన్నతులుగా రాగా 10 మందికి పదోన్నతులు వచ్చాయి. మిగతా వారు పదోన్నతుల కోసం 13 ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. తమ బ్యాచ్‌కు చెందిన వారితో పాటు జూనియర్లు అయినా పదోన్నతులు పొందిన 2014 బ్యాచ్ వారికి సెల్యూట్ చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి తమ పదోన్నతుల సమస్య పరిష్కరించాలని మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నా సిఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. కొత్త పోలీస్‌స్టేషన్లు, పిఎస్‌ల అప్‌గ్రేడ్‌తో 2014 బ్యాచ్ ఎస్సైల పదోన్నతుల సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావించారు. సిఎం కొత్తగా నియమితులైన డీజీపీ దృష్టి సారించాలని కోరుతున్నారు.

# లక్నోపై పంజాబ్ ఘన విజయం

## ప్లే ఆఫ్స్ ఆశలు సజీవం!

ఐపిఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఎట్టకేలకు తమ పరాజయాల పరంపరకు బ్రేక్ వేసింది. వరుసగా 6 ఓటముల తర్వాత విజయం సాధించింది. శనివారం లక్నో వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో పంజాబ్ కింగ్స్ తమ ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఆదివారం ముంబై ఇండియన్స్ చేతిలో రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ చేతిలో కేకేఆర్ ఓడితే పంజాబ్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తోంది. మరోవైపు ఈ సీజన్‌ను లక్నో సూపర్ జెయింట్స్ ఓటమితో ముగించింది. 14 మ్యాచ్‌ల్లో 4 విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లీస్(44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 72) హాఫ్ సెంచరీతో రాణించగా.. ఆయుష్ బదోని(18 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 43), అబ్దుల్ సమద్(20 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 37 నాటౌట్) దూకుడుగా ఆడారు. పంజాబ్ బౌలర్లలో మార్కో జాన్సెన్, యుజ్వేంద్ర చాహల్ రెండేసి వికెట్లు తీయగా.. అజ్మతుల్లా ఒమర్జాయ్, శశాంక్ సింగ్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం పంజాబ్ కింగ్స్ 18 ఓవర్లలో 3 వికెట్లకు 200 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. శ్రేయస్ అయ్యర్(51 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లతో 104 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. ప్రభసిమ్రాన్ సింగ్(39 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 69) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. లక్నో బౌలర్లలో మహమ్మద్ షమీ(2/45) రెండు వికెట్లు తీయగా.. అర్జున్ టెండూల్కర్(1/36) ఒక వికెట్ పడగొట్టాడు.



# ముంబైపై ఘనవిజయంతో ప్లేఆఫ్స్‌కు రాజస్థాన్

## ఢిల్లీ, పంజాబ్, కోల్‌కతా ఇంటికి




పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ చివరి బెర్తును రాజస్థాన్ రాయల్స్ పట్టేసింది. ఉత్కంఠ పోరులో అదిరే ఆటతో ముంబై ఇండియన్స్‌కు చెక్ పెట్టిన రాజస్థాన్.. ఎలిమినేటర్ ఆడాలనుకున్న పంజాబ్ కింగ్స్, కోల్కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఇంటికి పంపింది. వాంఖడేలో జోఫ్రా ఆర్చర్(32, 3–17) ఆల్‌రౌండ్ షోతో ముంబై బెంబేలెత్తిపోయింది. భారీ ఛేదనలో సూర్యకుమార్ యాదవ్ (60) ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. ఎలిమినేటర్లో సన్‌రైజర్స్‌ను రాజస్థాన్ ఢీకొట్టనుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ సమిష్టి కృషితో ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. గెలిస్తేనే ఎలిమినేటర్ బెర్తు దక్కనున్న వేళ జోఫ్రా ఆర్చర్(32, 3–17) చెలరేగాడు. వాంఖడేలో ముంబై ఇండియన్స్ బౌలర్లను బాదేసిన అర్చర్.. అనంతరం బంతితోనూ ఆ జట్టు బ్యాటర్లను వణికించాడు. బ్రిజేష్ శర్మ(2–26), బర్గర్(2–43) కీలక వికెట్లు తీసి సహకరించగా 8వ విజయం.. 16 పాయింట్లతో రాజస్థాన్ ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుంది. రాజస్థాన్‌కు భారీ స్కోర్ సమర్పించుకున్న ముంబై బ్యాటింగ్‌లో తడబడుతోంది. తొలి ఓవర్‌లోనే రోహిత్ శర్మ(0)ను డకౌట్ చేసిన ఆర్చర్(3–17) తర్వాతి ఓవర్లో నమన్ ధీర్(6)ను బౌల్ చేసి రెండో వికెట్ అందించాడు. బర్గర్ ఓవర్లో రికెల్టన్(12)క వర్స్‌లో వైభవ్ చేతికి చిక్కగా. 24 వద్ద మూడో వికెట్ పడింది. అనంతరం సూర్యకుమార్ యాదవ్(60)తో కలిసి తిలక్ వర్మ(3) ఇన్నింగ్స్ నిర్మించాలనుకున్నాడు. కానీ, బ్రిజేష్ అతడిని బౌల్ చేయడంతో పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయింది ముంబై. విల్ జాక్స్(33) జతగా సూర్య ధనాధన్ ఆడగా ముంబై స్కోర్ వంద దాటింది. అయితే.. ఐదో వికెట్‌కు 63 రన్స్ జోడించిన జాక్స్‌ను యశ్ రాజ్ ఔట్ చేయగా వస్తూనే హార్దిక్ పాండ్యా(34) రెండు సిక్సర్లతో తన ఉద్దేశాన్ని చాటాడు. గెలిపించే బాధ్య తీసుకున్న ఈ ఇద్దరూ రాజస్థాన్‌ను భయపెట్టారు. రెండో స్పెల్లో ఆర్చర్ మరో వికెట్ అందిస్తూ పాండ్యాను వెనక్కి పంపాడు. కార్బిన్ బాష్(2) విఫలమవ్వగా.. శార్దూల్ ఠాకూర్(10 నాటౌట్) అండతో ముంబైని గట్టెక్కించాలనుకున్న సూర్యను బర్గర్ రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ పంపడంతో రాజస్థాన్ విజయం ఖాయమైంది. చివరి ఓవర్లో 37 రన్స్ అవసరమవ్వగా శనక ఆరు పరుగులే ఇచ్చాడు. దాంతో.. 30 పరుగులతో గెలుపొందిన రాజస్థాన్ నాలుగో స్థానంతో మురిసింది.

**రాణించిన జురెల్, ఆర్చర్...** ప్లే ఆఫ్స్ బెర్తును నిర్ణయించే మ్యాచ్‌లో రాజస్థాన్ బ్యాటర్లు టాపార్డర్ బ్యాటర్లు తేలిపోయారు. పవర్ ప్లేలోనే ముంబై ఇండియన్స్ బౌలర్లు మూడు వికెట్లతో దెబ్బతీయగా.. మిడిలార్డర్ సైతం తడబడింది. దంచికొట్టే ఓపెనర్లు స్వల్ప స్కోర్కే ఔటైన వేళ ధ్రువ్ జురెల్(38), ఆర్చర్(32)లు ఆపద్భాదంవులయ్యారు. కానీ, డెత్ ఓవర్లలో శార్దూల్(2–41) విజృంభించినా జడేజా(19 నాటౌట్) మెరుపులతో రాజస్థాన్ రెండొందలు కొట్టింది.

# ఆరోగ్యం

## ఎముకల్లో ‘హియాయిడ్’ ప్రత్యేకం

మనిషి శరీర నిర్మాణంలో ప్రతి ఎముకకు ఒక నిర్దిష్ట నిర్మాణం, పనిఉంటుంది. అయితే హియాయిడ్ ఎముక ఈ వ్యవస్థలో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. సాధారణంగా ఎముకలు ఇతర ఎముకలతో సంధులు ఏర్పరచుకుని ఒక నిర్మాణాత్మక క్రమాన్ని ఏర్పరుస్తాయి. కానీ హియాయిడ్ ఎముక మాత్రం శరీరంలో ఏ ఇతర ఎముకతోనూ నేరుగా కలవదు. ఇది గొంతు భాగంలో, జిహ్వ అడుగుభాగం సమీపంలో ఉంటుం ది. కండరాలు, లిగమెంట్ల ద్వారా మాత్రమే అది స్థిరంగా ఉండగలుగుతుంది. అందుకే దీనిని ‘జిహ్వామూల ఎముక’ అని కూడా అంటారు. ఈ ఎముక చిన్నదైనా, దాని కార్యపరమైన ప్రాముఖ్యత చాలా ఎక్కువ. మాట్లాడ డం, మింగడం, శ్వాస తీసుకోవడం వంటి ప్రాథమిక జీవ క్రియల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ము ఖ్యంగా నాలుగు కదలికలకు, గళకంఠం స్థితికి ఇది ఒక ఆధార బిందువులా పనిచేస్తుంది. మనం మాటలు పలకడం అనేది కేవలం ఊపిరి బయటకు రావడం మాత్రమే కాదు, అది జిహ్వ, గొంతు, శబ్దపేటిక మధ్య సమన్వయంతో కూడిన ప్రక్రియ. ఈ సమన్వయానికి హియాయిడ్ ఎముక ఒక స్థిరమైన కానీ కొంతవరకు కదిలే ఆధారాన్ని అందిస్తుంది. ఇతర ఎముకలతో నేరుగా కలవకపోవడం వల్ల, హియాయిడ్‌కు కొంత సౌలభ్యం ఉంటుంది. ఈ సౌలభ్యం జిహ్వ, గొంతు కదలికలకు అవసరమైన సానుకూలతను కల్పిస్తుంది. అదే సమయంలో, కండరాలు, లిగమెంట్లు దీనిని బలంగా పట్టుకొని ఉంచడం వల్ల అది పూర్తిగా అస్థిరంగా మారదు. ఈ స్థిరత్వం, సౌలభ్యం మధ్య ఉన్న సమతుల్యత వల్లే మనం ఆహారాన్ని సురక్షితంగా మింగగలుగుతాము. స్పష్టంగా మాట్లాడగలుగుతాము. మొత్తంగా చూస్తే, హియాయిడ్ ఎముక శరీర నిర్మాణంలో ఉన్న వైవిధ్యాన్ని స్పష్టంగా చూపిస్తుంది. చిన్నదైనా, ఇది సంభాషణ, ఆహార వినియోగం, శ్వాస వంటి కీలక ప్రక్రియల్లో కేంద్ర పాత్ర పోషిస్తుంది.



# భూమి కంటే పాతవి..



మనిషి శరీరాన్ని నిర్మించే అణువులు చాలా పురాతనమైనవి. వాటిలో చాలా వరకు భూమిపై ఉత్పత్తి కాలేదు. విశ్వ పుట్టుకైన ‘బిగ్ బ్యాంగ్’ సమయంలో ప్రధానంగా హైడ్రోజన్, హీలియం మాత్రమే ఏర్పడ్డాయి. తర్వాత కోట్లాది సంవత్సరాల పాటు నక్షత్రాల గర్భంలో జరిగే అణు సంయోగ చర్యల వల్ల కార్బన్, ఆక్సిజన్, నైట్రోజన్, ఇనుము వంటి భారమైన మూలకాలు పుట్టాయి. చివరకు ఈ నక్షత్రాలు ‘సూపర్‌నోవా’ పేలుళ్ల ద్వారా ఈ మూలకాలు అంతరిక్షంలో వ్యాపించాయి. ఈ ప్రక్రియను ‘స్టెల్లార్ న్యూక్లియోసింథసిస్’ అంటారు. ఈ మూలకాలు తర్వాత గ్యాస్ మేఘాలుగా చేరి, కొత్త నక్షత్రాలు, గ్రహాలు, చివరకు మన సౌరవ్యవస్థను రూపొందించాయి. కాబట్టి మానవ శరీరంలోని ఇనుము, కాల్షియం, ఆక్సిజన్ వంటి మూలకాలు నిజంగా పూర్వ నక్షత్రాల నుంచే వచ్చినవి అన్నది శాస్త్రీయంగా నిరూపితమైన విషయం. అయితే, మనిషి నక్షత్ర ధూళితో తయారయ్యాడనే భావం మాత్రం సరికాదు. ఇది ఒక స్థాయి వరకే వాస్తవం. అందుకే, ఇక్కడ కొన్ని అంశాలు సరిచూడాలి. మనిషి శరీరంలోని అణువులన్నీ బిలియన్ల సంవత్సరాలుగా అలాగే కొనసాగుతున్నాయనే భావన కొంత సరళీకరణకు ఉపయోగపడుతుంది. అణువులు నిరంతరం మార్పిడిలో ఉంటాయి. మనం శ్వాస తీసుకోవడం, ఆహారం తీసుకోవడం, వ్యర్థాలు విసర్జించడం వంటి ప్రక్రియల ద్వారా శరీరంలోని చాలా అణువులు కొద్ది నెలల నుండి కొన్ని సంవత్సరాల వ్యవధిలో మారిపోతుంటాయి. అంటే, మనిషి అదే అణువులతో ఎప్పటికీ ఉంటాడనికాదు....ఆఅణువుల మూలం మాత్రం విశ్వ చరిత్రలో చాలా పాతదని అర్థం. అలాగే మనిషి శరీరంలో 7 ఆక్టిలియన్ అణువులు అనే అంచనా సరైన పరిమాణ ఆర్డర్‌లోనే ఉంది, కానీ ఇది వ్యక్తి బరువు, నిర్మాణం మీద ఆధారపడి మారుతుంది. కాబట్టి, దీనిని ఖచ్చిత సంఖ్యగా కాకుండా, ఒక అంచనాగా మాత్రమే తీసుకోవాలి. ‘విశ్వం తనను తాను తెలుసుకుంటోంది’ అనే భావన తాత్వికంగా ఆకర్షణీయమైనది.

# వంట నూనెలతో కేన్సర్ ప్రమాదం!



కూరగాయలు, గింజల నూనెలు (ప్రత్యేకంగా ఒమేగా6 ఎక్కువగా ఉన్నవి) కేన్సర్‌కు దారి తీస్తాయని వివిధ మాధ్యమాల్లో విస్తారంగా ప్రచారమవుతున్నది. కానీ, వంట నూనెల విపరీతమైన వినియోగం వల్ల పరిస్థితులపై ఆధారపడి ప్రమాదం పెరగవచ్చని మాత్రమే శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. అంతేగానీ, నేరుగా కేన్సర్‌కు కారకాలుగా పేర్కోలేదు. ఉదాహరణకు, ఒమేగా6 ఫ్యాటీ ఆయిల్స్ శరీరానికి అవసరమైనవి కూడా. ఇవి పూర్తిగా హానికరమైనవి కాదు. అసలు సమస్య అసమతుల్య ఆహారం లోపంతో వస్తుంది. కాగా, వంట నూనెలను ఎక్కువ ఉష్ణోగ్రతల వద్ద వేడిచేయడం వల్ల ‘అల్డెహైడ్స్’, ‘లిపిడ్ పెరోక్సిడేషన్’ ఉత్పత్తి అవుతాయని జరుగుతున్న ప్రచారాన్ని శాస్త్రీయంగా సరైనదేనని చెప్పవచ్చు. ఇవి కణాలకు నష్టం కలిగించవచ్చు. డిఎన్‌ఎపై ప్రభావం చూపవచ్చు. కానీ, ప్రయోగశాలలో కనిపించిన ప్రభావం మనం వంటింట్లో సాధారణంగా ఎదుర్కొనే స్థాయిలో కూడా అదే తీవ్రతతో జరుగుతుందా? అనేది ప్రశ్న. బహుశా ఆ స్థాయిలో ఉండకపోవచ్చన్న అభిప్రాయం బలంగా ఉంది. ల్యాబ్‌లో ఉద్దేశపూర్వకంగా అధిక ఉష్ణోగ్రతలు, ఎక్కువ సమయం ఉపయోగిస్తారు. ఇది రోజువారీ వంటతో సమానం కాదు. కొబ్బరి నూనెలో సాచ్యురేటెడ్ ఫ్యాట్ ఎక్కువగా ఉంటుంది. ఇది ఇతర ఆరోగ్య సమస్యలతో అనుసంధానమై ఉంది. కాబట్టి ఇవి మంచివి, అవి చెడ్డవి అనే విభజన సరైన విశ్లేషణ కాదు. సమతుల్య ఆహారం, సరైన వంట పద్ధతుల తోపాటు జీవనశైలి కూడా కేన్సర్ ప్రమాదాన్ని ప్రభావితం చేస్తుంది. ఒక్క వంటనూనెతో మాత్రమే కేన్సర్ ప్రమాదం ఉందనుకోవడం తప్పు.

# విఒఎలకు కనీస వేతనం ఇవ్వాలి

## ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



**ప్రజాపక్షం/రెబ్బెన :** విఒఎలకు కనీస వేతనం ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెబ్బన మండల సమాఖ్య కార్యాలయం ముందు జెఎసి ఆధ్వర్యంలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (విఒఎ) చేపట్టిన నిరవధిక సమ్మె మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా విఒఎలు ఒంటికాలిపై నిలబడి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపేందర్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా గ్రామాల్లో ప్రభుత్వానికి వెన్నెముకలా నిలబడి, మహిళా సంఘాలను నడిపిస్తున్న 18 వేల మంది విఒఎలకు నెలకు ఐదు వేల రూపాయల వేతనం ఇచ్చి ప్రభుత్వం వెక్కిరించడం వెట్టిచాకిరి, దోపిడీ కిందకే వస్తుందని మండిపడ్డారు. ప్రస్తుతం రోజువారీ కూలీకి కూడా 800 రూపాయలు దొరుకుతున్నాయని, అలాంటిది విఒఎలకు రోజుకు 166 రూపాయలు ఇచ్చి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. విఒఎలను వెంటనే సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి. కనీస వేతనం 26 వేల రూపాయలు వెంటనే అమలు చేయాలి. ఎమ్ఎస్సిసి, హెచ్ఆర్ పాలసీని వర్తింపజేసి పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. సీనియర్ విఒఎలకు సిసిలుగా ప్రమోషన్లు ఇవ్వాలి. విఒఎలకు నష్టం చేకూరుస్తున్న 58 జీవోను తక్షణం రద్దు చేయాలని, వెంటనే రాష్ట్ర విఒఎ నాయకత్వాన్ని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించకపోతే 18 వేల మందితో హైదరాబాద్‌ను ముట్టడిస్తామని, సెక్రటేరియట్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విఒఎ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమేష్, తిరుపతి, కృష్ణ, ప్రభాకర్, శంకర్, సురేఖ, కవిత, రజిత, రాజేశ్వరి, శ్రీనివాస్, సులోచన, రవి, లింగన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి మూలాలను వెలికి తీయాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ జిల్లాలో ఇటీవల పట్టుబడుతున్న అవినీతి అధికారులనే కాకుండా సమగ్ర విచారణతో వారికి అండగా ఉన్న వారందరిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ పాలనలో మేడ్చల్ జిల్లాలోని వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఆయా మండలాల్లో కబ్జాలకు గురైందని, ఆ కబ్జాలు ఏ ఒక్కరి వల్ల సాధ్యం కాదన్న విషయం డిప్యూటీ కలెక్టర్ వంద కోట్లు అవినీతి సొమ్ము కూడబెట్టుకొన్న విషయం ఎసిబి అధికారుల దాడి ద్వారా వెల్లడైందన్నారు. మేడ్చల్ జిల్లా ఏర్పాటైన తర్వాత కలెక్టర్‌గా పని చేసిన అమయ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్, జలమండలి అనంతలక్ష్మి కుమార్‌లాంటి ఉన్నత అధికారులు ఎసిబి అధికారుల వలలో చిక్కుకున్న వారిలో ఉండటం చూస్తే వారికి ఎంత మంది ప్రభుత్వ అధికారులు సహకరించారో అన్న విషయం అర్థమవుతుందన్నారు. గతంలో ఎన్నడులేని విధంగా ప్రభుత్వ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, ఎసిబి అధికారులు జోక్యం చేసుకొని అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఎసిబి అధికారుల దాడిలో పట్టుబడిన వారినే కాకుండా అవినీతి మూలాలను వెతికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# పరిపూర్ణుడు ఏటుకూరి ప్రసాద్

## సిపిఐ జాతీయ కంట్రోల్ మిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ




**తిరుపతి :** ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అగ్రనేత, విశాలాంధ్ర దినపత్రిక పూర్వ సంపాదకులు డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ సంపూర్ణ జీవితాన్ని ఆవిష్కరించిన మహావ్యక్తి అని సిపిఐ జాతీయ కంట్రోల్ మిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ కొనియాడారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్ లో జరుగుతున్న అరసం 20వ రాష్ట్ర మహాసభల ముగింపు రోజు ఆదివారం డాక్టర్ ఏటుకూరి ప్రసాద్‌కు రచయితలు, పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ ఏటుకూరి ప్రసాద్ మరణం సాహితీ లోకానికి తీరని లోటన్నారు. అరసం రాష్ట్ర మహాసభలు జరుగుతున్న తరుణంలోనే ఏటుకూరి తుదిశ్వాస విడవడం అత్యంత బాధాకరమని, ఇది చాలా విషాదకరమైన విషయమన్నారు. అయితే, ఎంతో మంది రచయితలు, మేధావులు ఒకేచోట చేరిన సమయంలో ఆయనకు నివాళులు అర్పించే అవకాశం రావడం ఒక అదృష్టంగా భావించవచ్చన్నారు. ఏటుకూరి ప్రసాద్ చివరి శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసమే పని చేశారని నారాయణ గుర్తుచేశారు. మనిషిగా జన్మించాక జీవితానికి ఒక సార్థకత ఉండాలని, ఆ సార్థకతను ఏటుకూరి పూర్తిగా సాధించారన్నారు. ఆయన జీవితం పరిపూర్ణమైనదని, సమాజ శ్రేయస్సు కోసం నిత్యం పరితపించిన ఒక గొప్ప వ్యక్తి ఆయన అని శ్లాఘించారు. ఏటుకూరి జీవితం నీతి, నిజాయితీ, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందని నారాయణ స్పష్టం చేశారు. విశాలాంధ్ర జనరల్ మేనేజర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పుట్టా హరినాధరెడ్డి మాట్లాడుతూ... ఏటుకూరి ప్రసాద్కు విశాలాంధ్ర పత్రికతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఆయన మరణం విశాలాంధ్రకు తీరని లోటని పేర్కొన్నారు. పత్రికకు ఆయన ప్రతియేటా ఆర్థిక సాయం అందించేవారని, సమాజ బాగు కోసం నిత్యం తపించేవారని చెప్పారు. సాహితీ లోకానికి ఏటుకూరి చేసిన కృషి అనన్య సామాన్యమైనదని, ఒక సంపాదకుడిగా విశాలాంధ్ర పత్రిక అభివృద్ధికి ఆయన ఎంతో శ్రమించారని, అద్భుతమైన సంపాదకీయాలు రాసేవారని కొనియాడారు.

### ఆధునిక భారతీయుడు ఏటుకూరి

### రాచపాళెం

అరసం రాష్ట్ర అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... ఏటుకూరి ప్రసాద్ నిజమైన ఆధునిక భారతీయుడు అనిపించుకున్నారని అన్నారు. సమాజంలో వేళ్లూనుకున్న డిక్లాసిఫికేషన్, డిక్యాస్టియిజం, మత తత్వం వంటి రుగ్మతలను పూర్తిగా జయించిన మహా వ్యక్తి ఏటుకూరి అని ప్రశంసించారు.

### అనారోగ్యంలోనూ నిరంతర సాహిత్య సేవ

### వల్లూరి శివప్రసాద్

అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ... ఏటుకూరి ప్రసాద్ ఒక విజ్ఞానగని అని అభివర్ణించారు. పుస్తకాల ప్రచురణ కోసం ఆయన తన సొంత డబ్బును వెచ్చించేవారని గుర్తుచేశారు. చివరి దశలో ఆరోగ్యం సహకరించకపోయినా సాహిత్య సేవను మాత్రం ఆపలేదని చెప్పారు. అరసం సంస్థకు ఆర్థికంగా ఎంతో అండగా నిలిచారని, ఆయన మరణం అరసం సంస్థకు కోలుకోలేని దెబ్బ అని ఆవేదన వ్యక్తం చేశారు.

### సమర్థవంతమైన సంపాదకుడు, గేయ రచయిత : పెనుగొండ

నివాళి కార్యక్రమంలో మొదటగా అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఏటుకూరి గొప్ప రచయిత అని కొనియాడారు. తన జన్మభూమిపై ఉన్న మక్కువతో ‘ఏటుకూరు’ పేరుతో ఒక ప్రత్యేక సంకలనాన్ని తీసుకువచ్చి, ఆప్రాంతానికే అంకితమిచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పూర్వం యువజన పత్రికను ఆయన ఎంతో సమర్థవంతంగా నిర్వహించారని, ఆయన ఒక గొప్ప గేయ రచయితగా, అద్భుతమైన సంకలనకర్తగా గుర్తింపుపొందారని వివరించారు. అరసం రచయిత శరత్ మాట్లాడుతూ ఏటుకూరి ప్రసాద్‌తో తనకున్న వ్యక్తిగత, సాహిత్య అనుబంధాలను భావోద్వేగంతో నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో అరసం నాయకులు సాకం నాగరాజు, యువశ్రీ మురళి, గంటా మోహన్, నెమిలేటి కిట్టన్నలతో పాటు సిపిఐ నేతలు రామానాయుడు, మురళి, ప్రజానాట్యమండలి ఎపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిన్నం పెంచలయ్య, విశాలాంధ్ర తిరుపతి బ్యూరో డాక్టర్ ఎండి.ప్రసాద్, వలిపి శ్రీరాములు, రచయితలు, మేధావులు పాల్గొన్నారు.




సీనియర్ నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సిపిఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి నల్లమల గిరి ప్రసాద్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవనంలో గిరిప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నవచేతన విజ్ఞాన సమితి సిబ్బంది



మాజీ ఎంపి, సిపిఐ జాతీయ మాజీ ఉప ప్రధాన కార్యదర్శి నల్లమల గిరి ప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఖమ్మంలోని గిరి ప్రసాద్ భవన్‌లో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావుతో కలిసి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పూలమాలవేసి నివాళులర్పించారు. శేషగిరి పేరులోని చివరి రెండు అక్షరాలతో గిరిప్రసాద్‌గా పేరు మార్చుకున్నారని సాంబశివరావు తెలిపారు. ఆయన నిస్వార్థమైన రాజకీయ నాయకుడిగా ఎదిగారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కార్యదర్శిగా పనిచేసి, జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి వరకు ఎదిగారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న గొప్ప నాయకుడని కూనంనేని కొనియాడారు.

# 6,7 రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: కొనుగోలు చేసిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో మిల్లులకు తరలించి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వ లేకుండా క్లోజ్ చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగస్వాములైన అధికారులను ఆదేశించారు.ఆదివారం జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ముందే సిద్ధం చేసుకున్న కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రానున్న 6,7 రోజుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఇందుకుగాను ప్రతి రోజు ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించడమే కాకుండా, సంబంధిత అధికారులతో సమీక్షించి, మిల్లుల వద్ద తక్షణమే ధాన్యం అన్‌లోడింగ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రికి తెలియజేశారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం మొత్తాన్ని వారం రోజుల్లో పూర్తిస్థాయిలో మిల్లులకు తరలించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్లోజ్ చేయాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లర్లు వెంటనే ధాన్యాన్ని దించుకోవాలని, ఏ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు. ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ వేగవంతం చేసి రైతుల ఖాతాల్లో త్వరగా డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అంతకు ముందు పౌరసరఫరాల శాఖ మంత్రి మంత్రి ఎన్ .ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా వరి పండించిన రాష్ట్రంగా తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, ఇంకా 8.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగాల్సి ఉందని, అధికారులు వెంటనే కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.మిల్లర్లు, ట్రేడర్లు తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మరోసారి హెచ్చరించారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని సూచించారు. వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ లేకుండా పూర్తిగా కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియను ముగించాలని చెప్పారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, అదనపు ఎస్పీ రమేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, పౌరసరఫరాల అధికారి వెంకటేష్, డిఎం రాంపతి , మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి ,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు .

**జిల్లా పరిషత్ పోస్టుల భర్తీకి పారదర్శకంగా ఇంటర్వ్యూలు**

జిల్లా పరిషత్ ఆధీనంలోని పలు పోస్టుల భర్తీకి సంబంధించి ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించిన్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం జిల్లా పరిషత్ ఆధీనంలోని జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు,రికార్డ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్స్, రాత్రి కావలాదారుల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ప్రేమ్‌కరణ్ రెడ్డి, తెలంగాణ మినిస్టీరియల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి ఉన్నారు.



## 28లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి

ఎంపి చామల,ప్రభుత్వ విప్ వేముల ఆదేశం

ప్రజాపక్షం/నకిరేకల్ : మూడు మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి,ఈ నెల 28వ తేదీలోపు అన్ని కొనుగోలు కేంద్రాల్లో వడ్ల సేకరణ పూర్తి చేయాలని భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి,ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు.ఆదివారం నకిరేకల్ తహశీల్దార్ కార్యాలయంలో కేతేపల్లి, నకిరేకల్, కట్టంగూర్ మండలాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని సూచించారు.మూడు మండలాల పరిధిలో 23 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు వెల్లడించారు.మిగిలిన కొనుగోలు కేంద్రాల్లో కూడా ఎలాంటి జాప్యం లేకుండా ఈ నెల 28వ తేదీలోపు ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు వారు స్పష్టమైన గడువు విధించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈసమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుమాధవ్‌రెడ్డి, నకిరేకల్ తహశీల్దార్ యశ్వంత్ రాజ్ సివిల్ సప్లై అధికారి రాచకొండ జ్యోతి సంబంధిత శాఖల అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజాపక్షం/చిట్యాల: రాష్ట్రంలోని రైతులందరికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్, నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలంలోని ఉరుమడ్ల, పెద్దకాపర్తి, గుండ్రాంపల్లి, సుంకెనపల్లి గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను, లారీల రవాణా, హామాలీల అందుబాటు తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని త్వరతగతిన కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోకల దేవదాసు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఈత సరదా విషాదంగా మారకుండా జాగ్రత్తలు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : వేసవికాలం పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఉండడంతో పిల్లలు, యువకులు ఎండవేడి నుంచి సేదతీరేందుకు ఈత రాకున్నా సరదాగా ఈతకు వెళ్ళి ప్రాణాలు కోల్పోతున్నారని ఈత సరదా విషాదంగా మారకుండా జాగ్రత్తలు వహించాలని జిల్లా ఎస్పి కె. నరసింహ సూచించారు. ఈత రానివారు బావులు, చెరువులు, కాల్వల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని ఈత నేర్చుకునే వారు వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే పిల్లల ప్రాణానికే ప్రమాదమని ఇట్టి విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకొని పిల్లల యొక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు.

## మూడు రోజులు రెడ్ అలెర్ట్

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జిల్లాలో రాబోయే మూడు రోజుల పాటు తీవ్ర ఎండలు ఉండే పరిస్థితులు దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఈ నేపథ్యంలో రాబోయే మూడు రోజులు ఉష్ణోగ్రతల అంచనాల మేరకు వాతావరణ శాఖ జిల్లాల వారీగా హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో రాబోయే మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రెడ్ అలెర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలన్నారు. తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం, నిమ్మరసం వంటి ద్రవాలు తరచూ తీసుకోవాలని తెలిపారు. బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ లేదా టవల్ కట్టుకోవాలని పేర్కొన్నారు. వృద్ధులు, గర్భిణీలు, చిన్న పిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీహైడ్రేషన్ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య సేవలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## చండూరులో కత్తిపోట్ల కలకలం

ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ.. ఒకరికి తీవ్ర గాయాలు



ప్రజాపక్షం/చండూరు: నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారితీయడంతో పట్టణంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఘటన సమాచారం తెలిసిన వెంటనే స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం దోటి శివ, నాగిళ్ళ నరేష్ మధ్య కొంతకాలంగా వ్యక్తిగత విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది.ఈక్రమంలో ఆదివారం ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది.ఆగ్రహానికి లోనైన నాగిళ్ళ నరేష్ కత్తితో దాడి చేసినట్లు సమాచారం.ఈ ఘటనలో దోటి శివకు పొట్ట భాగం, భుజంపై తీవ్ర గాయాలయ్యాయి.దాడి జరిగిన వెంటనే అక్కడున్న స్థానికులు గాయపడిన శివను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.సంఘటన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## మానసిక వికలాంగులకు మెరుగైన సేవలు

సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత

ప్రజాపక్షం/రామన్నపేట : మండల లీగల్ సర్వీస్ అథారిటీ రామన్నపేట ఆధ్వర్యంలో వలిగొండ మండలంలోని సోమారం గ్రామంలో గల సాధన మానసిక వికలాంగుల ఆశ్రమాన్ని రామన్నపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ మానసిక వికలాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు, వారికి అందిస్తున్న సేవలు, సంరక్షణ విధానాలపై ఆరాతీసి పరిశీలించారు. వారికి నాణ్యతతో కూడిన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆశ్రమంలోని రిజిస్టర్లు,సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించి నిర్వాహకులకు పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఇంచార్జ్ మీనాక్షి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే వలిగొండలోని శాంతి నిలయం ఆశ్రమాన్ని కూడా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

## కాంగ్రెస్ పార్టీపై నిరాధార ఆరోపణలు సరికాదు

డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య



ప్రజాపక్షం/సూర్యాపేట : బిఆర్ఎస్ నాయకుడు చింతలపాటి మధు హత్యతో కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని కాని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పార్టీపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హత్యా రాజకీయాల గురించి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. మధు హత్య పాత కక్షలతో జరిగిందా వ్యక్తిగత కక్షలతో జరిగిందా అనేది పోలీసుల విచారణలో తేలుతుందని జగదీష్ రెడ్డి విచారణ అధికారిగా ఏది పడితే అది మాట్లాడి ప్రజలను, అటు కేసు విచారణను తప్పుదోవ పట్టించడం పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఆయనకు తగదన్నారు. ఈ వ్యాఖ్యలు పూర్తి బాధ్యతారహితంగా కనిపిస్తున్నాయని మండిపడ్డారు. హత్యా రాజకీయాలను ఏనాడు కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించలేదని మూడుసార్లు ఓడిపోయినప్పటికి మాజీ మంత్రి దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని అన్నారు. మాజీ మంత్రి తప్పుడు ఆరోపణలను ప్రజలు తీవ్రంగా ఖండించాలని కోరారు. ఆ హత్యతో మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదని త్వరలోనే నిజానిజాలు తేలుతాయన్నారు. మా పార్టీపై ఆయన చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ నాయకులపై పార్టీపై లేనిపోని నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజద్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, నాయకులు చింతమళ్ళ రమేష్, కక్కిరేణి శ్రీనివాస్, దొంగరి గోవర్ధన్, ఎలిమినేటి అభినయ్ నాయుడు, నాగుల వాసు, తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, వెన్న మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరులో వడదెబ్బతో వ్యక్తి మృతి



ప్రజాపక్షం/ఆలేరు : ఆలేరు పట్టణానికి చెందిన కామిటీకారి వెంకటేష్ (47) అలియాస్ చిన్న ఆదివారం వడదెబ్బ కారణంగా మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. సాధారణ కుటుంబానికి చెందిన వెంకటేష్ ఒక ప్రైవేట్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత వారం రోజులుగా తీవ్ర ఎండలు , అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో వెంకటేష్ అస్వస్థతకు గురయ్యాడని, అనంతరం పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబానికి అండగా నిలిచిన వ్యక్తి అకస్మాత్తుగా మృతిచెందడంతో భార్యా పిల్లలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుడు వెంకటేష్కు భార్య రేఖ, కుమారుడు లోకేష్ (8), కుమార్తె ఐశ్వర్య (6) ఉన్నారు. చిన్న వయసులోనే పిల్లలు తండ్రిని కోల్పోవడం కుటుంబ సభ్యులను కలచివేసింది. రోజువారీ కూలి ఆధారంగా జీవనం సాగిస్తున్న ఈ కుటుంబం ఇప్పుడు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. పేద కుటుంబానికి చెందిన వెంకటేష్ ఎంతో కష్టపడి కుటుంబాన్ని పోషించేవాడని, అతని మృతి ఆ కుటుంబాన్ని మరింత పేదరికంలోకి నెట్టిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం, అలాగే స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదుకొని ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేకంగా స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## జీవితాంతం నల్లమల గిరిప్రసాద్ రాజీలేని పోరాటాలు

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు
పల్లా దేవేందర్ రెడ్డి,లొడంగి శ్రావణ్ కుమార్



ప్రజాపక్షం/నల్లగొండ : పేదల హక్కుల కోసం నల్లమల గిరి ప్రసాద్ జీవితాంతం రాజీలేని సమరశీల పోరాటాలు నడిపారని నాయకులు పేర్కొన్నారు.ఆయన ఆశయాలను నేటి తరానికి చేరవేయాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,లొడంగి శ్రావణ్ కుమార్ అన్నారు. నల్లమల గిరి ప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నల్లగొండలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన గెరిల్లా పోరాట గెరిలా దళం" నాయకుడు, సిపిఐ జాతీయ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు నల్లమల గిరి ప్రసాద్ అమరజీవి అని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయన విరోచిత పోరాటాలు నడిపి భూమిలేని పేదలకు లక్షల ఎకరాల భూములను పంచడంలో అగ్రగామిగా నిలిచారని కొనియాడారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చూపిన మార్గంలోనే సిపిఐ ముందుకు సాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,పట్టణ కార్యదర్శి కె.ఎస్. రెడ్డి,నాయకులు వి.లెనిన్, ఎండి అక్బర్,ముండ్ల ముత్యాలు,జిల్లా సత్యం, ఎస్ కె యూసుఫ్,సీతారాములు,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బొలెరో వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి



ప్రజాపక్షం/అర్వపల్లి : తానంచర్ల శిరోంచ జాతీయ రహదారి 365పై ఎదురుగా వస్తున్న బొలోరో వాహనం ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బొల్లంపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. అర్వపల్లి ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం మద్దిరాల గ్రామానికి చెందిన మేడిదల యాకస్వామి (27) హైదరాబాద్‌లో తమ బంధువులను దింపి వస్తుండగా అదే సమయంలో బొల్లంపల్లి గ్రామ శివారుకు రాగానే కోళ్లఫారం లోడ్‌తో ఎదురుగా వస్తున్న టాటా బొలెరో వాహనం ఢీకొట్టడంతో యాకస్వామి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు.

## కొత్తగూడెం వద్ద అండర్ పాస్ రహదారిని ఏర్పాటు చేయాలని వినతి



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి నుండి హైదరాబాద్ కు సురక్షిత ప్రయాణానికి కొత్తగూడెం వద్ద అండర్ పాస్ రహదారిని ఏర్పాటు చేయాలని కోరుతూ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి భువనగిరి టీపీసీసీ మీడియా కోఆర్డినేటర్ గుత్తి బాల శంకర్ ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు.ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్యాటక కేంద్రంగా ఉన్న భూదాన్ పోచంపల్లికి హైదరాబాదు నుండి కొత్తగూడెం వద్ద ఉన్న హైవే ఎన్హెచ్65 రోడ్డు ఎక్స్ప్రెస్ హైవే నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో. పోచంపల్లి మండలానికి సంబంధించి సుమారు 30 గ్రామాల ప్రజలకు నిత్యం పోచంపల్లి నుండి నిత్యం హైవే దాటి హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన ఉండగా హైవే రోడ్డును దాటడానికి కష్టంగా మారింది. నిత్యం విపరీతమైన రద్దీగా ఉండే ఈ హైవే కారణంగా ఎందరో ప్రయాణికులు రోడ్డు దాటుతున్న క్రమంలో గాయపడడంతో, పాటు మరణించిన సందర్భాలు ఉన్నాయి. పర్యాటకులు కూడా ఈ గ్రామానికి వచ్చి తిరిగి హైవే దాటాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే ఎక్స్ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా కొత్తగూడెం పెద్ద అండర్ పాస్ నిర్మాణం చేస్తే పరిష్కారం దొరుకుతుందనీ కోరిన వెంటనే ఎంపీ స్పందిస్తూ అండర్ పర్స్ నిర్మించాలని కోరుతూ ఎక్స్ప్రెస్ హైవే అథారిటీకి అధికారిక లెటర్ పై ప్రతిపాదనలు పంపారు.

## పద్మానగర్ జంక్షన్‌కు తాత్కాలిక తాళం ...

శాశ్వత పరిష్కారం ఎప్పుడో..?
జంక్షన్ మూసినా..
జనం తీరు మారేనా..
ప్రాణాలు పోతున్నా
పట్టింపు లేదా..
ఏళ్లు గడుస్తున్నా
అండర్‌పాస్ జాడేది..



ప్రజాపక్షం/నకిరేకల్ : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి65పై నకిరేకల్ శివారులోని పద్మానగర్ జంక్షన్ ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. బైపాస్ రోడ్డుపై వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాన్ని ఇప్పటికే అధికారులు బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. ప్రమాదాల నివారణకు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు తాత్కాలిక చర్యలు చేపట్టారు.హైవే అధికారులు, పోలీసులు జంక్షన్ క్రాసింగ్‌ను సిమెంట్ దిమ్మెలు (స్టాపర్లు), ఐరన్ బారికేడ్లతో మూసివేశారు. వాహనాలను ప్రత్యామ్నాయ అండర్‌పాస్ మార్గాల వైపు మళ్లించారు. అయినప్పటికీ కొందరు ద్విచక్ర వాహనదారులు బారికేడ్లను పక్కకు జరిపి ప్రమాదకరంగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. దీనిని గమనించిన పోలీసులు అదనంగా సిమెంట్ దిమ్మెలు(స్టాపర్లు) ఏర్పాటు చేసి ఎవరూ తొలగించకుండా పికెటింగ్ నిర్వహిస్తున్నారు.

**జంక్షన్ మూసినా జనం తీరు మారేనా..?**

ప్రమాదాల నివారణ కోసం జంక్షన్ మూసివేసినా కొందరు టూ వీలర్ వాహనదారుల తీరు మారడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దూరం తిరిగి వెళ్లాల్సి వస్తుందనే కారణంతో కొందరు నిర్లక్ష్యంగా బారికేడ్లు తొలగించి హైవే దాటుతున్నారు. మరికొందరు ఎదురుదిశలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు దారి చూపుతున్నారని విమర్శలుఉన్నాయి..వివిధ గ్రామాల ప్రజలు అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తోంది. అయినా భద్రత దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రజల ప్రాణ రక్షణ కోసమే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

**తాత్కాలిక చర్యలు సరే.. శాశ్వత మార్గం ఏది..**

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించిన నకిరేకల్ బైపాస్ ప్రా రంభ ప్రాంతంలోని పద్మానగర్ జంక్షన్ వద్ద కొన్ని ఏళ్లుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. సమస్యకు అండర్‌పాస్ వంతెనే శాశ్వత పరిష్కారమని అభిప్రాయపడుతున్నారు.తాత్కాలిక చర్యలతో ప్రమాదాలు చెక్ పెట్టిన, శాశ్వత మార్గం కోసం ప్రభుత్వం అధికారులు అండర్‌పాస్ వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజల ప్రాణాలను రక్షించాలని కోరుతున్నారు.

**ప్రజల భద్రతే మా లక్ష్యం**

పద్మానగర్ జంక్షన్‌ను బ్లాక్ స్పాట్‌గా గుర్తించి జిల్లా కలెక్టర్, ఎస్పిఆదేశాల మేరకు జంక్షన్ మూసివేసినట్లు నకిరేకల్ పట్టణ సీఐ హరిబాబు తెలిపారు. ప్రజలు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సూచించారు. ప్రజల భద్రత, ప్రాణ రక్షణే తమ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

# వేగవంతంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చేయాలి

తాలు, తరుగు పేరిట కోతలు విధిస్తే చర్యలు

ఘనంగా మహిళా వారోత్సవాలు

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం పలువురు మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్ళపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాల వారిగా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను సమీక్షించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట స్థానిక హమాలీలను నియమించుకోవాలని, రవాణా సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్లు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. తాలు, తరుగు పేరిట రైతుల ధాన్యంలో కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించే మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి నినాదంతో రా ష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సమావేశ మందిరం నుండి వీడియో కాన్ఫరెన్సలో పాల్గొన్న కలెక్టర్ భవేశ్ మిశ్రా అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా కొనుగోళ్ళు పూర్తి చేసి, రోజువారి లక్ష్యాలను సాధించాలని సూచించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని, ప్రతీరోజు కార్యక్రమాలను మహిళలు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ , ఏ.ఎస్పీ సాయికిరణ్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, వ్యవసాయ అధికారి అంజీప్రసాద్, డి.ఆర్.డి.ఓ. విజయలక్ష్మీ, మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న , హార్టికల్చర్ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.




## ధాన్యం కొనుగోలును వేగవంతం

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/గజ్వేల్:** వరి ధాన్యం కొనుగోలును మరింత వేగవంతం చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు. ఆదివారం గజ్వేల్ మార్కెట్ ర్డును ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. వరి ధాన్యంతో పాటు మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతుండగా, లారీలు, హమాలీల కొరత వేధిస్తున్నట్లు తెలిపారు. అధిగమించడానికి తగిన చర్యలు తీసుకుంటుండగా, అధికంగా కొనుగోలు జరుగుతున్న సెంటర్లకు కంట్రోల్ కేంద్రాల ద్వారా వివిధ వసతులు సమకూర్చుతున్నట్లు చెప్పారు. ధాన్యం నిలువ చేయడానికి స్థల కొరత దృష్ట్యా అనువైన షెడ్లు, గోదాములు గుర్తించి నిలువ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు పండించిన పంట చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కొనుగోలులో వేగం పెంచడంలో రైతులు అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రూ.30 లక్షలతో మాయాపూర్‌లో మారుతున్న రూపురేఖలు

20 ఏళ్ళ తర్వాత కొత్తగా డ్రైన్లు, సిసి రోడ్ల నిర్మాణం



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** దిలావర్‌పూర్ మండలంలోని మాయాపూర్ గ్రామం ప్రగతి పథంలో దూసుకుపోతుంది. మాయాపూర్ గ్రామ సర్పంచ్ రమ్య ప్రమోద్ ఆధ్వర్యంలో గ్రామంలో గత 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో న్న పలు అభివృద్ధి పనులకు మోక్షం లభించింది. గ్రామంలో మురికినీటి సమస్యను అరికట్టేందుకు రూ. 30 లక్షల నిధులతో కొత్తగా డ్రైనేజీ (మురికికాలువలు)వ్యవస్థను,అలాగే అంతర్గత రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు నూతనంగా సిసి రోడ్ల నిర్మాణ పనులను ముమ్మరంగా చేపట్టారు. గత రెండు దశాబ్దాలుగా సరైన డ్రైనేజీ సౌకర్యం, రోడ్లు లేక వర్షాకాలంలో మురికినీరు రోడ్లపైనే నిలిచిపోయి గ్రామస్తులు, గల్లీ ప్రజలు నరకయాతన అనుభవించేవారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. గుర్తించిన సర్పంచ్ రమ్య ప్రమోద్ ప్రత్యేక చొరవ తీసుకొని, రూ.30 లక్షల భారీ నిధులు మంజూరు చేయించి ఈ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. 20 ఏళ్ళ తర్వాత తమ గ్రామంలో ఇంత పెద్ద మొత్తంలో పక్కా అభివృద్ధి పనులు జరగడం పట్ల మాయాపూర్ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ, సర్పంచ్ దంపతులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## ఇంటింటికీ పింఛన్ బయోమెట్రిక్ సేవలు



**ప్రజాపక్షం/కాగజ్ నగర్:** కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డు సర్దార్ బస్తీలో పింఛన్ లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి బయోమెట్రిక్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ఆదేశాల మేరకు వార్డు ఆఫీసర్ నవీన్ రాజ్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు ఆఫీసర్ నవీన్ రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వివిధ రకాల పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల ఆధార్ కార్డు నంబర్లను ఆన్‌లైన్‌లో పరిశీలించి బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేస్తున్నామని తెలిపారు. పింఛన్ లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి కాలనీల్లోనే ఈ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. బయోమెట్రిక్ నమోదు ఇంకా చేయించుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బస్తీలోని పలువురు పింఛన్ లబ్ధిదారులు పాల్గొని బయోమెట్రిక్ సేవలను వినియోగించుకున్నారు.

## గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** గోవును జాతీయ జంతువుగా కేంద్రప్రభుత్వం ప్రకటించాలని మండల మాజీ కోఆప్షన్ సభ్యులు, ముస్లీం మైనారిటీ సీనియర్ నాయకులు ఎండి.లాయక్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశంలో గోమాతను బేస్ చేసుకుంటూ వివిధ ప్రాంతాలలో ఎంతో మంది అమాక మైనారిటి ముస్లీంలపై దాడులు చేయడం జరుగుతుందని, పండగలకు నెల రోజుల ముందు నుంచే గోరక్షక సంఘాలు దాడులు చేయడం జరుగుతుందన్నారు. గోమాతపై చిత్తశుద్ధి ఉంటే గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని అన్నారు. అదేవిధంగా వివిధ దేశాలకు గోమాంసాన్ని ఎగుమతులను నిలిపివేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న గోమాంసాన్ని ఎగుమతి చేసే ఆల్‌ఖబీర్ కర్మగారాన్ని పూర్తిగా మూసివేయాలని డిమాండ్ చేశారు. ముస్లీం సోదరులు సైతం గోవులను కాకుండా గొర్రెలను, మేకలను వాడుకోవాలన్నారు.

## టిపిసిసి అధ్యక్షులు మహేష్.. కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/జన్నారం:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను జన్నారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అజ్మీర నందు నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేసి ఈ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముజఫర్ అలీఖాన్, ఫసిహుల్ల, ముత్యం సతీష్, హేమంత్ చారి, ముత్యం రాజన్న, రాజన్న, గంగన్న, రజాక్, మోసిన్, అశోక్, నాగేష్, నరసింహారావు, సత్తన్న పాల్గొన్నారు.



# భగ్గుమంటున్న భానుడు భగభగలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంతటా నిప్పుల కొలిమి ,జిల్లాలో 45 డిగ్రీలు ఎండ తీవ్రతకు అస్తవ్యస్తం

వడదెబ్బకు ఐదుగురు మృతి

**ప్రజాపక్షం / నిర్మల్ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత రోజు రోజుకూ మిన్నంటుతోంది. గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇళ్ళ నుండి బయటకు రావడానికే భయపడుతున్నారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 45 డిగ్రీలు దాటి గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, ఉమ్మడి జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో కూడా 40 నుండి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ దెబ్బకు మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ జనసంచారం లేక కర్ఫ్యూను తలపిస్తున్నాయి. తీవ్రమైన ఈ వడగాల్పుల దాటికి తాళలేక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐదుగురు వ్యక్తులు వడదెబ్బతో మృత్యువాత పడ్డారు. వడదెబ్బ మృతుల వివరాల్లోకి వెళితే , ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం లక్కంపూర్ గ్రామానికి చెందిన సంజీవ్ 44 తీవ్రమైన ఎండ దెబ్బకు గురై మరణించారు. అలాగే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేరమేరి మండలం జోడేఘాట్ గ్రామానికి చెందిన ఆనంద్‌రావు 55 వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం లంబాడి తండాకు చెందిన బాలు 45 ఎండ తీవ్రతకు తట్టుకోలేక మృతి చెందగా, అదే జిల్లా లక్షట్టిపేట మండలం చందారం గ్రామానికి చెందిన వెంకటస్వామి 56 వడదెబ్బతో మృత్యువాత పడ్డారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం లక్షణచాంద గ్రామానికి చెందిన మల్లయ్య 60 తీవ్రమైన ఎండల కారణంగా కుప్పకూలి మరణించారు. ఉదయం 8 గంటల నుంచే ఎండలు దంచికొడుతుండటంతో కూలీలు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతేనే తప్పా బయటకు రాకూడదని, ప్రయాణాల్లో ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఒంట్లో నీటి శాతం తగ్గకుండా మజ్జిగ, కొబ్బరినీళ్ళు, నిమ్మరసం వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.



## మహిళా ఆర్థికాభివృద్ధికి.. ప్రత్యేక వారోత్సవాలు

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో మే 25 నుంచి 30 వరకు 'మహిళా ఆర్థిక వారోత్సవం' నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ మినీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపలన ప్రగతి ప్రాణాళిక 99 రోజుల కార్యాచరణలో మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, స్వయం సహాయక సంఘాల బలోపేతమే ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో అవగాహన సదస్సులు, రుణ మేళాలు, ఉత్పత్తుల ప్రదర్శనలు, డిజిటల్ లావాదేవీల పై శిక్షణలు, మార్కెటింగ్ అవకాశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనేన్నట్లు చెప్పారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టనున్నారు. మహిళా వ్యాపారవేత్తలకు అవసరమైన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ పథకాల అనుసంధానంపై ప్రత్యేక సహాయం అందించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, మెప్మా పిడి ఇందిరా, పిఆర్ ఈఈ నర్సింలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## వడుర్ దారిలో పెద్దపులి సంచారం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌ఆర్‌ఓ హెచ్చరిక

**ప్రజాపక్షం/నేరడిగొండః** మండలంలోని వడుర్ నుండి గంభీర తండా రోడ్డు బుద్దిగొండ వెళ్లే దారిలో ఆదివారం తెల్లవారు జామున పెద్దపులి సంచరించినట్లు వచ్చిన సమాచారంతో అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయికి చేరుకున్న సిబ్బంది పులి పాదముద్రలను సేకరించారు. ఈ నేపథ్యంలో వడుర్, చుట్టు పక్కల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ రేంజ్ అధికారి (ఎఫ్‌ఆర్‌ఓ) హెచ్చరించారు. రైతులు, పశువుల కాపరులు అడవిలోకి ఒంటరిగా వెళ్లకుండా గుంపులుగా వెళ్లాలని సూచించారు. వ్యవసాయ పనులను ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటలలోపే ముగించుకోవాలన్నారు. పశువులను మేపడానికి అడవి లోపలికి తీసుకెళ్లరాదని, అటవీ ప్రాంతం గుండా ఉండే దారులను ఉపయోగించవద్దని స్పష్టం చేశారు. పులి పాదముద్రలు లేదా ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే అటవీ శాఖకు సమాచారం అందించాలన్నారు. వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టరాదని, ఉచ్చులు, కరెంట్ తీగలు, వలలు ఏర్పాటు చేస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌ఆర్‌ఓ పేర్కొన్నారు.




## ధాన్యం కొనుగోలులో అగ్రగామిగా 'నిజామాబాద్ జిల్లా'

●యంత్రాంగాన్ని అభినందించిన మంత్రులు ●సిఎస్, 6.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** వరి ధాన్యం కొనుగోలులో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలువటం పట్ల మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , ఇతర ఉన్నతాధికారులు జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల కమీషనర్ స్టీఫన్ రవీంద్ర తదితరులతో కలిసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌రావు, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరి ధాన్యం సేకరణ, జొన్న, మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్ష జరిపారు. జిల్లాలో ఇప్పటికే 96 శాతం మేర 6.62 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం సేకరణ పూర్తి చేయటం పట్ల కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు సంబంధిత అధికారులను అభినందించారు. వేసవి తీవ్రత, హమాలీల కొరత వంటి అనేక ప్రతీకూల పరిస్థితులు ఎదురైనప్పటికీ లక్ష్యానికనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు జరపడం అభినందనియమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. యాసంగి 2026 కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 75 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం సేకరణ జరపాల్సి ఉండగా ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నున ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని వివరించారు.రాష్ట్రంలో యాసంగిలో 8575 కొనుగోలు కేంద్రాలను నెలకొల్పిన పెద్ద ఎత్తున ధాన్యం సేకరిస్తున్నామన్నారు.మ ంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, ప్ర భుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, గ్రా మీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దా న కిషోర్, చిత్రా రామచంద్రన్, దివ్య దేవరాజన్ పాల్గొని 25 నుండి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించే మహిళా సంక్షేమలకు సంబంధి ంచి కలెక్టర్లకు, సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.కార్యక్రమాలను తెలియజేస్తూ మహిళా సంక్షేమ వారోత్సవాలను నిర్దేశిత షె డ్యూల్ మేరకు నిర్వహించి విజయవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ సాయిచైతన్య, మార్కెటింగ్ శాఖ ఏడీ గం గుబాయి, డీడబ్ల్యుఓ పద్మ, సీపీఓ రతన్, పాల్గొన్నారు.




# వరుస చోరీల కేసులను ఛేదించిన పోలీసులు

కోటి ముప్పై ఐదు లక్షల బంగారం

పోలీసు బృందాలకు రివార్డులు

ఎస్‌పి డి. వి. శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం చిలపల్లి గ్రామంలో వరుసగా జరిగిన చోరీల కేసులను మెదక్ జిల్లా పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేశారని మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. దొంగిలించబడిన భారీ మొత్తంలో బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఆదివారం మీడియా సమావేశంలో కేసులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 14 వ తేదీ రాత్రి గ్రామంలోని తాళం వేసిన ఐదు ఇండ్లను లక్ష్యంగా చేసుకున్న దుండగులు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. సుమారు 109 తులాల 9 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండి వస్తువులు, రూ. 19 వేల నగదు అవహరించారు. మరో ఇంట్లో మూడు తులాల బంగారం దొంగిలించారు. ఘటనపై కేసులు నమోదు చేసిన పోలీసులు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు, గూఢచారి సమాచారంతో నిందితులను గుర్తించి రామాయంపేట సమీపంలో చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి 929.7 గ్రాముల బంగారం, 1.7 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు జాదవ్ జైరాం నాయక్, అలియాస్ చెమ్లా నాయక్ పై ఇప్పటికే పలు జిల్లాలో అనేక చోరీ కేసులు ఉన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. మొత్తం 17 కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు.




## మానవత్వం మంటగలిపిన అమానుష ఘటన



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నందిపేట్‌లో పసి కందును వదిలేసిన అమానుష ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. నందిపేట్ మండల కేంద్రంలో అప్పుడే పుట్టిన పసికందును గుర్తు తెలియని వ్యక్తులు రాజ్‌నగర్ దుబ్బలో నిర్మానుష ప్రదేశంలో వదిలేసి వెళ్లారు. ఆ ప్రాంతంలో క్రికెట్ ఆడుతున్న పిల్లలకు శిశువు ఏడుపు శబ్దం వినిపించటంతో స్థానికులకు సమాచారమందించగా స్పందించి పసిబిడ్డను ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుంగా పసికందు మృతి చెందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/కొల్చారం :** కొల్చారం మండల కేంద్రంలో అప్పులు తీర్చలేనన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పిడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్చారం గ్రామానికి చెందిన మంగలి వెంకటేశం(48) వృత్తిరీత్యా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంతో పాటు ఇటీవల కొత్త ఇల్లు నిర్మించుకోవడంతో అతనిపై భారీగా అప్పులు పేరుకుపోయాయి. ఆ అప్పులు ఎలా తీర్చాలనే ఆందోళనతో గత కొద్ది రోజులుగా తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం వెంకటేశం భార్య రేణుక కూలీ పనుల నిమిత్తం బయటకు వెళ్లింది మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెంకటేశం ఇంటి ముందరి గదిలో నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని మృతుడి మామ మంగళి కిష్టయ్య ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. సమాచారం అందుకున్న వెంటనే కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకుని చూడగా వెంకటేశం మృతి చెందినట్లు ఆయన మరణంపై మాకు ఎలాంటి అనుమానం లేదని మృతుడి భార్య రేణుక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు ఉన్నాడు. రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ మోహినుద్దీన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రి కు తరలించనిట్లు పోలీసులు వెల్లడించారు.

# వ్యభిచార గృహంపై చీతా ఫోర్స్ దాడి

పోలీసు కమిషనర్ వెల్లడి

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు నగరంలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన లక్ష్యంగా సిసిఎస్ ఏసిపి ఇన్‌చార్జి మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీతా ఫోర్స్ సిబ్బంది విస్తృత స్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం 4వ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్, తెలంగాణ పార్కు పక్కన గల ఓ ఇంట్లో వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారంతో చీతా ఫోర్స్ సిబ్బంది ఆకస్మికంగా మెరుపుదాడి నిర్వహించారు. పోలీసులు ఇంటిని పూర్తిగా తనిఖీ చేయగా అక్కడ వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. దాడి సందర్భంగా అక్కడినుండి మొత్తం 7 మొబైల్ ఫోన్లు, ముగ్గురు విటులు, 5 మంది విటురాళ్ళు, రూ. 4870 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడిన వారిని స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం 4వ టౌన్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోకి అప్పగించారు. పట్టణ పరిధిలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు, వ్యభిచార కేం ద్రాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా, జూ దం వంటి అసాంఘిక చర్యలపై నిరంతరం కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. శాంతి భద్రతలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ప్రజాపక్షం
Telugu National Daily

ఖమ్మం
సోమవారం
25-05-2026
www.prajapaksham.in

"సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్'. వెంకటేష్ మహా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా కథ, ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు."

రీల్

## పోస్ట్–ప్రొడక్షన్‌లో 'స్వయంభు'

నిఖిల్ సిద్ధార్థ తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'స్వయంభు'తో రాబోతున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో, పిక్సెల్ స్టూడియోస్ భువన్, శ్రీకర్‌ల నిర్మాణంలో, టాగోర్ మధు సమర్పణలో భారీ పీరియడ్ యాక్షన్ చిత్రంగా రూపొందుతోంది. ఈ ఎపిక్ వెనుక ఉన్న వర్క్‌ని చిత్ర బృందం ఇప్పుడు సినీ ప్రేమికులకు కళ్ళకు కట్టినట్లు చూపించింది.తాజాగా విడుదలైన వీడియోలో సినిమా పోస్ట్ ప్రొడక్షన్, ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ పనుల విస్తృత స్థాయిని చూపించారు. ఇందులో హీరో నిఖిల్ సిద్ధార్థ, దర్శకుడు భరత్ కృష్ణమాచారి, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కెకె సెంథిల్ కుమార్ కలిసి ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థ ఫాంటమ్ ఎఫ్ఎక్స్‌ను సందర్శించారు. అక్కడ వందలాది మంది నిపుణులు 'స్వయంభు' ప్రపంచాన్ని ఫ్రేమ్ ఫ్రేమ్‌గా అద్భుతంగా మలుస్తున్న తీరు వీడియోలో చూపించారు. ఈ చిత్రానికి ఏకంగా 2700కి పైగా వీఎఫ్ఎక్స్ షాట్లు, 750 మందికిపైగా టెక్నీషియన్‌లు పనిచేస్తుండటం విశేషం. భారీ యుద్ధ సన్నివేశాలు, విశాలమైన ప్రాచీన రాజ్యాలు, అద్భుతమైన విజువల్ ప్రపంచాన్ని రూపొందిస్తున్నారు. ప్రతి సీజీ లేయర్‌ను చిత్రబృందం స్వయంగా పర్యవేక్షిస్తూ, తమ విజన్‌కు తగ్గట్టుగా తీర్చిదిద్దుతోంది. ముఖ్యంగా నిఖిల్, సెంథిల్ కుమార్ వీఎఫ్ఎక్స్ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రతి అంశాన్ని దగ్గరుండి పరిశీలిస్తున్నారు. నిఖిల్ సరసన సంయుక్త, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించగా, నిఖిల్ పోషిస్తున్న యోధుడి పాత్రలోని వీరత్వాన్ని ఆవిష్కరించిన తొలి పాట 'రా రా ధీవరా' చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రానికి కేకే సెంథిల్ కుమార్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తుంటే , రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను ఎం. ప్రభాహరణ్, రవీంద్ర నిర్వహిస్తున్నారు.



## చెవిటి, మూగ యువకుడి కథ 'ఇట్లు అర్జున'

డైరెక్టర్ వెంకీ కుడుముల తన నిర్మాణ సంస్థ వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న తొలి చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, మహేష్ ఉప్పల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌తోనే మంచి బజ్ క్రియేట్ చేసింది. అక్కినేని నాగార్జున ఇచ్చిన పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్ గ్లింప్స్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం విడుదలైన పోస్టర్‌లు, 'ఫైండింగ్ అర్జున' అనే స్పెషల్ వీడియో సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. తాజాగా చిత్ర బృందం మ్యూజికల్ జర్నీకి శ్రీకారం చుడుతూ ఓ సరదా ప్రోమోను విడుదల చేసింది. పియానోపై ఓ ట్యూన్ వాయించేందుకు అనీష్ ప్రయత్నిస్తుండగా, మ్యూజిక్ సెన్సేషన్ 'ఓజీ థమన్ ఎస్ కాఫీ మగ్ చేతిలో పట్టుకుని అతన్ని ఆసక్తిగా గమనిస్తుంటారు.ఆ తర్వాత ఇద్దరి మధ్య జరిగే ఫన్నీ సంభాషణ ఆకట్టుకుంటుంది. అనీష్ వాయిస్తున్న ట్యూన్‌ను చూసి సరదాగా ఆటపట్టించిన థమన్, అనంతరం తనదైన శైలిలో మ్యూజికల్ మ్యాజిక్‌ను రివీల్ చేశారు. ఆయన అందించిన సాఫ్ట్ మెలోడీ ఆకట్టుకుంటుంది. ఫస్ట్ సింగిల్‌ను 28న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో హీరో పాత్ర చెవిటి, మూగ యువకుడు కావడంతో సంగీతం కథలో మరింత కీల క పాత్ర పోషించనుంది. థమన్ సంగీతంలో రూపొందుతున్న ఈ ఆ ల్బమ్ సినిమా భావోద్వేగాలను మరింత బలంగా ప్రేక్షకుల కు చేరవేయనుంది. ప్రోమోను బట్టి చూస్తే ఫస్ట్ సింగిల్ ఒక బ్యూటీఫుల్ మెలోడీగా సంగీత ప్రియులను అలరించనుంది.



## 'పెద్ది' సినిమాకు 'పెద్ద' ఆటంకం




* రెంటల్-పర్సంటేజ్‌పై ముదురుతున్న వివాదం
* ఎగ్జిబిటర్లపై నట్టి కుమార్ ఎదురుదాడి
* గొడవకు కారణం 'ఆ నలుగురు'

సంక్రాంతికి విడుదలైన పెద్ద సినిమాల తరువాత ఇప్పుడు మరో పెద్ద సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మెగాస్టార్ చిరంజీవి నట వారసుడు రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' సినిమా విడుదల కానుంది. జూన్ 4వ తేదీన విడుదలకు సిద్ధమవుతున్న 'పెద్ది' సినిమాకు 'పెద్ద' ఆటంకమే ఏర్పడుతోంది. పెద్ది సినిమా విడుదల రోజు నుంచే పర్సంటేజ్ విధానాన్ని అమలు చెయ్యాలని తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం డిమాండ్ చేస్తోంది. కానీ ఈ డిమాండ్‌ను కొంతమంది నిర్మాతలు వ్యతిరేఖిస్తున్నారు. పెద్ది సినిమా విడుదల తరువాత పర్సంటేజ్ విధానం అమలు చేద్దామని నిర్మాతలు అంటున్నారు. కానీ ఈ వాదనను తెలంగాణ ఎగ్జిబిటర్లు అంగీకరించడం లేదు. దీంతో నిర్మాతలకు, ఎగ్జిబిటర్లకు మధ్య వివాదం మరింతగా ముదురుతోంది. తెలంగాణ ఎగ్జిబిటర్ల కీలక సమావేశం హైదరాబాద్ తెలుగు ఫిలిం చాంబర్‌లో జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ ఎగ్జిబిటర్స్ ప్రెసిడెంట్ విజయేందర్ రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ శ్రీధర్, సుదర్శన్ థియేటర్ బాలగోవింద్ రాజ్, రవీంద్ర గోపాల తదితరులు హాజరయ్యారు. తెలంగాణ ఫిలిం ఛాంబర్ కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు మూడు సార్లు చర్చలు జరిగాయి. హరి హర వీర మళ్లీ అప్పుడు రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తాము అన్నారు కానీ సంవత్సరం అయిపోయింది.పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. ఏదో ఒకటి చెప్పాలి అని గ్రేడింగ్ అంటున్నారు. మొదట మూడు వారాలు అన్నారు ఇపుడు 6 వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా జువ్వాడి శేఖర్‌ను ఎన్నుకున్నాము అని చెప్పారు. బాల గోవింద్ మాట్లాడుతూ 120 మంది థియేటర్స్ ఓనర్స్ దీన స్థితిలో వున్నారు. కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. ముందు మూడు వారాలు అన్నా రు కానీ ఇపుడు మళ్లీ ఇంకొక మూడు వారాలు వాయి దా వేస్తున్నారు . మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే అది ఎంత ఇస్తారో చెప్పండి పోయిన 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవిన్యూ వుండేది. ఇపుడు ఎగ్జిబిటర్స్ కి రెవెన్యూ రావడం లేదు కానీ నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తుంది. విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడైనా కూడా పర్సంటేజ్ వుంది. ఇక్కడ మాత్రమే రెంటల్ వుంది. సమస్యను పరిష్కరించకుండా లెట్ చేస్తున్నారు అని తెలిపారు.

'పెద్ది'ని టార్గెట్ చేయొద్దు: నిర్మాత నట్టి కుమార్

రామ్ చరణ్ నటించిన 'పెద్ది' సినిమాను టార్గెట్ చెయ్యొద్దని ,తెలుగు ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయానికి కట్టుబడదాం అని నిర్మాత నట్టి కుమార్ అంటున్నారు. ఒకవేళ 'పెద్ది'కి అడ్డొస్తే ఆమరణ దీక్షకు సిద్ధంగా ఉన్నానని నట్టి కుమార్ ఎగ్జిబిటర్లకు హెచ్చరిక జారీ చేశారు. రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' సినిమా రిలీజ్ కు సిద్ధమైన నేపథ్యంలో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలోని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సమస్యలు సృష్టించడం ఎంతమాత్రం సరి కాదని సీనియర్ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ నట్టి కుమార్ స్పష్టంచేశారు. 'కావాలని 'పెద్ది' సినిమా రిలీజ్ సమయంలోనే ఎగ్జిబిటర్స్‌కు తమ సమస్యలు గుర్తుకు రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వాస్తవానికి సింగిల్ థియేటర్స్ యజమానులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నారు. అయితే వాటిని చర్చల ద్వారా సమంజసమైన రీతిలో పరిష్కరించుకోవాలి. ఇటీవల ఎగ్జిబిటర్స్ పర్సెంటేజ్ విధానం అమలు పరచాలంటూ చేసిన డిమాండ్‌పై సమస్య పరిష్కారం కోసం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ జోక్యం చేసుకుని, ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్‌తో ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. అయితే అందుకు అంగీకరించి, ఇప్పుడు ఉన్నట్లుండి మాట మార్చి, 'పెద్ది' సినిమాకు అడ్డుపడటం ఎంతవరకు కరెక్ట్ అన్నది మరోమారు ఆలోచించాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఏరియాల ఎగ్జిబిటర్స్ పెద్ది సినిమాకు ఎలాంటి సమస్యలు సృష్టించకుండా సహకరిస్తున్నారు. అదేవిధంగా తెలంగాణ ఎగ్జిబిటర్స్ అర్థం చేసుకుని, ఒక పెద్ద సినిమా రిలీజ్ సమయంలో సహకారం అందించాలి. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ నూతన ప్రెసిడెంట్ శేఖర్ తన థియేటర్ ను సునీల్ నారంగ్‌కు లీజ్‌కు ఇచ్చారు. అలాగే బాల గోవింద్ రాజు తన థియేటర్‌కు ప్రత్యేక పర్మిషన్ తెచ్చుకున్నారు. వీరి వెనుక సురేష్ బాబు, దిల్ రాజు, అల్లు అరవింద్, సునీల్ నారంగ్ వంటి నలుగురు ఉన్నారు. ఈ నలుగురే లీజ్ థియేటర్స్‌ను నడుపుతున్నారు. వీరే దీని వెనుక చక్రం తిప్పుతున్నారు. మంగళవారం రాత్రి లోగా 'పెద్ది' సినిమాకు అడ్డు రాకుండా నిర్ణయం జరిగితే ఆనందదాయకమే. లేకుంటే బుధవారం నుంచి నేను ఫిల్మ్ ఛాంబర్ ఎదుట ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటాను అని నట్టి కుమార్ చెప్పారు.

## గుర్తింపు కోసం పోరాడే ఒక వ్యక్తి కథ

### పెద్దిలో మ్యూజికల్ ఈవెంట్‌లో రామ్ చరణ్

రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. పెద్ది జూన్ 4న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది. జూన్ 3న ప్రత్యేక ప్రీమియర్‌లు ప్రదర్శించనున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా చిత్ర బృందం మూడవ సింగిల్ 'హల్లల్లల్లో' పాటను భోపాల్‌లో జరిగిన 'పెద్ది'కి ఆవాజ్' బిగ్గెస్ట్ మ్యూజికల్ ఈవెంట్ లో లాంచ్ చేశారు. ఈ వేడుకలో ఏఆర్ రెహమాన్ ఆయన బృందం ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ మాట్లాడుతూ నా మనసులో మీ అందరికీ ప్రత్యేకమైన స్థానం ఉంది. 'పెద్ది' ప్రమోషన్స్‌ను భోపాల్ నుంచి ప్రారంభించడం నాకు చాలా ఎమోషనల్‌గా అనిపిస్తోంది. 'పెద్ది' సినిమాను మేము ఎంతో మనసుపెట్టి తీశాం. ప్రతి భావోద్వేగం, ప్రతి కష్టం, ప్రతి క్షణాన్ని ఈ సినిమా కోసం అంకితం చేశాం. జూన్ 4న మీ హృదయాల్లో మా సినిమాకు ఒక స్థానం కల్పించాలని కోరుకుంటున్నాను. తన గుర్తింపు కోసం పోరాడే ఒక వ్యక్తి కథ. ఆ పోరాటం మీ హృదయాలను తాకుతుంది. మిమ్మల్ని ఆలోచింపజేస్తుంది, స్ఫూర్తిని ఇస్తుంది. సినిమా చూసిన తర్వాత మళ్లీ మళ్లీ చూడాలనిపించే అనుభూతిని కలిగిస్తుంది. ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చే సినిమా ఇది. నా ఫిల్మ్ లైబ్రరీలో 'పెద్ది' నంబర్ వన్ సినిమాగా నిలుస్తుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరోయిన్ జాన్వీ కపూర్ మాట్లాడుతూ 'పెద్ది'లో చాలా గొప్ప సందేశం ఉంది. ఈ చిత్రంలో రామ్ చరణ్ తో కలిసి నటించే అవకాశం రావడం నా అదృష్టంగా, గౌరవంగా భావిస్తున్నాను. ఏఆర్ రెహమాన్ వంటి ప్రపంచ స్థాయి సంగీత దర్శకుడితో కలిసి పనిచేయడం చాలా ప్రత్యేకమైన అనుభూతి. ఆయన సంగీతం ఈ సినిమాకు మరింత ప్రాణం పోసింది. అలాగే బుచ్చిబాబుకి థాంక్ యూ. ఆయన విజన్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. 'పెద్ది' ఒక అద్భుతమైన సినిమా. జూన్ 4న మనమంతా థియేటర్లలో కలుద్దాం అన్నారు. ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమ దేశమంతటా ప్రేక్షకులను అలరిస్తుండటం గర్వంగా అనిపిస్తోంది. ఈ కార్యక్రమంలో నటుడు రవి కిషన్ , మధ్య ప్రదేశ్ రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి విశ్వాస్ సారంగ్, నటుడు దివ్యేందు శర్మ , నిర్మాత వెంకట సతీష్ కిలారు పాల్గొన్నారు.










'అంతర్జాతీయ తీవ్రవాదం, నిరంకుశత్వం, దురాక్రమణపై పోరాటం: శాంతి, భద్రత కోసం' అనే అంశంపై 3వ అంతర్జాతీయ ఫాసిస్ట్ వ్యతిరేక వేదిక సదస్సు మాస్కోలో రష్యన్ ఫెడరేషన్ కమ్యూనిస్టు పార్టీ (సిపిఆర్ఎఫ్) ప్రధాన కార్యదర్శి గెన్నాడీ జ్యుగానోవ్ ప్రారంభించారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరపున సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా సదస్సులో పాల్గొన్నారు. పక్క చిత్రంలో గెన్నాడీ జ్యుగానోవ్‌తో సంభాషిస్తున్న రాజా, రామకృష్ణ పాండా.

## నిప్పుల కొలిమే!

(మొదటి పేజీ తరువాయి)

కలిగిస్తున్నాయి. రాబోయే ఐదు రోజుల పాటు రాష్ట్రంలో తీవ్రమైన వడగాలుల ప్రభావం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వాతావరణ కేంద్రం అధికారులు పలు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. శనివారం రాష్ట్రంలోనే అత్యధికంగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం బుద్ధిపల్లిలో 48.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదై రికార్డు సృష్టించింది. ప్రధాన నగరాల్లో ఒకటైన ఖమ్మంలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగటి పూట ఉష్ణోగ్రతలే కాకుండా, రాత్రి వేళల్లో కూడా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల మేర రికార్డవుతుండటంతో రాత్రుళ్లు కూడా వేడి తీవ్రత జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వచ్చే ఐదు రోజులపాటు రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు. కొన్ని జిల్లాల్లో 44 డిగ్రీలకుపైగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనగా ఉందన్నారు. 27వ తేదీ తర్వాత ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల మేర తగ్గే అవకాశం ఉందన్నారు. వాతావరణ శాఖ తాజా బులెటిన్ ప్రకారం ఈ నెల 26 వరకు కోమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తీవ్ర వడగాలుల ప్రభావం ఉండే అవకాశం ఉందన్నారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. నిర్మల్, నిజామాబాద్, జనగాం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కూడా వడగాలుల పరిస్థితులు కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్‌కు సమీపంలో నమోదవుతున్నాయని అధికారులు తెలిపారు.

**ఈనెల 26న కేరళంలోకి నైరుతి రుతుపవనాలు..**

ఇక మరోవైపు నైరుతి రుతుపవనాలు క్రమంగా చురుకుగా కదులుతున్నాయని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మధ్య బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 26న కేరళంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు వివరించారు. ప్రస్తుతం నైరుతి బీహార్ పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం జార్ఖండ్ ఉత్తర ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ వరకు కొనసాగుతోందన్నారు. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రాబోయే రోజులలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు.







## అంతిమ వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

విశాలాంధ్ర సంపాదకులు ఆర్.వి.రామరావు, తెలంగాణ సాహిత్య అకాడామీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ తదితరులు ఏటుకూరి ప్రసాద్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అంతకు ముందు ఏటుకూరి ప్రసాద్ భౌతికకాయంపై సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్. ఛా యాదేవి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి. స్టాలిన్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, పి.ప్రేమ్‌పావ ని, బి.వెంకటేశం, పానుగంటి పర్వతాలు, చంద్రమోహన్ గౌడ్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్.శ్రీకాంత్, ఉపాధ్యక్షులు మర్రి శ్రీమాన్, ప్రజానాట్య మండలి రా ష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, నాయకులు లక్ష్మి నారాయణ, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి సి.చెన్నకేశవరావు తదితరులు నివాళులర్పించారు.

**అరసం పునర్ నిర్మాణంలో కీలక పాత్ర : నారాయణ**

ప్రముఖ కవి, నవచేతన పబ్లిషింగ్‌హౌజ్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ మరణం పట్ల సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. తుదిశ్వాస వరకు సిపిఐ సభ్యుడిగా కొనసాగిన ఏటుకూరి ప్రసాద్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) పునర్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని నారాయణ పేర్కొన్నారు. ప్రసాద్ మృతి పట్ల సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానూభూతిని తెలిపారు. ఏటుకూరి ప్రసాద్ మృతి పట్ల సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఏటుకూరి ప్రసాద్ తన రచనల ద్వారా మంచి పుస్తకాలు, విప్లవ పాటలను పార్టీకి అందించారని సత్యంపేర్కొన్నారు.

## తుది దశకు చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన అన్నారు. అంతర్జాతీయ అణుశక్తి ప్రకారం, ఇరాన్ వద్ద 440.9కిలో గ్రాముల యురేనియం ఉంది. దీని స్వ చ్ఛత 60శాతం వరకు సుసంపన్నం చేయబడింది. ఇది ఆయుధ స్థాయి 90 శాతానికి కేవలం ఒక చిన్న సాంకేతిక అడుగు మాత్రమే. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడంతో పాటు, హోర్ముజ్ జలసంధిని కూడా క్రమంగా తెరుస్తారని ఆ అధికారి తెలిపారు.

**హెజ్బుల్లా విషయంలో ఇజ్రాయెల్ ఆందోళన...**

ఇరాన్‌తో పొత్తు పెట్టుకున్న లెబనీస్ మిలిటెంట్ గ్రూప్ అయిన హెజ్బుల్లా ఇజ్రాయెల్‌కు తీవ్రమైన ముప్పుగా పరిణమించిందని, దానిని నిరాయుధీకరణ చేసేందుకు లెబనాన్‌కు తగిన సదుపాయాలు లేవని ఇజ్రాయెల్ అధికారులు ఆందోళన చెందుతున్నారు. సంభాషణ గురించి తె లిసిన ఒక అధికారి ప్రకారం..ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ 'లెబనాన్‌తో సహా అన్ని రంగాలలో ముప్పులకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ స్వేచ్ఛా చర్యను కొనసాగిస్తుంది'అని ట్రంప్‌ను హెచ్చరించారు.

## బస్సుల్లో నిఘా నేత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

'బస్సులో భరోసా' పేరిట రూపొందించిన ఈ సరికొత్త హైటెక్ భద్రతా ప్రాజెక్టును తొలి దశలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని సుమారు 175 బస్సుల్లో ఈ అత్యాధునిక నిఘా నేత్రాలను అమర్చారు.

**ఆర్‌టిసి కంట్రోల్ రూమ్ నుండి నిరంతర పర్యవేక్షణ**

డ్రైవర్ క్యాబిన్ సమీపం, మహిళల కోసం కేటాయించిన ప్రత్యేక సీట్లు, ఫుట్‌బోర్డుతో పాటు బస్సు లోపల చివరి సీటు వరకు ప్రతి అంగుళం స్పష్టంగా కవర్ అయ్యేలా ఈ కెమెరాలను ప్రత్యేక సాంకేతికతతో అమర్చడం విశేషం. ఈ విజువల్స్ అటు డ్రైవర్, కండక్టర్లకు అందుబాటులో ఉండటమే కాకుండా ఆర్‌టిసి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా కనెక్ట్ చేశారు. దీనివల్ల బస్సుల్లో దొంగతనాలు చేసే ముఠాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ముందే గుర్తించి అప్రమత్తం కావడానికి, ఒకవేళ ఏదైనా అవాంఛనీయ సంఘటన లేదా ప్రమాదం జరిగితే తక్షణమే ఖచ్చితమైన ఆధారాలను సేకరించడానికి ఈ వ్యవస్థ ఎంతగానో దోహదపడనుంది. బస్సులో సిసి కెమెరా ఉందనే భయం నేరగాళ్లలో గుబులు పుట్టిస్తుందని, ప్రయాణం మరింత సురక్షితంగా మారుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ కెమెరాల ఏర్పాటు వల్ల సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని అధికారులు పేర్కొంటున్నారు. రాబో యే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల బస్సుల కు ఈ సిసి కెమెరాల రక్షణ కవచాన్ని విస్తరించడానికి టిజిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

## అత్యవసరమైతేనే వెళ్లండి

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక ప్రభుత్వాల ఆరోగ్య మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించింది. వ్యక్తిగత పరిశుభ్రత, రక్షణ చర్యల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. అంతేకాకుండా విదేశీ ప్రయాణికులపై విమానాశ్రయాల్లో ఆరోగ్య తనిఖీలు కఠినతరం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అవసరమైతే ప్రత్యేక స్క్రీనింగ్ చర్యలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు, ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర కమిటీ, మే 22న సభ్య దేశాలకు తాత్కాలిక మార్గదర్శకాలు జారీ చేసింది. ముఖ్యంగా విమానాశ్రయాలు, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచాలని సూచించింది. కాంగో, ఉగాండా ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో జ్వరం లేదా అనుమానాస్పద లక్షణాలు ఉంటే వెంటనే గుర్తించి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. అలాగే వైరస్ గుర్తించిన ప్రాంతాలకు ప్రయాణాలను తగ్గించాలని డబ్ల్యూహెచ్ఓ సూచించింది. 'మామూలుగా ఎబోలా వైరస్ జంతువులు, గబ్బిలాలకు సోకుతుంది. ఆ వైరస్ సోకిన జంతువులను వేటాడి (బుష్‌మీట్) తినడం వల్ల మనుషులకు వ్యాప్తి చెందుతుంది. అయితే, వ్యాధి లక్షణాలు కనిపించడానికి మాత్రం 21 రోజుల సమయం పడుతుంది. ఫ్లూ, మలేరియా, జ్వరం వంటి లక్షణాలు తొలుత కనిపించినా, చివరకు అవయవాల వైఫల్యానికి దారితీసే అవకాశం ఉంది. కొన్ని కేసుల్లో శరీరం లోపలా, బయటా రక్తస్రావం అయ్యే అవకాశం ఉంది. వైరస్ సోకిన వ్యక్తి శరీర ద్రవాల ద్వారా ఇది ఇతరులకూ వ్యాపిస్తుంది' అని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com